కేంద్ర సాయంపై సిపిఎం అసంతృప్తి

2

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 69 | విజయవాడ, బుధవారం 9 అక్టోబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 9 October 2024 | Rs

భౌతిక శాస్త్రంలో జాన్, జఫరీలకు నోబెల్

జఫరీ

జాన్

స్టాక్‌హోం : భౌతిక శాస్త్రంలో అమెరికా శాస్త్రవేత్త జాన్ జె.హాప్‌ఫీల్డ్, కెనడియన్ బ్రిటీష్ శాస్త్రవేత్త జఫరీ ఇ.హింటన్‌లకు నోబెల్ బహుమతి లభించింది. కృత్రిమమైన న్యూరల్ నెట్‌వర్క్‌లతో మెషిన్ లెర్నింగ్‌కు వీలు కల్పించే ప్రాథమిక ఆవిష్కరణలకు గానూ ఈ అత్యున్నత పురస్కారం వారిని వరించింది. ఈ మేరకు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ప్రకటించింది. శక్తివంతమైన మెషిన్ లెర్నింగ్‌కు పునాదులుగా నేడున్న పద్ధతులను అభివృద్ధిపరచడానికి భౌతిక శాస్త్రంలోని సాధనాలను ఉపయోగించి ఈ ఆవిష్కరణలు చేశారని అకాడమీ ఒక ప్రకటనలో పేర్కొంది. వీరి కృషి ఇప్పటికే మహత్తర ప్రయోజనాలను అందిస్తోందని నోబెల్ కమిటీ ఛైర్మన్ ఎలెన్ మూన్స్ వ్యాఖ్యానించారు.

కుమారస్వామిని కలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

కొన్ని ఇబ్బందులున్నాయి

- వైజాగ్ స్టీల్‌ప్లాంటుపై సిఎం
- ప్రైవేటీకరణకు ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నాం
- విలీనానికి సెయిల్‌తో పాటు కేంద్రం కూడా ఒప్పుకోవాలి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అంశం జటిలమైన సమస్య అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రెండవ రోజైన మంగళవారం చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, కుమారస్వామి, నితిన్ గడ్కరీ, పియూష్ గోయల్, హర్దీప్ సింగ్ పూరిలతో సమావేశమయ్యారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'కొన్ని ఇబ్బందులున్నాయి. వాటిని ఎలా పరిష్కరించాలి? ఎలా శాశ్వత పరిష్కారం చేయాలి? అని ఆలోచిస్తున్నాం. ఇది ఒక మనోభావాలకు సంబంధించిన అంశం.' అని అన్నారు.'స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలంటే, సెయిల్‌తోపాటు కేంద్ర ప్రభుత్వం అంగీకరించాలి. అదే పెద్ద సమస్యగా ఉంది. పెట్టుబడుల ఉపసంహరణ ఆగాలన్నా చాలా నిధులు కావాలి. ఎన్‌ఎండిసి ఇచ్చే నిధులు ఏ మూలకూ చాలవు' అని ఆయన చెప్పారు. 'జటిలమైన సమస్యలన్నింటిని పరిష్కారం చేసుకున్నాం. ఇప్పుడు ఇది ప్రధానంగా వచ్చింది. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామితో ప్రత్యామ్నాయాలు ఏమున్నాయో వాటి గురించి చర్చించాను. గతంలో ఈ విషయమై దృష్టి పెట్టకుండా నష్టాల్లోకి నెట్టేశారు' అని అన్నారు. 'స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిగా పునరుద్ధరించడానికి ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నాం.' అని చెప్పారు. స్టీలుప్లాంటును సక్రమంగా నడవనీయకుండా చూడటానికి కొందరు అనేక విధాలుగా ప్రయత్నించారని చెప్పారు. 'ఎవరు ఏ విధంగా ప్రయత్నించారో నా వద్ద పూర్తి సమాచారం లేదు. అడ్మినిస్ట్రేషన్ విఫలం కావడం కావచ్చు. లేకపోతే కొన్ని నిర్ణయాలు కూడ కారణం కావచ్చు ఏదైనా స్టీల్‌ప్లాంట్ సమస్యల్లో పడింది' అని అన్నారు. భూమిని ఇస్తే ఎన్‌ఎండిసి చేసే కొంత ఆర్థిక సాయం చేస్తుందని, అయితే అది తాత్కాలికమే అవుతుందని చెప్పారు. 'ఆ సాయం చాలదు. దాంతో స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణ జరగదు' అని చెప్పారు. దీనికి ఒక ప్యాకేజీ ఇచ్చేటట్లు ఆలోచిస్తే తప్ప పునరుద్ధరించలేం. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ముడి సరుకు కూడా లేదని అది కూడా సమస్యేనని చెప్పారు. ప్రైవేటీకరణ కాకుండా ఆపడానికి ఉండే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామని తెలిపారు. విశాఖ ఉక్కుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్న అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, 'సమావేశం పెడితే ఏమి ఉపయోగం. రాజకీయాలు చేస్తారు తప్ప'

మిగతా 7లో

జమ్ముకాశ్మీర్ ఇండియా బ్లాక్‌దే

హర్యానాలో బిజెపి గెలుపు • హర్యానా ఫలితాలను అంగీకరించబోమన్న కాంగ్రెస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమ్ముకాశ్మీర్‌ను ఇండియా బ్లాక్ కైవశం చేసుకుంది. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35 (ఏ) రద్దు (పదేళ్ల) తరువాత జరిగిన మొదటి ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి), కాంగ్రెస్, సిపిఎం పార్టీలతో కూడిన ఇండియా బ్లాక్ ఘన విజయం సాధించింది. బిజెపి ఎత్తులను చిత్తు చేస్తూ జమ్ముకాశ్మీర్ ప్రజలు తీర్పిచ్చారు. నేషనల్ కాన్ఫరెన్స్ 42, కాంగ్రెస్ 6, సిపిఎం 1 స్థానాల్లో ఘన విజయం సొంతం చేసుకున్నాయి. దీంతో ఇండియా బ్లాక్ 49 స్థానాల్లో విజయం సాధించింది. బిజెపి కేవలం 29 సీట్లకు పరిమితమైంది. పిడిపి 3, ఆప్, జెపిసి పార్టీలు చెరొక స్థానంలో గెలుపొందాయి. ఇండిపెండెంట్లు ఏడుగురు విజయం సాధించారు.

హర్యానాలో బిజెపి గెలుపొందింది. వరుసగా మూడు సార్లు హర్యానాలో ఆ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ రాజకీయాలు, సంస్థాగత బలోపేత లేమి ఆపార్టీ ఓటమికి కారణమయ్యాయి. ఈ ఫలితాలను అంగీకరించబోమని, ఇవిఎంలు ట్యాంపరింగ్ జరిగిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అందుకు కారణం లేకపోలేదు. ఫలితాలు లెక్కింపు ప్రారంభమై దాదాపు మూడు గంటల వరకు కాంగ్రెస్ దాదాపు 60 స్థానాల వరకు లీడింగ్‌లో ఉంది. ఆ తరువాత ఎన్నికల ఫలితాలు తారుమారయ్యాయి. ఒక్కసారిగా బిజెపి లీడింగ్ పెరిగింది. ఇలాంటి పరిణామం ఇటీవలి కాలంలో దాదాపుగా ఎప్పుడూ జరగలేదు. మరోవైపు పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో కాంగ్రెస్‌కు మెజార్టీ వచ్చింది. దీంతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసింది. హర్యానా ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ ఫోల్స్‌ను తారుమారు చేశాయి. హర్యానాలో బిజెపి 48, కాంగ్రెస్ 37, ఐఎన్‌ఎల్‌డి 2, స్వతంత్రులు ముగ్గురు విజయం సాధించారు.

బద్గామ్‌లో గెలుపొందిన తర్వాత మద్దతుదారులతో సంబరాలు చేసుకుంటున్న నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా

ప్రముఖుల ఓటమి... గెలుపు

ఈ ఎన్నికల్లో పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రులు ఓటమి చవిచూశారు. మాజీ సిఎంలు, పార్టీ అధ్యక్షులు గెలిచారు. హర్యానాలో కాంగ్రెస్ చీఫ్ ఉదయ్ భాన్, మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా, ఐఎన్‌ఎల్‌డి అధ్యక్షుడు అభయ్ చౌతాలా, జననాయక్ జనతా పార్టీ నేత దిగ్విజయ్ సింగ్ చౌతాలా, ఆప్ సీనియర్ నేత అనురాగ్ ధండా ఓటమి చవిచూశారు. హర్యానాలో సిఎం నయబ్ సింగ్, మాజీ సిఎం భూపిందర్ సింగ్ హుడా, రెజ్లర్ వినేష్ ఫోగట్, దేశంలోనే అత్యంత సంపన్న మహిళా సావిత్రి జిందాల్ విజయం సాధించారు.

జమ్ము కాశ్మీర్‌లో బిజెపి చీఫ్ రవీందర్ రైనా, పిడిపి అధినేత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ ఓటమిపాలయ్యారు. పార్లమెంట్‌పై దాడి కేసులో దోషిగా ఉన్న అఫ్జల్‌గురు సోదరుడైన స్వతంత్ర అభ్యర్థి ఐజాజ్ అహ్మద్ గురూ, జమ్మూకాశ్మీర్ అప్ని పార్టీ అధినేత సయ్యద్ అల్తాఫ్ బుఖారీ, బిజెపి సీనియర్ నేత కుల్దీప్ రాజ్ దుబే ఓడిపోయారు. మరోవైపు నేషనల్ కాన్ఫరెన్స్ అగ్రనేత ఒమర్ అబ్దుల్లా తాను పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ విజయం సాధించారు.

జమ్ము కాశ్మీర్

పార్టీ పేరు	సీట్లు	ఓట్లు శాతం
ఎన్‌సి	42	23.43
కాంగ్రెస్	6	11.97
సిపిఎం	1	0.59
బిజెపి	29	25.64
పిడిపి	3	8.87
జెపిసి	1	---
ఆప్	1	0.52
స్వతంత్రులు	7	

హర్యానా

పార్టీ పేరు	సీట్లు	ఓట్లు శాతం
బిజెపి	48	39.94
కాంగ్రెస్	37	39.09
ఐఎన్‌ఎల్‌డి	2	4.14
స్వతంత్రులు	3	

తరిగామి విజయంతో సిపిఎం కార్యకర్తల హర్షాతిరేకాలు

మంచుకొండల్లో ఎగిరిన ఎర్రజెండా

- తరిగామి ఘన విజయం
- కుల్గాం నుంచి అయిదవసారి ఎన్నిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మంచుకొండల్లో ఎర్రజెండా మరోసారి రెపరెపలాడింది. జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో కుల్గాం నుంచి పోటీ చేసిన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు యూసఫ్ తరిగామి విజయఢంకా మోగించారు. ఎన్‌సి-కాంగ్రెస్ కూటమి మద్దతుతో పోటీ చేసిన ఆయన తన సమీప ప్రత్యర్థి జమాతే పార్టీకి చెందిన అభ్యర్థి అహ్మద్ రేషి పై 7,838 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం పోలైన ఓట్లలో తరిగామికి 33, 634 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి రేషికి 25, 796 ఓట్లు మాత్రమే వచ్చాయి. 1990కి ముందు ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన వేర్పాటువాద, తీవ్రవాద సంస్థ జమాతే ఇస్లామీ యూటర్న్ తీసుకుని ఎన్నికల్లో పోటీ చేస్తోంది. బిజెపితో లోపాయికారీ పొత్తు పెట్టుకుని కుల్గాంలో సిపిఎంను ఓడించడమే లక్ష్యంగా పనిచేసింది. మతం పేరుతో ఓట్లను అభ్యర్థించింది. అయితే, చైతన్యయుతమైన కుల్గాం ప్రజలు దీనిని తిరస్కరించి, తరిగామికి అండగా నిలిచారు. కుల్గాం నుంచి 1996, 2002, 2008, 2014 ఎన్నికల్లో వరుసగా విజయం సాధిస్తూ వచ్చిన సిపిఎం నేతకు ఇది అయిదో విజయం. ఈ సందర్భంగా తరిగామి విలేకరులతో మాట్లాడుతూ " కుల్గామ్ ప్రజలకు సెల్యూట్ చేస్తున్నాను. వారు కుల్గామ్ కోసం, కాశ్మీర్ కోసం, కాశ్మీర్ ప్రజల హక్కుల కోసం దృఢంగా నిలిచారు. బిజెపి ప్రభుత్వానికి సహకరించిన వారికి తగిన శాస్తి చేశారు" అని చెప్పారు.

సిఎం కుర్చీ కోసమే సనాతన వాదం

- మతవిద్వేషాలు రెచ్చగొట్టడం మంచిది కాదు
- నెల్లూరులో ఫిబ్రవరి 1నుంచి 3వ తేది వరకు సిపిఎం రాష్ట్ర మహాసభ
- ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశంలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

ముఖ్యమంత్రి కుర్చీ కోసమే సనాతన వాదం వినిపిస్తూ మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, ఇది సమాజానికి ఏ మాత్రమూ మంచిది కాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరు నగరంలో జరిగే సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటు మంగళవారం టౌన్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడానికి బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. రూ.500 కోట్లతో అయోధ్యలో రామమందిరం నిర్మాణం చేసి రాజకీయ లబ్ధి పొందడానికి బిజెపి చేసిన ప్రయత్నాలను అక్కడి ప్రజలు తిప్పికొట్టారన్నారు. బిజెపి దుష్ట విధానాలను రాష్ట్రంలో టిడిపి, జనసేన పార్టీలు అమలు చేస్తున్నాయని విమర్శించారు. జనసేన నేత పవన్ కల్యాణ్‌ను ముందుపెట్టి ఇప్పుడు తిరుపతి లడ్డూపై పడ్డారని అన్నారు. సనాతన ధర్మం పేరుతో హడావుడి చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. చంద్రబాబునాయుడు తర్వాత లోకేష్ ముఖ్యమంత్రి అవుతారనే ఉద్దేశంతో మధ్యలోనే చంద్రబాబును పక్కన పెట్టి పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయాలని బిజెపి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. బిజెపి అజెండాను పవన్ అమలు చేస్తున్నారన్నారు. అందులో ఆయనను ముందుపెట్టి బిజెపి నాటకాలాడుతోందని విమర్శించారు. తనకు ఏ మతమూ లేదని, నీ మతం నా మతం అంటూ ఏడాది క్రితం చెప్పిన పవన్ కల్యాణ్... ఇప్పుడు సనాతన ధర్మం అంటున్నారని గుర్తు చేశారు. విప్లవవీరుడు చే గువేరాను పెట్టుకొని తిరిగిన ఆయన ఇప్పుడు మోడీ భజన చేస్తున్నారని సోషల్ మీడియా కోడైకూస్తోందన్నారు. బిజెపి అజెండాను ఎదుర్కొని, మతోన్మాదాన్ని తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం మోడీ విధానాలు అమలు చేసి భ్రష్టుపట్టి ప్రజల తిరస్కారానికి గురైందన్నారు. ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం అదే విధానాలు అమలు చేస్తోందని, ప్రజల నుంచి వ్యతిరేకతను

మిగతా 2లో

సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటు సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

జ్యోత్స్న ఇకలేరు

- రాజస్థాన్ రోడ్డు ప్రమాదంలో మృతి

ప్రజాశక్తి- విజయవాడ

జ్యోత్స్న (ఫొటో)

అమరావతి బాలోత్సవ్ కమిటీ కార్యదర్శి, తరుణీ తరంగాలు ప్రధాన కార్యదర్శి, సేఫ్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ న్యాయవాది, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) అధ్యక్షులు, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి గుళ్ళపల్లి జ్యోత్స్న (65) రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఆశీష్, అనీష్ ఉన్నారు. పెద్ద కుమారుడు ఉద్యోగం రీత్యా లండన్‌లో, చిన్న కుమారుడు విజయవాడలో ఉంటున్నారు. జోత్స్న భౌతికకాయం విజయవాడకు బుధవారం చేరుకుంటుందని, ప్రజల సందర్శనార్థం ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు సీతారాంపురం సన్‌రైజ్ హాస్పిటల్ పక్క వీధిలోని వారి స్వగృహం వద్ద ఉంచనున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. జ్యోత్స్న మృతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం తెలిపారు.

16న సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్

- 40 రోజుల్లోగా ప్రక్రియ పూర్తి చేసేలా ప్రణాళిక : మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఈనెల 16న ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మలరామానాయుడు పేర్కొన్నారు. 40 రోజుల్లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆయన సూచించారు. మంగళవారం సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ సిఇలు, ఎస్ఇలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్‌టిఆర్ హయాం నుంచి చంద్రబాబు వరకు సాగునీటి రంగంపై ఎక్కువ ఆసక్తి అని, అందుకే ఈ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గత ఐదేళ్ల పాలనలో సాగు నీటి వ్యవస్థలతో పాటు ,మురుగునీటి పారుదల వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయన్నారు. కనీసం పూడికతీత, తూటుకాడ తొలగింపు పనులు చేయకపోవడంతో చివరి పొలాలకు సాగు నీరు అందని పరిస్థితి ఉండేదన్నారు. సాగునీటి వ్యవస్థకు పునరుజ్జీవం కల్పించాలనే సిఎం సంకల్పం మేరకు రాష్ట్రంలోని 6,219 సాగు నీటి సంఘాలకు 252 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 56 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. లోక లైజేషన్ పూర్తయిన కొత్త ప్రాజెక్టులు ఏమైనా ఉంటే వెంటనే కాడా కమిషనరుకు ప్రతిపాదనలు పంపాలని, కొత్త జిల్లాల ప్రకారమే ఎన్నికలు నిర్వహించనున్నామని తెలిపారు. నీటిపారుదల శాఖ విస్తీర్ణాన్ని నిర్ణయించాల్సిఉందని, పునర్విభజన పూర్తయిన తర్వాత రెవన్యూశాఖ ఓటర్ల జాబితాలో చేర్చాలని లేనిపక్షంలో ఒరిజనల్ పట్టాదారు ఓటరుగా నమోదవుతారని తెలిపారు. ముందస్తుగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని, ఇలా అన్ని జిల్లాల్లో ఎటువంటి గొడవలు లేకుండా సాగునీటిసంఘాల ఎన్నికలు జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

నిమ్మల రామానాయుడు

తొమ్మిదేళ్ల నిఘా!

• మొసాద్ కోవర్టు అపరేషన్ గుట్టు రట్టు • బయటపెట్టిన వాషింగ్టన్ పోస్టు కథనం

వాషింగ్టన్ : హిజ్బుల్లా ఫైటర్లు ఉపయోగించే పేజర్లను పేలుడు పదార్ధాలుగా మార్చడానికి ఇజ్రాయిల్ నిఘా సంస్థ మొసాద్ నిర్వహించిన కోవర్ట్ ఆపరేషన్ గుట్టును వాషింగ్టన్ పోస్ట్ బట్టబయలు చేసింది. ఈ మేరకు ఒక వార్తా కథనాన్ని వెలువరించింది. ఆ కథనం ప్రకారం, హిజ్బుల్లా కమాండర్లు, ఫైటర్లు ఉపయోగించే పేజర్లలో మొసాద్ పేలుడు పదార్ధాలను చొప్పించింది. లెబనాన్‌వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పేలిన ఈ పేజర్ల వల్ల మూడు వేల మందికి పైగా హిజ్బుల్లా కార్యకర్తలు మరణించారు. తామెంతగానో విశ్వసించే ఈ పేజర్లను ఇజ్రాయిల్ బాంబులతో నింపేసిందని వారికేమాత్రం తెలియదు.

తన సభ్యుల మధ్య సమాచార మార్పిడికి గానూ నమ్మకమైన కమ్యూనికేషన్ సాధనాలు కావాలని హిజ్బుల్లా 2022లో భావించింది. ఆ సమయంలో ఇజ్రాయిల్ సంస్థ అపోలో ఎఆర్924 పేజర్లను ప్రవేశపెట్టింది. ఈ పేజర్ కొంచెం పెద్దదిగా వున్నప్పటికీ వాటర్‌ప్రూఫ్ సామర్ధ్యం కలిగి వుంటుంది. అదీగాక దీనికి గల పెద్ద బ్యాటరీ, నెలల తరబడి చార్జింగ్ చేయకపోయినా పనిచేసేలా వుంది. వీటన్నింటికన్నా తమ శత్రువు వాటిని కనిపెట్టలేరని హిజ్బుల్లా భావించింది. దాంతో ఏకంగా ఐదు వేల పేజర్లను కొనుగోలు చేసింది. మధ్యస్థాయి ఫైటర్లకు, సపోర్ట్ సిబ్బందికి ఫిబ్రవరిలో అందజేసింది. ఆ పేజర్లలో పేలుడు పదార్థాలు దాగి వున్నాయని, వాటిని ఉపయోగించడానికి సిద్ధపడగానే పేలిపోతాయని వారికి తెలియదు. అన్నిటికంటే ఈ పేజర్లను ఉపయోగించాల్సి వచ్చినప్పుడు రెండు చేతులతో ఆపరేట్ చేయాల్సి వచ్చేలా రెండంచెల డీ ఎన్‌క్రిప్షన్ పద్ధతిని అమలు చేశారు. ఫలితంగా వేలాదిమంది హిజ్బుల్లా ఫైటర్లు, మరికొంతమంది సామాన్యులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా అమలు చేయడంతో ఒక ఇంటెలిజెన్స్ సంస్థ, శత్రువును ఎదుర్కొన్న తీరు ఇటీవలి చరిత్రలో సంచలనం సృష్టించింది.

ఈ ఆపరేషన్ గురించి అనేక కొత్త విషయాలు బయటపడ్డాయి. ఇజ్రాయిల్, అరబ్, అమెరికా భద్రతా అధికారులు, రాజకీయ నేతలు, దౌత్యవేత్తలు ఇలా పలువురు ఇందుకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పలు ఇంటర్వ్యూల్లో పంచుకున్నారు. లెబనాన్ అధికారులు, హిజ్బుల్లాకు సన్నిహితులు కూడా మరికొంత సమాచారాన్ని అందించారు. పేరు వెల్లడించకూడదనే షరతుపై అత్యంత సున్నితమైన ఈ నిఘా వ్యవహారం గురించి చర్చించారు. మొసాద్ ప్రధాన కార్యాలయంలో ఇందుకోసం ఏళ్ల తరబడి ప్రణాళికలు రూపొందించారు. పలు దేశాల్లో ఇందుకోసం మరికొంతమంది పనిచేశారు. ఈ కుట్ర వల్ల హిజ్బుల్లాకు చెందిన వేలాదిమంది కార్యకర్తలను హతమార్చడమే కాకుండా ఉన్నత నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని, పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత విస్తరించడానికి కారణమైంది. ఇక వైమానిక దాడులు, ఆ తర్వాత నెమ్మదిగా భూతల దాడులతో హిజ్బుల్లాను క్షేత్ర స్థాయిలో తుడిచిపెట్టేయవచ్చని ఇజ్రాయిల్ పాలకవర్గం భావించింది. మొత్తంగా ఈ కుట్రకు 2022లోనే తెర తీసినా, అక్టోబరు 7నాటి దాడులకు సరిగ్గా ఏడాది ముందుగానే ఈ కుట్రలోని కొన్ని భాగాల అమలు ప్రారంభమైంది. ప్రత్యర్థులను మట్టుబెట్టడంలో సిద్ధహస్తులైన మొసాద్ వ్యూహకర్తలు ఎలక్ట్రానిక్ పర్యవేక్షణల ద్వారా, వేగుల ద్వారా శత్రు శిబిరంలోని కీలక సమాచారాన్ని సేకరించడానికి ప్రయత్నించారు. ఇక ఆ తర్వాత శత్రువుకు నమ్మకం కలిగించేలా కమ్యూనికేషన్ పరికరాలను రూపొందించడంపై దృష్టి పెట్టారు. దీనికి బీజం 2015లోనే పడింది. తొలుత వాకీటాకీలను లెబనాన్‌లోకి చొప్పించిన మొసాద్, పెద్ద సైజు బ్యాటరీతో టూ వే రేడియో కలిగిన మొబైల్‌లో పేలుడు పదార్థాలు, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను దాచివుంచారు. ఈ పరికరాలతో హిజ్బుల్లా సమాచారమంతా ఇజ్రాయిల్ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇలా తొమ్మిది సంవత్సరాలు హిజ్బుల్లాపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టిన మొసాద్ వాకీటాకీలను బాంబులుగా మార్చే అవకాశాన్ని అట్టిపెట్టుకుంది. ఈలోగా కొత్త అవకాశం వచ్చింది. పేజర్లు శక్తివంతమైన పేలుడు పదార్థాలుగా మారాయి.

ఇజ్రాయిల్ విద్రోహ చర్యల గురించి అనుమానాలు వున్న హిజ్బుల్లా ఇజ్రాయిల్‌తో సంబంధమున్న ఏ దేశం నుండి కూడా ఏవీ కొనుగోలు చేయరాదని భావిస్తున్న తరుణంలో ఇజ్రాయిల్‌తో, అలాగే యూదు ప్రయోజనాలతో ఏ మాత్రం సంబంధం లేని, పైగా మంచి గుర్తింపు కలిగిన తైవాన్ బ్రాండ్ అపోలో పేజర్ల కొనుగోలు కోసం 2023లో పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందాయి. ఆ కంపెనీకి కూడా ఈ ప్రణాళిక గురించి ఏ మాత్రమూ తెలియదు. తైవాన్ నుండి వచ్చిన పేజర్లు ఇజ్రాయిల్‌లో అసెంబుల్ అయి లెబనాన్ చేరాయి.

కౌలు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కొత్త చట్టం

- కౌలు రైతు సంఘం డిమాండ్

3

'శ్రీశైలానికి' ఢోకా లేదు

- ఆనకట్టను పరిశీలించిన వరల్డ్ బ్యాంకు, సిడబ్ల్యుసి బృందాలు

2

జాబాలియా శరణార్థ శిబిరంపై దాడి

- వైమానిక, భూతల దాడుల్లో 43 మంది మృతి
- వీధుల్లో చెల్లాచెదురుగా మృత దేహాలు

7

ఉపాధి నిధులు మళ్లించడం దుర్మార్గం

● వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి, అమరావతి బ్యూరో:
ఉపాధి పథకం నిధులను రోడ్ల నిర్మాణానికి మళ్లించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన దుర్మార్గమైన చర్యగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం విమర్శించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు ఒక ప్రకటన విడుదల చేశారు. అతివృష్టి, అనావృష్టిలతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు పనులు వలస పోతుంటే ఇలాంటి నిర్ణయం ఎలా తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. కుటుంబంలో ఇద్దరు లేక ముగ్గురు పని చేయడం వల్ల వంద రోజుల పనిదినాలు పూర్తయ్యాయని దీంతో ఆ కుటుంబాలు పనుల కోసం వలస బాట పడుతున్నారని పేర్కొన్నారు. పేదలు పస్తులతో ఉంటుంటే రోడ్ల నిర్మాణానికి, యంత్రాలకు, కాంట్రాక్టర్లకు ఉపాధి నిధులు మళ్లించాలని చూడటం భావ్యం కాదన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రోడ్లు నిర్మించాలంటే ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టుకోవాలన్నారు. అంతే తప్ప పేదల ఆకలిదప్పులు తీర్చుతున్న ఉపాధి పథకం నిధులు మళ్లించేసి..ఆ పథకాన్ని నిర్వీర్యం చేయాలనుకునే వినాశకర విధానాలు విడనాడలని హితవు పలికారు.

అత్యాచారం కేసులో నకిలీ పోలీసు అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
గుంటూరు బుచ్చయ్యతోట ప్రాంతంలో బిఫార్మసి విద్యార్థినిపై అత్యాచారం చేసిన నకిలీ పోలీసును అరెస్టు చేసినట్టు డిఎస్‌పి అబ్దుల్ అజీజ్ తెలిపారు. కొత్తపేట పోలీసు స్టేషన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఈనెల నాల్గవ తేదీ తెల్లవారుజామున ఓ ప్రేమజంట బస్టాండ్ నుంచి వెళ్తుండగా గుంటూరుకు చెందిన పోతినేని గోపి అనే యువకుడు.. తాను పోలీసునని అడ్డగించి, ఇంటి వద్ద దింపుతానంటూ తన వాహనంపై అమ్మాయిని ఎక్కించుకుని మార్గమధ్యలో అత్యాచారం చేశాడని తెలిపారు. నిందితునిపై గుంటూరు, చేబ్రోలు స్టేషన్లలో 23 కేసులు ఉన్నట్లు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

నేడు ఆర్‌బిఐ ఎంపిసి భేటీ నిర్ణయాల వెల్లడి

న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) పరపతి విధాన కమిటీ (ఎంపిసి) సమావేశాల వివరాలను బుధవారం ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించనున్నారు. సోమవారం ప్రారంభమైన ఈ సమావేశాలు నేటితో ముగియనున్నాయి. అనంతరం ఉదయం 10 గంటలకు మీడియాకు ఎంపిసి నిర్ణయాలను శక్తికాంత వెల్లడించనున్నారు. ఇటీవల పశ్చిమాసియా ఉద్రిక్తతలతో, కమొడిటీ ధరలు పెరగడంపై ఈ భేటీలో కీలకంగా మారి ఉండొచ్చు. దాదాపు ఏడాదిన్నరగా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్న ఆర్‌బిఐ.. ఈ దఫా కూడా మార్పులు చేయకపోవచ్చని అంచనాలు వెలుపడుతున్నాయి.

పోలీసు కుటుంబానికి రక్షణ లేదు

● వైసిపి అధికారి ప్రతినిధి శ్యామల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రంలో పోలీసు కుటుంబాలకు కూడా రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందని వైసిపి అధికారి ప్రతినిధి శ్యామల తెలిపారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. సిఎం, డిప్యూటీ సిఎం సొంత జిల్లాల్లోనూ మహిళలకు రక్షణ లేదని తెలిపారు. హోంశాఖ మంత్రిగా మహిళ ఉన్నా పరిస్థితులు దారుణంగా ఉన్నాయని వివరించారు. అన్ని వ్యవస్థలనూ కూటమి సర్కార్ భ్రష్టు పట్టించిందని తెలిపారు. వైసిసి అధికారి ప్రతినిధిగా నియమించిన నాటి నుండి తనపై సోషల్ మీడియాలో విపరీతంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అత్యంత హేయంగా వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని అన్నారు. రోజుకు 900 కాల్స్ వస్తున్నాయని, వేల సంఖ్యలో మెసేజ్‌లు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన దిశ యాప్, దిశ పోలీసుస్టేషన్లు ఉండి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదన్నారు. ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థునుల రూముల్లో కెమెరాలు పెట్టారని 300 మంది ఆందోళన చేస్తే అక్కడ కెమెరాలు లేవని మంత్రి లోకేష్ ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. వైసిపిలో చేరాననే పేరుతో సినిమాలో తనకు అవకాశాలు లేకండా చేశారని, అయినా వెనక్కు తగ్గనని అన్నారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అరాచకాలు, అన్యాయాలను ప్రజలు రాసుకుంటున్నారని తెలిపారు.

ఆదర్శ మహిళ జ్యోత్స్న

ప్రముఖుల సంతాపం


జ్యోత్స్న చిన్నకుమారుడు అనీష్‌ను పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, రాష్ట్రకమిటీ సభ్యులు కె. ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- విజయవాడ, అమరావతి బ్యూరో
అభ్యుదయవాది జ్యోత్స్న మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులతో కలిసి జ్యోత్స్న, ఆమె భర్త, ఐలు అఖిల భారత వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ కలిసి రాజస్థాన్ స్టడీటూర్‌కు వెళ్లారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో మంగళవారం తెల్లవారుజామున జైపూర్ నుండి అజ్మీర్ వెళ్తుండగా జోద్‌పూర్ టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొంది. దీంతో, జ్యోత్స్న అక్కడికక్కడే తుదిశ్వాస విడిచారు. ఈ ప్రమాదంలో ఆమె భర్త రాజేంద్రప్రసాద్‌తోపాటు 11 మందికి గాయాలయ్యాయి. జ్యోత్స్న మృతి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వెంకటరమణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థినులను చైతన్య పరిచేందుకు జ్యోత్స్న అనేక కార్యక్రమాలు నిర్వహించారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రమాద ఘటనపై రాజస్థాన్ సిఎం భజన్‌లాల్ శర్మతో ఆయన మాట్లాడారు. ప్రమాదంలో గాయపడిన రాష్ట్రానికి చెందిన న్యాయవాదుల బృందంలోని వారికి అవసరమైన వైద్య సహాయంతోపాటు, తిరిగి ఇళ్లకు చేరుకునేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతి

జ్యోత్స్న మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళా సంఘంలో విజయవాడ నగరంలో అనేక సంవత్సరాలకుపైగా పనిచేశారని, సారా వ్యతిరేక ఉద్యమం, మహిళలపై వేధింపులకు వ్యతిరేకంగా మహిళలను సమీకరించడంలో కృషి చేశారని తెలిపారు. మహిళా న్యాయ సలహా సంఘాన్ని ఏర్పాటు చేసి మహిళలకు న్యాయపరమైన సహకారం అందించారని,తరుణీతరంగాల ద్వారా మహిళా ఫెస్ట్ నిర్వహణలో, సేఫ్ సంస్థ ఏర్పాటు చేసి లింగ సమానత్వం కోసం అనేక కాలేజీల్లో విద్యార్థినులను చైతన్యం చేయడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. జ్యోత్స్న మృతి తీరనిలోటని పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వామపక్ష భావాలతో పెరిగిన జ్యోత్స్న

జ్యోత్స్న చిన్నప్పటి నుంచీ వామపక్ష భావాలతో పెరిగారు. ఆ భావాల వ్యాప్తికి, మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారు. నిరంతరం మహిళా సమస్యలపై, సామాజిక అంశాలపై పోరాడారు. 1980లో స్టెల్లా కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థినుల కన్వీనింగ్ కమిటీ కన్వీనర్‌గా పనిచేశారు. బస్సు ప్రమాద వార్త తెలిసిన వెంటనే సిపిఎం, టిడిపి, వైసిపి తదితర రాజకీయ పార్టీల నేతలతోపాటు ఐద్వా, సిఐటియు, ఐలు, తదితర ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు, విజయవాడ బార్ అసోసియేషన్ నాయకులు, పలువురు న్యాయవాదులు విజయవాడ సీతారాంపురం సన్‌రైజ్ హాస్పిటల్ పక్క వీధిలోని గుళ్లపల్లి జ్యోత్స్న ఇంటికి చేరుకొని ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, డి.రమాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.స్వరూపరాణి, పిన్నమనేని మురళీకృష్ణ, కె.ఉమామహేశ్వరరావు, ఐలు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కుమార్, నల్లూరి మాధవరావు తదితరులు ఆమె స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె లేని లోటు ఎవరు తీర్చలేనిదని పేర్కొన్నారు.

ఐద్వా సంతాపం

జ్యోత్స్న మృతి మహిళా, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని ఐద్వా జాతీయ నాయకులు ఎస్.పుణ్యవతి పేర్కొన్నారు. ఆమెతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జ్యోత్స్న మృతి పట్ల ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి సంతాపాన్ని తెలిపారు.

పోర్టు ఆస్పత్రిని ప్రయివేటుకివ్వొద్దు

● సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలి
● పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్
వైజాగ్ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలని, సొంత నిధులతోనే ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. విశాఖ సిఐటియు కార్యాలయంలో మంగళవారం అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాల తరబడి 40 వేల కుటుంబాలకు సేవలందిస్తున్న పోర్టు హాస్పిటల్‌ను పిపిపి పద్ధతిలో 'మల్టీ డిసిప్లైనరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్' గా 300 పడకలతో ప్రయివేటు వారికి ఇచ్చేయాలనే నిర్ణయం దుర్మార్గమని అన్నారు. ఈ నిర్ణయాన్ని పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాలు నిర్ద్వందంగా వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. పోర్టు ఆస్పత్రి ప్రయివేటీకరణ జరిగితే పోర్టు, డాక్ కార్మికులు, ఉద్యోగుల కుటుంబాల ఆరోగ్య భద్రతను ప్రయివేటు వారి చేతుల్లో పెట్టడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట్లో బ్రహ్మాండంగా ఉంటుందని భ్రమ పెడతారని, అనంతరం ఇది ఒప్పందంలో లేదు, వర్తించదంటూ డబ్బులకు డిమాండ్ చేస్తారని తెలిపారు. హాస్పిటల్ విషయమై కార్మిక సంఘాల అభిప్రాయాలను తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు సూచించిందని గుర్తు చేశారు. కార్మికులు, కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా గోల్డెన్ జూబ్లీ హాస్పటల్ ప్రయివేటుకు ఇవ్వడానికి యాజమాన్యం, ప్రభుత్వం ముందుకెళ్లడం అప్రజాస్వామికమని అన్నారు. నిరంతరం లాభాలతో నడుస్తున్న విశాఖ పోర్టు సొంత నిధులతోనే ఆస్పత్రిని మల్టీ-సూపర్ స్పెషాలిటీ అస్పత్రిగా అభివృద్ధి చేయాలని, స్పెషలిస్ట్ డాక్టర్లను, అవసరమైన అధునాత పరికరాలను, నాణ్యమైన మందులను ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో బిసిహెచ్ మసేన్ (ఎఐటియుసి), మంగయ్య నాయుడు (హెచ్ఎంఎస్), కె సత్యనారాయణ (సిఐటియు), వి రామలింగేశ్వర రావు, జక్కన సత్యనారాయణ, ఎన్ కనకారావు (సిఎఫ్‌టియుఐ), గొర్లె చందు (ఐఎన్‌టియుసి) పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

● ప్రతిపక్షాలకు మంత్రి నాదెండ్ల సూచన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
రాజకీయ లబ్ధి కోసం కాకుండా ప్రజా సమస్యలపై ప్రతిపక్ష పార్టీలు దృష్టిసారించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హితవు పలికారు. గుంటూరు జనసేన కార్యాల యంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... విజయవాడలో వరదలు వచ్చినప్పుడు వైసిపి నాయకులు మీడియా సమావేశాలకు పరిమితం అయ్యారని, ప్రత్యక్షంగా ప్రజలకు ఆదుకోవడానికి ముందుకు రాలేదని విమర్శించారు. చంద్రబాబు నాయుడుపై ఉన్న నమ్మకంతో రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడిదారులు వస్తున్నారని తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. అంతకుముందు గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047పై భాగస్వామ్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నట్టు తెలిపారు. అన్ని రంగాల్లో వృద్ధి రేటు 15 శాతం ఉండేలా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. అమరావతిలో ఉమ్మడి గుంటూరు జిల్లా వారికి ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. రాజధాని అభివృద్ధి వేగం పుంజుకుంటుందన్నారు. సమావేశంలో ఎంపి ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్సీలు కె.ఎస్.లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీశైలానికి' ఢోకా లేదు

● మొదటి విడతగా రూ.103 కోట్లు మంజూరు
● ఆనకట్టను పరిశీలించిన వరల్డ్ బ్యాంకు, సిడబ్ల్యుసి బృందాలు

ఆనకట్ట పరిసరాలను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్స్ మానిటరింగ్ మెంబర్ రత్నకుమార్, డ్యాం చీఫ్ ఇంజనీర్ కబీర్‌బాషా, ఎస్ఇ శ్రీరామచంద్రమూర్తి

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు
శ్రీశైలం ఆనకట్టకు ఎలాంటి ఢోకా లేదని ప్రపంచ బ్యాంక్ బృందం, డ్యామ్ భద్రత బృందం నిర్ధారించాయి. ప్లంజ్ పూల్‌లో 36 మీటర్ల లోతున గొయ్యి పడిందని, దానిపైన స్టడీ చేసి రివైండింగ్ వాల్ ఏర్పాటు చేయాలని సూచించాయి. ఈ రెండు బృందాలూ సంయుక్తంగా మంగళవారం శ్రీశైలం ఆనకట్ట యాప్రాన్, ప్లంజ్‌పూల్, పరిసర ప్రాంతాల కొండచరియలను పరిశీలించాయి. కొండచరియలు విరిగి పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీర్లకు సూచనలు చేశాయి. ప్రపంచ బ్యాంక్ బృందంలో రమేష్ ముక్కళ్ల, రాజగోపాల్ సింగ్, అండీ జాలియాన్సి, డ్యామ్ భద్రత బృందంలో సిడబ్ల్యుసి మెంబర్ డాక్టర్ హనీ, ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ మెంబర్ యస్తీక ఉన్నారు. అనంతరం డ్యామ్ వ్యూ పాయింట్ కాన్ఫరెన్స్ హాల్లో విలేకర్ల సమావేశంలో ప్రాజెక్ట్స్ మానిటరింగ్ యూనిట్స్ మెంబర్ టివిఎన్.రత్నకుమార్ మాట్లాడారు. ప్రస్తుతానికి శ్రీశైలం డ్యాము భద్రతపై ఎలాంటి ఆందోళనా చెందాల్సిన పనిలేదని తెలిపారు. డ్యామ్ మరమ్మతుకు రూ.204 కోట్ల అవసరమన్న గత ప్రతిపాదనలపై చర్చించామన్నారు. ఈ మొత్తాన్ని రెండు విడతలుగా ఖర్చు చేయాలని నిర్ణయానికి వచ్చినట్టు చెప్పారు. మొదటి విడతగా రూ.103 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. చీఫ్ సెక్రటరీ, సంబంధిత మంత్రితో చర్చించి పనులు ప్రారంభిస్తామన్నారు. 2009 వరదల్లో కొట్టుకుపోయిన యాప్రాన్ అప్రోచ్ రోడ్డు, కాంక్రీట్ సిలిండర్‌ను మొదట రిపేరు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్లంజ్ పూల్‌కు రూ.10 కోట్లను కేటాయించే విధంగా అనుమతులు వచ్చాయని తెలిపారు. మిగిలిన నిధులను డ్యామ్ గేట్లు, పెయింటింగ్‌కు, వార్షిక మరమ్మతులకు వినియోగిస్తారని చెప్పారు. నీరు నిలువ ఉండడం వల్ల ప్లంజ్ పూల్‌లోని కాంక్రీట్ సిలిండర్‌ను చూడడానికి ప్రస్తుతం వీలుకాలేదన్నారు. నవంబర్లో ప్లంజ్ పూల్ పనులకు టెండర్లను పిలుస్తామని తెలిపారు. ఈ ఆనకట్టను ప్రతి మూడేళ్లకు ఒకసారి పరిశీలించి నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ కమిటీ వెంట సిఇ కబీర్ బాష, శ్రీశైలం ఆనకట్ట ఎస్ఇ. శ్రీరామచంద్రమూర్తి, ఇఇ మోహన్, ఎఇలు సుదర్శన్ రెడ్డి, మల్లికార్జున, వినోద్ జయక్రాంత్ ఉన్నారు.

ఆహార భద్రత కోసం రూ.88కోట్ల ఎంఓయూ

● వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ప్రజలకు పటిష్టమైన ఆహార భద్రత కల్పించడంతో పాటు ఆహార భద్రతా ప్రమాణాలని మరింత పెంపొందించడానికి భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా)తో రాష్ట్ర ప్రభుత్వం రూ.88.41కోట్ల అంచనా వ్యయంతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఎంఓయూలపై సంతకాలు చేసిన వారిలో ఎఫ్ఎస్ఎస్ఎఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.కమలవర్ధనరావు, ఎపి ఫుడ్ సేఫ్టీ కమిషనరు సి.హరికిరన్, ఎఫ్ఎస్ఎస్ ఎఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇనోషి శర్మ ఉన్నారు. వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ మంగళవారం మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. ల్యాబ్‌లను నెలకొల్పేందుకు ఎఫ్ఎస్ఎస్ ఎఐ అంగీకరించిందని తెలిపారు. ఈ ప్రయోగశాలల్లో శాంపిళ్ల పరీక్షలకు అవసరమైన ప్రాథమిక వసతులను ఏర్పాటు చేసేందుకు రూ.6.5 కోట్లు, అత్యాధునిక పరికరాల ఏర్పాటు ఏర్పాటుకు రూ.8.46 కోట్లు, మైక్రో బయాలజీకల్ లేబరేటరీ ఏర్పాటుకు రూ.4.28 కోట్లను కేటాయించినట్లు చెప్పారు. దీంతో పాటు మరో 13కోట్ల అంచనా వ్యయంతో ఏలూరు, ఒంగోలుల్లో ప్రాథమిక ఆహార ప్రయోగ పరీక్షల ప్రయోగశాలలు (బేసిక్ ఫుడ్ టెస్టింగ్ లేబరేటరీస్) ఒక్కొక్కటి రూ.6.5 కోట్లతో నెలకొల్పనున్నారు. రాష్ట్రంలో ఆహార శాంపిళ్ల సేకరణ, విశ్లేషణ (కలెక్షన్ అండ్ అనాలిసిస్) కోసం రూ.12కోట్లు, ఆహార భద్రతా ప్రమాణాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు రూ.11 కోట్లు కేటాయించేందుకు అవగాహన కుదిరిందిదన్నారు.

లంచాలు అడిగితే ఫిర్యాదు చేయండి

రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనరు ఆర్ మహబూబ్ బాషా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
సమాచార కమిషన్‌లో జరిగే విచారణల్లో తీర్పులు అనుకూలంగా వచ్చేలా చేస్తామని అందుకు డబ్బులివ్వాలని కమిషన్ సిబ్బంది ఎవరినైనా ఫోన్ల ద్వారా డిమాండ్ చేస్తే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనరు ఆర్ మహబూబ్ బాషా కోరారు. 26 జిల్లాల సమాచార హక్కు చట్టం నోడల్ అధికారుల (డిఆర్‌ఓలు) సమావేశాన్ని మంగళవారం ఆన్‌లైన్‌లో ఆయన నిర్వహించారు.

కమిషన్ కార్యాలయ పనివేళలకు భంగం కలగకుండా ఉదయం 9గంటల నుండి పది గంటల వరకు ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిషన్ పేరిట లంచాలు అడిగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటువంటి సంఘటనలు జరిగితే తన పేషీ అధికారిక నెంబరు 833380072 కు కానీ, తన ఇ మెయిల్‌కు కానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. విచారణకు ప్రత్యక్షంగా హాజరైతేనే అనుకూల ఆదేశాలు వెలువడతాయనే అపోహలు వద్దని, ప్రత్యక్షంగా వచ్చినా, ఆన్‌లైన్ విధానంలో హాజరైనా కేసులో మెరిట్స్ ఆధారంగానే తీర్పులు వస్తాయన్నారు. రెండో అప్పీళ్ల ఫిర్యాదులపై జరిగే విచారణలకు పిఐఒ, ఎఫ్ఎఎలు ప్రత్యక్షంగా హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపారు. కొన్ని ప్రత్యేకమైన సందర్భాల్లో మాత్రమే వారు ప్రత్యక్షంగా కమిషన్ ముందుకు రావాల్సి ఉంటుంద తెలిపారు. జటిలమైన కేసుల్లో కమిషన్ ఆదేశాల మేరకు రికార్డులతో సహా అధికారులు రావాల్సి ఉంటుందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించే ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని, ఈ విషయాన్ని సంబంధిత సిబ్బందికి తెలియచేయాలని నోడల్ అధికారులను ఆయన ఆదేశించారు. సమాచార హక్కు చట్టం వార్షిక నివేదిక తయారీకి అవసరమైన నివేదికలను జిల్లాల వారీగా అన్ని శాఖల నుంచి పంపేందుకు నోడల్ అధికారులు బాధ్యతగా సహకరించాలని మహబూబ్‌బాషా కోరారు. దరఖాస్తుదారులు తెలుగులో సమాచారం ఇవ్వాలని కోరితే ఖచ్చితంగా తెలుగులోనే సమాచారం ఇవ్వాలన్నారు. చట్టంలో నిర్ధేశించిన విధంగా నియమిత కాల వ్యవధిలో (30రోజుల్లోపు) 6(10 దరఖాస్తులకు సమాచారం ఇస్తే వారికి అప్పీలుకు రావాల్సిన అవసరం చాలా వరకు తగ్గిపోతుందన్నారు. చట్టంలోని కీలకమైన సెక్షన్ 4(1) బి కింద ఆయా కార్యాలయాల్లో స్వచ్ఛందంగా తమ కార్యాలయాల సమాచారాన్ని సాధ్యమైనంతగా వెల్లడిస్తే దరఖాస్తుదారులకు 6(1) కింద దరకాస్తులు చేసుకునే ప్రయాస కూడా తగ్గిపోతుందని ఆయన పేర్కొన్నారు.

కేంద్ర సాయంపై సిపిఎం అసంతృప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నిధులిచ్చి తోడ్పడాల్సిన కేంద్ర ప్రభుత్వం ఒట్టి మాటలతో కాలక్షేపం చేయడం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈమేరకు మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధానిని కలిసిన సమయంలో ఆయన స్పందన పట్ల హర్షం వ్యక్తం చేయడం, అభినందించడం వాస్తవానికి విరుద్ధంగా ఉందని తెలిపారు. పోలవరం నిర్మాణానికి నెల రోజుల క్రితమే రూ.500 కోట్లు ఒకసారి 2500 కోట్లు మరోసారి ఇచ్చినట్లు ప్రకటించిన కేంద్రం ఇప్పుడు 2800 కోట్లు విడుదల చేస్తున్నట్లు చెప్పడం లెక్కల గారడీ తప్ప మరొకటి కాదని, నిజానికి వచ్చింది ఒకసారేనని పేర్కొన్నారు. అది కూడా దేనికి ఎంత వచ్చిందో ఇంతవరకు స్పష్టం చేయలేదని, నిర్వాసితులకు పరిహారం గురించి ప్రస్తావన లేకపోవడం దారుణమని వివరించారు. రైల్వేజోన్‌పై ఇప్పటికీ పలుసార్లు ప్రారంభిస్తున్నట్లు కేంద్రం చెప్పినా ఇంతవరకు అమలు జరగలేదని తెలిపారు. ఇప్పుడు మరలా డిసెంబర్ అని చెప్పడం మభ్యపెట్టడానికేనని తెలిపారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై ప్రధాని నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎలాంటి హామీ పొందకపోవడం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి పోరాటం చేయడం మినహా రాష్ట్ర ప్రజలకు మరోమార్గం లేని పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని తెలిపారు. ఐదుకోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ చిహ్నంగా ఉన్న విశాఖ ఉక్కుపై ఇప్పటికైనా ముఖ్యమంత్రి పట్టుబట్టి పెట్టుబడి, సొంత గనులు సాధించుకోవాలని వారు కోరారు.

ఢిల్లీలో స్టీల్‌ప్లాంట్‌పై ముఖ్యమంత్రి చర్చించాలి

● ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

దేశ రాజధాని ఢిల్లీలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చర్చించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్‌చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 1335వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ బిఎఫ్, టిపిపి, పిఇఎం, సిఎంఇ, ఇఎండి విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షనుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ... విశాఖ ఉక్కును 7.3 మిలియన్ టన్నుల పూర్తి సామర్థ్యంతో నడపాలని, 100 శాతం అమ్మే ప్రతిపాదనను విరమించుకుంటున్నట్లు పార్లమెంటు సాక్షిగా ప్రకటించాలని, రివైవల్ ప్యాకేజీ ప్రకటించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, నిర్వాసితులందరికీ శాశ్వత ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ఎఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి జె.రామకృష్ణ మాట్లాడుతూ.. తక్షణమే మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడపడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎ.మసేనురావు, ఎన్‌వి.శయనబాబు, బిఎంఎల్.నాయుడు, బివి.సత్యనారాయణ, పరంధామయ్య, డి.దేముడు, మాతా గోవింద్, జివి.సుబ్బయ్య, బి.అప్పారావు, ప్రసాద్, వెంకాయమ్మ, అలమండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగలో రూ. 4,500 కోట్ల పనులు

● డిప్యూటీ సిఎం పవన్

ప్రజాశక్తి, అమరావతి బ్యూరో:
ఈ నెల 14 నుండి 20వ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న పంచాయతీ వారోత్సవాలు 'పల్లెపండుగ'లో భాగంగా
రూ.4,500 కోట్ల వ్యయంతో 30 వేల అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. వెలగపూడిలోని సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, అధికారులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ స్థాయిలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు మంజూరైన పనులను పండుగ వాతావరణంలో చేపట్టనున్నట్లు చెప్పారు. ఎంపిక చేసిన పనులకు భూమిపూజ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం పనులపై అవగాహన కల్పించడం, వాటి ఉపయోగం, భవిష్యత్తులో వాటి నిర్వహణ అంశాన్ని వివరించాలన్నారు. ప్రతి పంచాయతీలో ఈ ఏడాది పూర్తి చేసిన, చేపట్టబోయే పనుల వివరాలు తెలియజేసే విధంగా సిటిజెన్ నాలెడ్జ్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషన్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌తో సినీ నటుడు షాయాజీ షిండే భేటీ

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో క్యాంప్ కార్యాలయంలో సినీనటులు షాయాజీ షిండే మంగళవారం భేటీ అయ్యారు. ఆలయాల్లో ప్రసాదంతో పాటు ఒక మెక్కను కూడా భక్తులకి అందిస్తే పచ్చదనం పెరుగుతుందని షిండే ఇటీవల ఆయన అభిప్రాయాన్ని వెల్లడించారు. త్వరలో పవన్‌కల్యాణ్‌ను కలిసి కలిసి తన ఆలోచనలను పంచుకుంటానని ప్రకటించిన నేపథ్యంలో ఈ భేటీ జరిగింది.

శాస్త్రీయ భావాల ప్రచారం కోసం బహుళ కార్యక్రమాలు

● జన విజ్ఞాన వేదిక

ప్రజాశక్తి, అమరావతి బ్యూరో:
శాస్త్రీయ భావాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు బహుళ కార్యక్రమాలు నిర్వహించాలని జన విజ్ఞాన వేదిక నిర్ణయించింది. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో రెండు రోజులుగా జరుగుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు, రాష్ట్ర కమిటీ విస్తృత స్థాయి సమావేశం మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఎం.గేయానంద్, ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు మీడియాతో మాట్లాడారు. శాస్త్ర ప్రచార రంగంలోనే కాకుండా ఇతర రంగాల్లోను విస్తృతమైన కృషి చేయాలని సమావేశాల్లో నిర్ణయించినట్లు తెలిపారు. విద్యా, వైద్య రంగాల్లో శాస్త్రీయ భావాల ప్రచారం మరింత ప్రణాళిక బద్ధంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పర్యావరణ మార్పులు చాలా ముఖ్యమైన అంశంగా మారిందని, ప్రజలకు దీని పట్ల శాస్త్రీయ అవగాహన అవసరమన్నారు. పర్యావరణ నిపుణులు, మేధావులు, సంస్థలను కలుపుకుని ప్రజా చైతన్యం కోసం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మహిళలు, యువత కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా 500 మంది కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. చెకుముకి సైన్స్ సంబరాలు, ఆన్‌లైన్ సైన్స్ ఎక్స్పెరిమెంట్స్ కాంపిటీషన్స్ వంటి కార్యక్రమాలను మరింత సృజనాత్మకంగా తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. మూఢనమ్మకాల నిరోధక చట్ట సాధనకు కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సిఎం కుర్చీ కోసమే సనాతన వాదం

(మొదటి పేజీ తరువాయి)

మూటగట్టుకుంటోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా టిడిపి ఏర్పాటైందనే విషయాన్ని ఆ పార్టీ గమనంలో ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వాల తప్పుడు విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు అమలు కావాలంటే వామపక్షాలు బలంగా తయారు కావాల్సి ఉందని పేర్కొన్నారు. ఉద్యమాల పురిటిగడ్డ నెల్లూరు నగరంలో సిపిఎం రాష్ట్ర మహాసభ 1978లో అంటే 47 సంవత్సరాల క్రితం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు దేశంలోనూ, రాష్ట్రంలోనూ క్లిష్ట పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఇక్కడ జరిగే 27వ రాష్ట్ర మహాసభ ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. నూతన ప్రత్యామ్నాయ రాజకీయాలు ఈ సభలో మార్గం చూపాలన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ మాట్లాడుతూ యుద్ధాలను అమెరికా ప్రోత్సహిస్తూ, ఆయుధాలను అమ్ముకుంటూ ప్రపంచ దేశాల్లో అశాంతిని ప్రోత్సహిస్తోందని విమర్శించారు. సైనికుల మధ్య యుద్ధం జరగాలిగానీ, అమాయక ప్రజలపై దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సభకు మాదాల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు.

ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులుగా మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం, అధ్యక్షులుగా డాక్టర్ మాదాల వెంకటేశ్వర్లు

సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షులుగా మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం, అధ్యక్షులుగా డాక్టర్ మాదాల వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులుగా డాక్టర్ రామచంద్రారెడ్డి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.రాజేశ్వరరావు వ్యవహరించనున్నారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా జెవిఎస్ ట్రస్ట్ చైర్మన్ చంద్ర రాజగోపాల్, ప్రధాన కార్యదర్శిగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కోశాధికారిగా ఎం.మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా తుళ్లూరు గోపాల్, మూలి వెంగయ్య, మాదాల వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా కె.అజయ్‌కుమార్, జొన్నలగడ్డ వెంకమరాజు, గోగుల శ్రీనివాసులు, వి.నాగరాజు, మరో 52 మంది సభ్యులతో ఆహ్వాన సంఘం ఏర్పాటైంది.

కౌలు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కొత్త చట్టం

- కౌలు రైతు సంఘం డిమాండ్

కౌలురైతుల సదస్సులో ప్రసంగిస్తున్న వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్

ప్రజాశక్తి, అమరావతి బ్యూరో:
ప్రభుత్వం తాజాగా తీసుకువస్తున్న కౌలు చట్టం కౌలు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఉండాలని ఏపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. భూ యజమానులకు ఇబ్బంది కలగకుండా కౌలు రైతులకు న్యాయం చేస్తామంటే ఆచరణ సాధ్యం కాదని పేర్కొంది,. ఇప్పటికే మూడు చట్టాలు తెచ్చినా కౌలు రైతులకు ఎటువంటి ప్రయోజనం కలగని విషయాన్ని గుర్తు చేసింది. విజయవాడలోని ఎంబివికెలో మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కౌలురైతుల సమస్యలపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి పలు జిల్లాలకు చెందిన కౌలు రైతులు, సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులకు రెండు హెక్టార్లకు మాత్రమే పరిహారం ఇస్తామనడం సరి కాదన్నారు. బుడమేరు పరివాహక ప్రాంతంలోని అసైన్డ్ భూములకు, కృష్ణా పరివాహక ప్రాంతంలోని లంక, సొసైటీ భూములకు పరిహారం చెల్లించేందుకు వెంటనే ఎన్యూమరేషన్ చేయాలని కోరారు. లంక భూముల్లో సిల్ట్ తొలగించేందుకు ప్రతిపాదించిన పరిహారం చాలా తక్కువగా ఉందన్నారు. వరదల్లో నష్టపోయిన ఇంజన్లు, వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లకూ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ కృష్ణా డెల్టా ఏర్పడి 150 ఏళ్లు గడిచినా ఎంత వరద వస్తుంది, ఏ విధంగా మళ్లించాలనే విషయమై సరైన ప్రణాళిక లేదన్నారు. 15 వేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన బుడమేరు హెడ్ రెగ్యులేటర్‌కు 50 వేల క్యూసెక్కు వరద రావడంతో ముంపు పరిస్థితి నెలకొందన్నారు. బుడమేరుపై ఇప్పటికి మూడు కమిషన్లు వేసినా ప్రయోజనం శూన్యమని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కౌలురైతు సంఘం అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ వరదల్లో నష్టపోయిన కౌతు రైతులకు కార్డులు లేకపోయినా పరిహారం ఇచ్చేందుకు పేర్లు నమోదు చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు హామీ ఇచ్చారని, అయినా ఫలితం లేదన్నారు.

ఆ విషయాన్ని గుర్తించే కొత్త చట్టం : స్పెషల్ సిఎస్ రాజశేఖర్

ఇప్పటికీ రైతు అనే పదానికి సరైన నిర్వచనం లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోందని సదస్సుకు ముఖ్యఅతిధిగా హాజరైన వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. ఇప్పటికే మూడు చట్టాలు తీసుకువచ్చినా కౌలు రైతులకు ప్రయోజనం కలగలేదనే విషయాన్ని గుర్తించి ప్రభుత్వం కొత్త చట్టం రూపకల్పనకు శ్రీకారం చుట్టిందన్నారు. రైతు కూడా ఒక ఎంటర్‌ప్రెన్యూరేనని చెప్పారు. అదేవిధంగా కౌలుదారులకు కార్డులు మంజూరు చేసే వరకూ పంట రుణాలు రీ షెడ్యూల్ చేయకుండా బ్యాంకర్లకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతు సంఘం వినతి మేరకు గుర్తించిన కౌలు రైతుల జాబితాలపై సోషల్ ఆడిట్ గడువును 2 నుంచి 7 రోజులకు పెంచడం జరిగిందన్నారు. జాబితాల్లో కౌలు రైతుల పేర్లు లేకపోతే తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. వరదల్లో నష్టపోయిన కౌలు రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో ఉధారంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. . వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి తదితరులు ప్రసంగించారు. ఈ సదస్సులో సంఘం నాయకులు లక్ష్మణస్వామి, ఎం.రామాంజనేయులు, జొన్నా శ్రీనివాసరావు, కె.అజయ్, కె.శివనాగేంద్రం, ఆనందరావు, పీతల రామచంద్రరావు, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల - తిరుపతిలో బిఇఇ లైఫ్ మిషన్

- దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
దక్షిణాది రాష్ట్రాల్లో ఇంధన సంరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఎనర్జీ ఎఫిసెన్సీ బ్యూరో (బిఇఇ) కృషి చేస్తోందని ఆ సంస్థ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 4 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో జెఎన్‌టియుకె సహకారంతో ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమాటిక్స్ నిర్వహించిన 4వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ (ఐసిఇఎం)లో పర్యావరణ హిత విద్యుత్ వినియోగంపై ప్రధానంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. నిత్యం లక్షలాది మంది ప్రజలు సందర్శించే తిరుమల తిరుపతిలోనూ పర్యావరణ హిత 'మిషన్ లైఫ్' కార్యాక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక ప్రజానీకం, యాత్రికులు పర్యావరణ హితంగా నడుచుకునేలా ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సదస్సులో తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, ఐటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, కేంద్ర న్యాయ శాఖ జాయింట్ సెక్రటరీ ఆనంద్ మోహన్ తదితరులు పాల్గొన్నారని, వీరంతా కూడా పర్యావరణ హిత విద్యుత్ వినియోగం ప్రాధమ్యాన్ని వివరించారని తెలిపారు.

వినాయక స్వామి వారిని దర్శించుకున్న ప్రద్యుమ్న కుటుంబం

వరసిద్ధుని సేవలో ముఖ్యమంత్రి కార్యదర్శి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారిని కుటుంబ సమేతంగా ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న మంగళవారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనంతో తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ఐరాల తహశీల్దారు మహేష్ కుమార్, అధికారులు ఉన్నారు.

నేడు సరస్వతిదేవి అలంకరణలో దుర్గమ్మ

పట్టు వస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు

ప్రజాశక్తి - విజయవాడ వన్‌టౌన్ :
కనకదుర్గమ్మ జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారిని సరస్వతిదేవిగా బుధవారం అలంకరించనున్నారు. ఇదే రోజు రాష్ట్రప్రభుత్వం పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు సమర్పించనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. విజయవాడలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మూలా నక్షత్రం సందర్భంగా దర్శనాలకు ఎవరికీ అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి భద్రతా విభాగం సూచించిన కొద్ది మంది ప్రజాప్రతినిధులకు మాత్రమే అంతరాలయ దర్శనం ఉంటుందని తెలిపారు.

వేలాదిగా తరలివచ్చిన యాత్రికులు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం శ్రీ మహాలక్ష్మీ దేవిగా దుర్గమ్మను అలంకరించారు. సుమారు 65 వేల మందికి పైగా యాత్రికులు దుర్గమ్మను దర్శించుకున్నట్లు సమాచారం.

రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావుకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఇఒ రామారావు

బుధవారం మూలనక్షత్రం రోజున సరస్వతిదేవిగా దుర్గమ్మను అలంకరించనున్నారు. ఈ రోజున లక్షలాది మంది యాత్రికులు తరలిరానున్నట్లు ఆలయ అధికారులు చెబుతున్నారు. నేడు టికెట్ల అమ్మకాలు ఉండవు. వివిఐపి, విఐపి దర్శనాలకు వచ్చే యాత్రికులు కూడా ఉచిత క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకోవాల్సి ఉంటుంది. దుర్గమ్మను రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, పూతల పట్టు శాసనసభ్యులు కె.మురళీమోహన్, డిజిపి ద్వారకా తిరుమలరావు దంపతులు, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు దర్శించుకున్నారు.

వైభవంగా శ్రీవారి గరుడసేవ

ప్రజాశక్తి- తిరుమల:
తిరుమల శ్రీవారి గరుడ వాహన సేవ మంగళవారం వైభవంగా జరిగింది. గరుడ వాహనంపై తిరువాభరణలు ధరించిన మలయప్ప స్వామిని మూడు లక్షల మంది దర్శించుకున్నారు. ఉదయం పది గంటల నుండే నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలలోకి యాత్రికులు చేరుకున్నారు. అన్నప్రసాదం విభాగాధికారులు వీరికి అల్పాహారం, మంచినీరు, పాలు అందించారు. దీంతో, యాత్రికులు ఎండ వేడి ఉన్నా ఇబ్బంది పడకుండా ఉపశమనం పొందారు. 2019 తర్వాత మళ్లీ ఇంత పెద్దఎత్తున స్వామివారిని యాత్రికులు దర్శించుకున్నారు. టిటిడి పాలకమండలి లేకపోవడంతో విఐపిల ఒత్తిడి కూడా టిటిడిపై పడలేదు.



సదస్సులో మాట్లాడుతున్న ఎంఎ గఫూర్

వక్ఫ్ చట్ట సవరణలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఉపసంహరించుకోవాలి

- ఆవాజ్ వ్యవస్థాపకులు ఎంఎ గఫూర్

ప్రజాశక్తి-నెల్లూరు
వక్ఫ్ చట్ట సవరణలకు టిడిపి కూటమి ప్రభుత్వం మద్దతు ఉపసంహరించుకోవాలని మాజీ శాసనసభ్యులు, ఆవాజ్ వ్యవస్థాపకులు ఎంఎ గఫూర్ కోరారు. 'వక్ఫ్ చట్ట సవరణలు- వాటి పరిణామాలు' అనే అంశంపై నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గఫూర్ మాట్లాడుతూ.. బిజెపి అధికారంలోకి వచ్చాక మైనారిటీలపై అనేక రకాలుగా దాడులు చేస్తోందన్నారు. తిండి, బట్టపై ఇలా ప్రతి విషయంలోనూ కేంద్రం దాడులు చేస్తోందని వివరించారు. మైనారిటీ సంక్షేమం కోసం వక్ఫ్ చట్ట సవరణలు అని చెప్పి నాటకాలు ఆడుతోందని విమర్శించారు. వక్ఫ్ చట్ట సవరణలకు టిడిపి కూటమి మద్దతు తెలపడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తన మద్దతును ఉపసంహరించుకోవాలని, లేదంటే మైనారిటీలకు ద్రోహం చేసినవారవుతారన్నారు. వక్ఫ్ చట్ట సవరణలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే ఆవాజ్ పోరాటం చేస్తోందన్నారు. వెల్ఫేర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌ఎంఎ సుభహాన్ మాట్లాడుతూ... వక్ఫ్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం తమ ఆధీనంలో ఉంచుకునేందుకు, ఆ ఆస్తులను బడా బాబులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. వక్ఫ్ ఆస్తులను కాపాడుకోవడం కోసం అన్ని పార్టీలను కలుపుకొని రాబోయే రోజుల్లో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫీ మాట్లాడుతూ.. జిల్లాలో అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ భూములను కాపాడేందుకు అనేక పోరాటాలు చేశామని, ఇకపై కూడా వాటిని రక్షించుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా జిల్లా కమిటీ సభ్యులు, లౌకిక ప్రజాతంత్ర వాదులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజెపికి ప్రకాష్ జైన్ రాజీనామా

ప్రజాశక్తి-ఆదోని (కర్నూలు)
బిజెపికి, అన్య భాష రాష్ట్ర కన్వీనర్ పదవికి కర్నూలు జిల్లా ఆదోని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ రాజీనామా చేశారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ...ఆదోని నియోజకవర్గంలో ఎమ్మెల్యే పార్థసారథి అనుసరిస్తోన్న ఒంటెత్తు పోకడ నిర్ణయాలు నచ్చక బిజెపి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానన్నారు. కొందరు నాయకులు తమ స్వలాభం కోసం పార్టీ ఎదుగుదలను నొక్కి పెడుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితులను బిజెపి రాష్ట్ర కమిటీకి విన్నవించినా స్పందించకపోవడంతో రాజీనామా చేస్తున్నానని తెలిపారు. 1983లో ఎన్‌టి రామారావు నాయకత్వంలో టిడిపి తరపున ఆదోని ఎమ్మెల్యేగా పోటీ చేసి ప్రకాష్ జైన్ గెలుపొందారు. కొంతకాలం కాంగ్రెస్‌లో ఆ తర్వాత ప్రజారాజ్యంలో ఉన్నారు. పదేళ్ల నుంచి బిజెపిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.



GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION VISAKHAPATNAM

Short Tender Notice No: 13/2024-25/CE/SE(W-III)/EE-VA/GVMC. Dt: 08-10-2024
Request for Proposal (RFO)

Provide services to GVMC for a proposed "Study Tour for Hon'ble Ward Members on Developmental activities taken up under Swachh Bharath Mission / Smart City at Coimbatore, Mysore and Bangalore Municipal Corporation of Council a period of 8 days (20.10-2024 to 27.10.2024) The documents containing terms & conditions may be downloaded from website of Further details at http://www.apeprocurement.gov.in on from 08 -10-2024 and bid documents last submission date: 14-10-2024 for the work of Study Tour for Hon'ble Ward Members for a period of 8 days (20.10-2024 to 27.10.2024)
Further details at Superintending Engineer, Greater Visakhapatnam Municipal Corporation Main Office, Tenneti Bhavan, Asilmetta, Visakhapatnam. e-mail: eezone5a@gmail.com.
Sd/- Commissioner, GVMC, Visakhapatnam

సామ్‌సంగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు ఆధ్వర్యంలో ఆ షాపుల వద్ద ఆందోళనలు

ప్రజాశక్తి - యంత్రాంగం
తమిళనాడు రాష్ట్రం శ్రీపెరుంబుదూర్‌లోని సామ్‌సంగ్ తయారీ యూనిట్‌లో పనిచేస్తున్న కార్మికుల ఆందోళనకు మద్దతుగా సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఆ కంపెనీ షాపుల ముందు సంఘీభావ నిరసన తెలిపారు. విశాఖ డైమండ్ పార్కు వద్ద ఉన్న సామ్‌సంగ్ షాపు ముందు చేపట్టిన నిరసన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడారు. 1470 మంది కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శ్రీపెరుంబుదూర్‌లోని ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్‌లో సుమారు 1800 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా 1470మంది యూనియన్ ఏర్పాటు చేసుకుని తమ న్యాయమైన డిమాండ్స్‌తో కూడిన మెమోరాండం యాజమాన్యానికి ఇస్తే యూనియన్ పెట్టుకొనే హక్కు లేదని, యూనియన్ పెడితే తొలగిస్తామని బెదిరించడం దుర్మార్గమన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం కార్మికులకు యూనియన్ పెట్టుకొనే హక్కు ఉందని తెలిపారు.

విశాఖ డాబాగార్డెన్స్‌లో చేపట్టిన సంఘీభావ నిరసనలో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

సామ్‌సంగ్, ఎల్‌జి పాలిమర్స్, పోస్కోవంటి కంపెనీలు భారతదేశంలో కార్మిక చట్టాలు అమలు చేయకుండా మోడీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందని విమర్శించారు. కాకినాడ మెయిన్‌రోడ్డులోని సామ్‌సంగ్ షోరూమ్ వద్ద ధర్నా నిర్వహించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని, కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని ప్లకార్డులను ప్రదర్శించి నినదించారు. తిరుపతి, పుత్తూరు, నాయుడుపేటలో నిరసన తెలిపారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో ధర్నా నిర్వహించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించి, కార్మిక చట్టాలను అమలు చేయాలని నినదించారు.

తగ్గిన టాటా మోటార్స్ గ్రూపు గ్లోబల్ అమ్మకాలు

ముంబయి : ప్రస్తుత ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో టాటా మోటార్స్ గ్రూప్ గ్లోబల్ అమ్మకాలు 11 శాతం తగ్గి 3,04,189 యూనిట్లకు పరిమితమయ్యాయి. జాగ్వర్ లాండ్ రోహర్ అమ్మకాలు 10 శాతం తగ్గి 87,303 యూనిట్లుగా నమోదయ్యాయి. టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహన విక్రయాలు 6 శాతం తగ్గి 1,30,753 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి.

దసరా ప్రయాణాల్లో 62 శాతం పెరుగుదల

- రెడ్ బస్ అంచనా

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుత దసరా పండుగ ప్రయాణాల్లో భారీ పెరుగుదల ఉండొచ్చని ట్రావెల్ ప్లాట్‌ఫామ్ రెడ్‌బస్ పేర్కొంది. పండుగేతర సమయం సెప్టెంబర్ 26-30తో పోల్చితే అక్టోబర్ 10-14 రోజుల్లో ప్రయాణికుల్లో 62 శాతం వృద్ధి ఉండొచ్చని అంచనా వేసింది. ఎక్కువ మంది ప్రయాణికులు తమకు ఇష్టమైన వారితో ఈ పండుగని జరుపుకునేందుకు సొంతుళ్లకు వెల్లడమే ఇందుకు కారణమని తెలిపింది. అంతరాష్ట్ర ప్రయాణికుల్లో 84 శాతం డిమాండ్ ఉండొచ్చని పేర్కొంది.

భారత ప్రభుత్వము
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ

జాయింట్ కలెక్టర్ వారి కార్యాలయం, చిత్తూరు మరియు కాంపిటెంట్ అథారిటీ, భూసేకరణ, NH-140 (6 లైన్లు) కుక్కలపల్లి-మల్లవరం సెక్షన్, చిత్తూరు జిల్లా, కలెక్టర్ వారి కార్యాలయం, చిత్తూరు

Roc.No. NH-140/3556/2016 — **బహిరంగ ప్రకటన** — తేది : 03.10.2024.

1956 జాతీయ రహదారుల చట్టం 3-జి & (4) విభాగం క్రింద

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో ఈ క్రింద షెడ్యూలు పట్టికలో నిర్దేశించిన భూములు ప్రజా ప్రయోజనముల కొరకు, అనగా కుక్కలపల్లి - మల్లవరం సెక్షన్లో ప్రతిపాదించిన బిల్డింగ్ (6 లైన్లు వగైరా) మెయింటెనన్స్, మేనేజ్మెంట్ మరియు ఆపరేషన్ కొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిత్తూరు జిల్లాలో NH-18 యొక్క కి.మీ. 0+00 నుండి కి.మీ. 18+400 వరకు మరియు NH-140 యొక్క కి.మీ. 0+00 నుండి కి.మీ. 41+800 వరకు విస్తరించియున్న భూమి NHAI చట్టం 1956 (48/1956) ఉపవిభాగం 3డి ద్వారా సంక్రమించిన అధికారాలతో సేకరించుటను భారత ప్రభుత్వం ప్రకటించినది మరియు భారత ప్రభుత్వ గెజిట్ S.O. నం. 3688 (E) అసాధారణ నం. 4027, పార్ట్ II సెక్షన్3, సబ్-సెక్షన్ (ii) తేదీ 19.09.2024 ద్వారా ప్రచురించబడినది.
సదరు చట్టం విభాగం 3-డి ఉప విభాగం 2 ననుసరించి, భారత అధికార గెజిట్ నందు 3డి(1) నోటిఫికేషన్ ప్రచురణ తేదీ నుండి అన్ని ఎంకెంబ్రెన్సెస్ రహితంగా ఈ క్రింది షెడ్యూలు పట్టిక భూములు కేంద్ర ప్రభుత్వం అధీనంలోనికి వచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది.
ఈ క్రింద షెడ్యూలులో నిర్దేశించిన భూములు పట్ల ఆసక్తికల వ్యక్తులు అందరు (భూమి యజమానులు మరియు ఇతర ఆసక్తికల వ్యక్తులు) స్వయంగా లేదా ప్రతినిధి ద్వారా వకీలు (లీగల్ ప్రాక్టీషనర్) ద్వారా జాయింట్ కలెక్టర్, చిత్తూరు మరియు కాంపిటెంట్ అథారిటీ, భూసేకరణ, NH-140 కు కుక్కలపల్లి - మల్లవరం సెక్షన్, చిత్తూరు జిల్లా వారి సమక్షంనకు క్రింద నిర్దేశించిన తేదీ, ప్రదేశం మరియు సమయంనకు హాజరు కావలెను మరియు అట్టి భూములపైన క్లెయిమ్లు మరియు ప్రాతినిధ్యం ఆసక్తి స్వరూపంతో క్రింద తెలిపిన సంబంధిత రికార్డులు దాఖలు చేయవలెను.
(1) గత 13 సంవత్సరాలుగా ఇసి (2) అమ్మకం / పార్టీషన్ / ఇతర దస్తావేజులు ఒరిజనల్ టైటిల్ (3) పట్టాదార్ పాస్ పుస్తకం/టైటిల్ డీడ్స్ (4) బిల్డింగ్స్ అనుమతి కొరకు ప్లాన్లు మరియు పన్ను మదింపు మరియు పన్ను చెల్లింపు రసీదులు (5) మ్యుటేషన్ అంశములు (6) కన్వర్షన్ ఉత్తర్వులు (7) చెల్లించిన డెవలప్‌మెంట్ ఛార్జీలు రసీదు (8) అనుమతించిన లేఅవుట్ ప్లాను (9) తహశీల్దారు నుండి 1బి నకలు (10) ప్రభుత్వం నుండి మంజూరైన భూములకు సంబంధించి ఒరిజినల్ డికెటి పట్టాలు మరియు ఇతర పత్రములు (11) ఆధార్ కార్డు (12) బ్యాంక్ ఖాతా పాస్‌పుస్తకం & పాన్ కార్డు.
ఈ క్రింద నిర్దేశించిన సమయంలోగా దిగువ సంబంధిత కార్యాలయం వద్ద క్లెయిమ్ మరియు డాక్యుమెంట్లు దాఖలు పరచుటలో ఏ వ్యక్తి అయిననూ విఫలమైతే ఈ కార్యాలయంలో లభించే రికార్డుల ప్రకారం నష్టపరిహారం నిర్ణయించబడుతుంది.

క్రమ సంఖ్య	మండలం పేరు	గ్రామం పేరు	తేదీ	సమయం	అప్లికేషన్లు & పత్రాలు స్వీకరించడానికి వేదిక
1	చంద్రగిరి	1) తొండవాడ 2) చంద్రగిరి 3) అగరాల 4) మామండూరు 5) ముంగిలిపట్టు 6) కల్‌రోడ్‌పల్లి 7) పనపాకం	22.10.2024	11.00 గం.లకు	తహశీల్దార్ కార్యాలయం, చంద్రగిరి
2	పాకాల	1) పాకాల 2) గాదంకి	25.10.2024	11.00 గం.లకు	తహశీల్దార్ కార్యాలయం, పూతలపట్టు
3	పూతలపట్టు	1) కొత్తకోట 2) వేపనపల్లె 3) తేనేపల్లె 4) పేట అగ్రహారం 5) పూతలపట్టు 6) పాలకూరు			
4	ఐరాల	1) చిగరపల్లె 2) కాణిపాకం	05.11.2024	11.00 గం.లకు	కలెక్టరేట్, జేసీ ఛాంబర్స్, చిత్తూరు.
5	తవణంపల్లె	1) పట్నం			
6	చిత్తూరు	1) తేనబండ			
7	యాదమరి	1) కుక్కలపల్లె			

S.O. పై భారతదేశ గెజిట్ 3688 నం. 4027 (E) తేదీ: 19.09.2024.

సం/-
జాయింట్ కలెక్టర్ మరియు కాంపిటెంట్ అథారిటీ,
భూసేకరణ, NH-140, చిత్తూరు.

జిల్లా : చిత్తూరు
https://egazette.gov.in
https://egazette.gov.in/

అత్యాచార నిందితుడ్ని కఠినంగా శిక్షించాలి

- బాధితురాలికి సిపిఎం నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - పిఠాపురం
కాకినాడ జిల్లా పిఠాపురంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని సిపిఎం డిమాండ్ చేసింది. పిఠాపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని సిపిఎం నాయకులు మంగళవారం పరామర్శించారు.
ఆమె కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ టిడిపి పట్టణ మహిళ అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ భర్త దుర్గాడ లక్ష్మయ్య అలియాస్ దుర్గాడ జాన్, సుబ్బలక్ష్మి అనే మరో మహిళతో కలిసి బాలికకు మాయమాటలు చెప్పి ఆటోలో మాధవపురం డంపింగ్ యార్డ్ వద్దకు తీసుకువెళ్లారని, అక్కడ జాన్ అత్యాచారానికి పాల్పడినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ఇటీవలి కాలంలో అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. అత్యాచారానికి పాల్పడిన నిందితునికి, సహకరించిన మహిళకు చట్టప్రకారం కఠిన శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో సిపిఎం నాయకులు కె చిన్న, కోనేటి రాజు, విశ్వనాథం, ఐద్వా నాయకులు మణి, జెవివి నాయకులు ఎన్ సూర్యనారాయణ తదితరులున్నారు.

బాలికపై అఘాయిత్యం అమానుషం : డిప్యూటీ సిఎం

పిఠాపురం పట్టణానికి చెందిన మైనర్‌పై జరిగిన అఘాయిత్యం అమానుషమని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అమానుష చర్యను ప్రతి ఒక్కరు ఖండించాలని,

బాధితురాలిని పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వపరంగా బాధితురాలికి, ఆమె కుటుంబానికి అన్ని విధాలా సహాయసహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. నిందితునికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబ సభ్యులను స్థానిక జనసేన నాయకులు మర్రెడ్డి శ్రీనివాస్, చెల్లుబోయిన సతీష్, ఒ కిషోర్ పరామర్శించారు.

నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నాం : ఎస్పి విక్రాంత్ పాటిల్

మైనర్‌పై అత్యాచారం కేసుకు సంబంధించి నిందితుడు దుర్గాడ్ జాన్‌ను అదుపులోకి తీసుకున్నామని కాకినాడ జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. పిఠాపురం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పి సందర్శించారు. మైనర్‌పై అత్యాచార ఘటనపై స్పందిస్తూ త్వరలోనే నిందితుని రిమాండ్ నిమిత్తం న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తామని తెలిపారు.

ఎయిర్‌టెల్ చేతికి టాటా ప్లే..!

- జియోకు తీవ్ర పోటీ

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద డిటిహెచ్ సేవల కంపెనీ టాటా ప్లేను కొనుగోలు చేసేందుకు భారతీ ఎయిర్‌టెల్ చర్చలు జరుపుతుందని సమాచారం. అదే జరిగితే డిజిటల్ టివిలో రిలయన్స్ జియోకు తీవ్ర పోటీ ఎదురు కానుంది. ఒటిటి సేవలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ టివి విభాగంలో ఎయిర్‌టెల్ తన ఉనికిని బలోపేతం చేసుకొనేందుకు ఎయిర్‌టెల్ అడుగులు వేస్తోందని జాతీయ మీడియాలో కథనాలు వెలుపడ్డాయి. 2017లో టాటా కన్స్యూమర్ మొబిలిటీ వ్యాపారాన్ని భారతీ ఎయిర్‌టెల్ కొనుగోలు చేసిన తర్వాత ఇరు సంస్థల మధ్య జరగనున్న రెండో ఒప్పందం కానుంది. ఒక వేళ టాటా ప్లేను కొనుగోలు చేస్తే టాటా తన కంటెంట్, ఎంటర్‌టైన్‌మెంట్ కార్యకలాపాల నుంచి పూర్తిగా వైదొలగాల్సి ఉంటుంది. ప్రస్తుతం డైరెక్ట్ టు హోం (డిటిహెచ్) విభాగంలో టాటా ప్లే 2.07 కోట్ల



ఖాతాదారులతో ఏకంగా 32.7 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. డిటిహెచ్ సేవల్లో మార్కెట్ లీడర్‌గా ఉన్నప్పటికీ 2023-24 ఆర్థిక సంవత్సరంలోనూ రూ.353.8 కోట్ల నష్టాలను చవి చూసింది. మరోవైపు ఎయిర్‌టెల్ డిజిటల్ టివి 27.8 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. టాటా ప్లే కొనుగోలు జరిగితే ఎయిర్‌టెల్ కస్టమర్ బేస్ ఒక్క సారిగా పెరగనుంది. దేశ మార్కెట్‌లో ఆ సంస్థ మార్కెట్ వాటా 50 శాతానికి ఎగువకు చేరుకోనుంది. దీంతో రిలయన్స్ జియోకు తీవ్ర పోటీని ఇవ్వనుందని.. ధరల్లో మార్పులు రావొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

రూ.1000 కోట్ల ఆదాయం లక్ష్యం

ఐస్‌మేక్ రిఫ్రిజిరేషన్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్
ప్రముఖ శీతలీకరణ పరికరాల తయారీదారు ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్ వచ్చే నాలుగేళ్లలో రూ.1,000 కోట్ల ఆదాయాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఇటీవల సంస్థ 15వ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగిందని ఆ కంపెనీ సిఎండి చంద్రకాంత్ పటేల్ పేర్కొన్నారు. ఇందులో పలు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. తయారీ సామర్థ్యాలను విస్తరించడానికి ఇప్పటికే రూ.100 కోట్లు వ్యయం చేసినట్లు పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం 2025 నాటికి రూ.500 కోట్లు, 2027-28లో రూ.1000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. కంపెనీ ప్రస్తుత ఆర్డర్ బుక్ రూ.138 కోట్లుగా ఉందన్నారు.

సంపాదకీయం

ప్రజాతీర్పు

జమ్ముకాశ్మీర్‌లో కమలం పార్టీకి ఓటర్లు బుద్ధిచెప్పారు. అతివిశ్వాసం, కుమ్ములాటలతో హర్యానాలో విజయాన్ని కాంగ్రెస్ చేజార్చుకుంది. జమ్ముకాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తినిచ్చే చారిత్రాత్మక 370 అధికరణాన్ని రద్దు చేసి, కాశ్మీరీ ప్రజలను, నేతలను ఏళ్ల తరబడి నిర్బంధించినందుకు తగిన ఫలితాన్ని బిజెపి అనుభవించింది. రాష్ట్రహోదా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ పునరుద్ధరించకపోవడంపై ప్రజానీకం తీవ్ర ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. కాశ్మీర్ ప్రాంతంలో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) నేతృత్వంలోని ఇండియా వేదిక క్లీన్‌స్వీప్ చేసింది. 'నయా కాశ్మీర్' అంటూ మాయ చేసేందుకు బిజెపి చేసిన ఎత్తులు చిత్తయ్యాయి. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రైనాను సైతం ఓడించి, బిజెపిని పూర్తిగా తిరస్కరించారు. 90 స్థానాలకు గాను 48 స్థానాలను సాధించిన ఎన్‌సి - కాంగ్రెస్ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతోంది. కుల్గాం స్థానం నుంచి వరుసగా ఐదోసారి యూసఫ్ తరిగామిని గెలిపించడం ద్వారా ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టులకు తిరుగులేదని మరోసారి నిరూపించారు. 2019లో నిషేధించిన జమాతే ఇస్లామీ పార్టీ, అవామీ ఇత్తెహాద్ పార్టీ (ఎఐపి) స్వతంత్రులకు మద్దతిస్తూ, ప్రచారం చేసేందుకు సైతం అనుమతించడం ద్వారా లబ్ధి పొందాలనీ కమలం పార్టీ ప్రయత్నించింది. యుఎపిఎ కింద అరెస్టయిన ఎఐపి నేత ఇంజనీర్ రషీద్‌తో ప్రచారం చేయించి, ఇండియా వేదిక ఓట్లను చీల్చాలని చేసిన ఎత్తులు పారలేదు.

హర్యానాలో బిజెపి వ్యతిరేక ఓట్ల చీలిక, అతివిశ్వాసం, కుమ్ములాటలు కాంగ్రెస్ పార్టీ పుట్టిముంచాయి. కిసాన్, జవాన్, పహిల్వాన్ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న హర్యానాలో... ఆ మూడు పక్షాలూ వ్యతిరేకంగా ఉన్నా, అధికారం వెలగబెట్టిన పదేళ్లలో చేసిన నిర్వాకాలతో ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్నా... ఎన్నికల ఫలితాల్లో వ్యక్తం కాకపోవడానికి ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ బలహీనతలు కారణమయ్యాయి. జాట్‌లంతా హస్తం పార్టీ వైపు ఉన్నారన్న ప్రచారం పూర్తిస్థాయిలో నిజం కాకపోగా, జాట్‌లకు వ్యతిరేకంగా ఉన్న కులాల్లో అత్యధికులు తమ పార్టీ వైపు మొగ్గు చూపేలా కమలం పార్టీ చేసుకోగలిగింది. కాంగ్రెస్ అగ్రనేతలు హుడా, సెల్జా మధ్య విభేదాలు బహిరంగంగానే బయట పడటం, కుమారి సెల్జాను పక్కనపెట్టడం కొన్ని తరగతుల ప్రతినిధులను దూరం చేశాయి. కాంగ్రెస్‌తో పొత్తు కుదరకపోవడంతో ఆప్ ఒంటరిగా పోటీ చేయడం, స్థానికంగా ఉంటున్న జెజెపి, దళితుల మద్దతున్న భీమ్ ఆర్మీ పార్టీతోనూ, ఐఎన్‌ఎల్‌డి బిఎస్‌పితోనూ పొత్తు పెట్టుకోవడం కూడా ఓట్ల చీలికకు దారితీసింది. వెయ్యి నుంచి ఐదు వేల ఓట్ల తేడాతో 10 స్థానాల్లోనూ, ఐదు వేల నుంచి పదివేల ఓట్ల తేడాతో ఐదు స్థానాల్లోనూ కమలం పార్టీ గెలుపొందడమే ఆ పార్టీ వ్యతిరేక ఓట్ల చీలికను ఎత్తిచూపుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో తమకు దూరమైన ఓటర్లను దరిచేసుకునేందుకు కాషాయ పార్టీ చేసిన ఎత్తులు ఫలించాయి. అగ్నివీర్‌లకు రాష్ట్ర ఉద్యోగాల్లో కోటా ఇస్తామని, దళితుల్లో నాన్ జాతవ్‌లకు 14 శాతం రిజర్వేషన్లిస్తామని... ఇలా చేసిన ఆపద మొక్కులు ఫలితాన్నిచాయి.

కమలం పార్టీతో పొత్తు ధృతరాష్ట్ర కౌగిలి అని మరోసారి రుజువైంది. 2015లో బిజెపితో పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన పిడిపి మూడు స్థానాలకే పరిమితమైంది. ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా సైతం ఓటమి పాలయ్యారు. హర్యానా మాజీ ఉప ముఖ్యమంత్రి, జననాయక్ జనతా పార్టీ (జెజెపి) అధినేత దుష్యంత్ చౌతాలా అవమానకరంగా ఐదో స్థానానికి పరిమితమయ్యారు. పంజాబ్‌లో శిరోమణి అకాళీదళ్‌కు, అస్సాంలో అస్సాం గణపరిషత్‌కు, తమిళనాడులో అన్నాడిఎంకెకు, మహారాష్ట్రలో శివసేనకు, బీహార్‌లో జెడి(యు)కు, కర్ణాటకలో జెడిఎస్‌కు సామాన్యుడు ఇదే సన్మానం చేసినా... మన రాష్ట్రంలో నేతలు ఒకరికి మించి మరొకరు ఆ రంగు పులుముకునేందుకు తహతహలాడుతుండటం గమనార్హం. సమానదూరం అంటూ... సర్కర్ చేసిన టిఆర్‌ఎస్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్, బిజూ జనతాదళ్ పార్టీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తమ సిద్ధాంతాలను పక్కనపెట్టి రాజకీయ లబ్ధికోసం అంటకాగితే ఫలితం ఎలా ఉంటుందనడానికి తాజా ఫలితాలు మరో నిదర్శనం.

మహనీయుల మాట

ఒకరి కింద బానిస బతుకు
బతకడం కంటే
పైకి లేచి
ప్రాణాలు వదిలిపెట్టడం మేలు.
- చేగువేరా
జననం : 14.6.1928
మరణం : 9.10.1967

అంతర్జాతీయం

గాజాలో మారణకాండకు ఏడాది

ఆయుధాలతో ఇజ్రాయిల్, తప్పుడు వార్తలతో మీడియా దాడి!

ఎం. కోటేశ్వరరావు

గాజాపై ఇజ్రాయిల్ మారణకాండ ప్రారంభమై అక్టోబరు ఏడవ తేదీతో ఏడాది గడిచింది. ప్రపంచ ప్రధాన స్రవంతి మీడియా ఇజ్రాయిల్ మీద హమాస్ ఉగ్రవాదులు జరిపిన దాడికి సంవత్సరం నిండింది అంటోంది. హమాస్ దాడిని ఎవరూ సమర్ధించటం లేదు. ఐక్యరాజ్యసమితి 1948లో ఇజ్రాయిల్‌ను ఏర్పాటు చేసిన తరువాత అప్పటి వరకు ఉన్న పాలస్తీనా ఉనికిలో లేకుండా పోయింది. ఏదో ఒక సాకుతో దానికి కేటాయించిన ప్రాంతాలన్నింటినీ ఆక్రమించుకోవటంతో పాటు వేలాది మందిని చంపి, లక్షల మందికి నిలువ నీడ లేకుండా చేస్తూ పాలస్తీనా దేశం ఏర్పడకుండా ఇజ్రాయిల్‌కు మద్దతుగా అమెరికాతో సహా పశ్చిమ దేశాలన్నీ మద్దతు ఇస్తున్నాయి. దానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేస్తున్న బృందాలలో హమాస్ ఒకటి. దాని దాడులు గత ఏడాదే ప్రారంభం కాలేదు. కానీ అది చేసిన దాడి సాకుతో గాజాలో ఏడాది కాలంగా మారణకాండ సాగిస్తున్నారు. ఇప్పటి వరకు 42 వేల మందిని చంపారు. పది వేల మంది జాడ తెలియటం లేదు. లక్ష మంది వరకు గాయపడ్డారు. లక్షలాది ఇళ్లను నేలమట్టం గావించారు. గాజాలోని 23 లక్షల మందిని ఇళ్ల నుంచి వీధుల్లోకి నెట్టారు. మారణకాండ ఇంకా కొనసాగుతోంది. వెస్ట్‌బాంక్ ప్రాంతానికి విస్తరించారు.

ఈ దారుణకాండ గురించి ప్రపంచ మీడియా వార్తలు ఇస్తున్న తీరు కూడా సభ్య సమాజం ఆమోదించేదిగా లేదు. అంతర్జాతీయ వార్తా సంస్థలన్నీ పశ్చిమ దేశాలకే చెందినవి కావటంతో అవి అందచేసిన తప్పుడు సమాచారాన్నే వాస్తవాలుగా చెబుతున్నారు. అయితే తప్పుడు, వక్రీకరణ, కుహనా వార్తలను ఇవ్వటం కొత్తగా జరుగుతున్నది కాదు. ప్రపంచం మీద ప్రచార దాడి జరుగుతున్నది. గాజాలో తలెత్తిన మానవ సంక్షోభ తీవ్రత అక్కడి నుంచి వార్తలు పంపుతున్న పశ్చిమ దేశాల విలేకర్లలో ఎక్కడా కానరాదు. ప్రపంచానికి వారు అందచేస్తున్నవి తప్ప ప్రత్యామ్నాయ సంస్థలు లేవు. గాజాలో మరణించిన, గాయపడిన వారిలో నూటికి 80 శాతం మంది నిరాయుధులైన మహిళలు, పిల్లలే ఎందుకు ఉన్నారో ఏ మీడియా అయినా చెబుతోందా? హమాస్ ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో చూడండి అంటూ అందచేస్తున్న వీడియోలలో ఒక శాతమైనా ఇజ్రాయిల్ దుర్మార్గాలకు సంబంధించి లేవంటే అతిశయోక్తి కాదు. వైమానిక దాడులు, ట్యాంకుల ఫిరంగి గుళ్లకు 128 మంది జర్నలిస్టులు మరణించగా వారిలో 123 మంది పాలస్తీనియన్లు, ఇద్దరు ఇజ్రాయిలీలు, ముగ్గురు లెబనీయులు ఉన్నారు. మరో 35 మంది గాయపడ్డారు. ఏకపక్షంగా జరుగుతున్న మారణకాండకు ఇది ఒక నిదర్శనం. ఎక్కడో ఏసి గదుల్లో కూర్చొని కంప్యూటర్ గ్రాఫిక్‌లు సృష్టిస్తున్నదెవరో, యుద్ధ రంగంలో ప్రాణాలకు తెగించి వాస్తవాలను నివేదించేందుకు పని చేస్తున్నదెవరో అర్ధం అవుతోంది. మేము సైతం అన్నట్లుగా సాధారణ పౌరులతో పాటు పాలస్తీనా జర్నలిస్టులు పని చేస్తున్నారు, ప్రాణాలర్పిస్తున్నారు.

> ఈ దారుణకాండ గురించి ప్రపంచ మీడియా వార్తలు ఇస్తున్న తీరు కూడా సభ్య సమాజం ఆమోదించేదిగా లేదు. అంతర్జాతీయ వార్తా సంస్థలన్నీ పశ్చిమ దేశాలకే చెందినవి కావటంతో అవి అందచేసిన తప్పుడు సమాచారాన్నే వాస్తవాలుగా చెబుతున్నారు. అయితే తప్పుడు, వక్రీకరణ, కుహనా వార్తలను ఇవ్వటం కొత్తగా జరుగుతున్నది కాదు. ప్రపంచం మీద ప్రచార దాడి జరుగుతున్నది. గాజాలో తలెత్తిన మానవ సంక్షోభ తీవ్రత అక్కడి నుంచి వార్తలు పంపుతున్న పశ్చిమ దేశాల విలేకర్లలో ఎక్కడా కానరాదు. ప్రపంచానికి వారు అందచేస్తున్నవి తప్ప ప్రత్యామ్నాయ సంస్థలు లేవు. గాజాలో మరణించిన, గాయపడిన వారిలో నూటికి 80 శాతం మంది నిరాయుధులైన మహిళలు, పిల్లలే ఎందుకు ఉన్నారో ఏ మీడియా అయినా చెబుతోందా? హమాస్ ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో చూడండి అంటూ అందచేస్తున్న వీడియోలలో ఒక్క శాతమైనా ఇజ్రాయిల్ దుర్మార్గాలకు సంబంధించి లేవంటే అతిశయోక్తి కాదు.



ఇజ్రాయిల్ మిలిటరీ, ప్రభుత్వ పెద్దలు అందిస్తున్న సమాచారాన్ని స్వయంగా చూసినట్లు పశ్చిమ దేశాల విలేకర్లు, సంస్థలు చిత్రిస్తున్నాయి. ఐరోపాలో అతి పెద్ద మీడియా సంస్థ జర్మన్ యాక్సెల్ స్ప్రింగర్ ఒక యాప్‌ను రూపొందించింది. ఇజ్రాయిల్ ప్రతినిధులు చెప్పే కథనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పాలస్తీనీయుల మరణాలను తగ్గించి చూపాలని తన సిబ్బందికి ఆదేశాలిచ్చినట్లు దాని అంతర్గత పత్రాల ద్వారా వెల్లడైందని 'ఇంటర్‌సెప్ట్' అనే పత్రిక పేర్కొన్నది. అంతేకాదు మరీ తప్పనిసరైతే తప్ప పాలస్తీనియన్ల గురించి ప్రస్తావించవద్దని అమెరికా 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక కూడా తన సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది. యజమానులే అలాంటి వైఖరి తీసుకున్న తరువాత నిజం రాసినా, చూపినా అవి పాఠకులు, వీక్షకుల వద్దకు చేరుకోవు అన్నది మీడియాలో పని చేసేవారందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. అందుకే హమాస్‌ను ఒక రాక్షసిగా, దాన్ని మట్టుపెట్టేందుకు పూనుకున్న అపరశక్తిగా, బాధిత దేశంగా ఇజ్రాయిల్‌ను చిత్రించారు. సెంటర్ ఫర్ మీడియా మోనిటరింగ్ (మీడియా పరిశీలక కేంద్రం) అనే సంస్థ అంతర్జాతీయ మీడియా ఛానళ్లు ప్రసారం చేసిన లక్షా 80 వేల వీడియోలు, బ్రిటిష్ మీడియా సంస్థలు రాసిన 26 వేల వ్యాసాలను వడగట్టి తేల్చింది కూడా ఇదే. అక్టోబరు ఏడు నుంచి జరుగుతున్న దాడులకు ముందు కూడా మీడియా తీరు ఇలాగే ఉంది. పాలస్తీనా కోసం పోరాడుతున్నవారిని ఉగ్రవాదులుగా చిత్రించించటం తెలిసిందే. ఇటలీ మీడియా 2019-21 సంవత్సరాల తీరుతెన్నులను ఐరోపా సమాఖ్య నిధులతో ఒక పరిశోధన చేశారు. మూడు పత్రికలను పరిశీలించగా అంతర్జాతీయ వార్తలలో 32 శాతం ఇజ్రాయిల్ ప్రధాని, నరహంతకుడు నెతన్యాహు చుట్టూ తిరిగాయని తేలింది. గతేడాది కాలంగా సాగిస్తున్న మారణకాండ ఇటాలియన్ మీడియాకు పట్టలేదు. "గాజా నుంచి రాకెట్ల ప్రయోగం, గాజా నుంచి 430 రాకెట్లతో దాడి, ఇజ్రాయిల్‌కు ఆత్మరక్షణ హక్కు ఉంది" లాంటి శీర్షికలతో జనాన్ని తప్పుదారి పట్టించారు. దాని దుర్మార్గాలను సమర్ధించారు.

హమాస్ దాడి చేసి 40 మంది పసిపిల్లల గొంతు కోసిందంటూ ఇజ్రాయిల్ అల్లిన అవాస్తవ కథనాన్ని యావత్ ప్రపంచ మీడియా పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. చివరకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా ఖండిస్తూ మాట్లాడాడు. 'ఇలాంటి ప్రకటనలు చేసే ముందు నిర్ధారణ చేసుకుంటే మంచిది. లేకుంటే పరువు పోతుంది ముసలోడా...' అంటూ అతగాడి సిబ్బంది తరువాత జాగ్రత్త చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఇప్పటికీ ఈ కట్టు కథ సామాజిక మాధ్యమాల్లో తిరుగుతూనే ఉంది. ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు దాన్ని ఉదహరిస్తూనే ఉన్నారు. ముస్లింలు జిహాద్ ప్రకటించారు. ప్రపంచ మొత్తాన్ని కబళించేందుకు పూనుకున్నారు. తమ జనాభా సంఖ్యను పెంచుతున్నారు అంటూ సాగిస్తున్న అనేక కుట్ర కథనాలతో దశాబ్దాల తరబడి జరుపుతున్న గోబెల్స్ ప్రచారాన్ని బుర్రలకు ఎక్కించుకున్నవారిని ఇలాంటివి వెంటనే ఆకర్షిస్తాయి. అదేగనుక వాస్తవమైతే ఇజ్రాయిల్ చుట్టూ ఉన్నది ముస్లిం దేశాలే, అవన్నీ ఒక్కసారిగా దండెత్తి ఉంటే ఈ పాటికి అది అదృశ్యమై ఉండేది. పాలస్తీనియన్లు ఏడున్నర దశాబ్దాలుగా అష్టకష్టాలు పడి ఉండేవారు కాదు. కానీ అలా జరగలేదే! అలాంటిది ముస్లింలు ప్రపంచం మొత్తాన్ని ఆక్రమిస్తారంటే నమ్మేవారికి బుర్రల్లో పదార్ధం లేదన్నది స్పష్టం. ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ మారణాయుధాలను గుట్టలుగా పోసి ప్రపంచానికి ప్రమాదం తెచ్చిపెట్టాడన్న నాటి జార్జి డబ్లు బుష్, మీడియా ప్రచారాన్ని అమెరికాతో పాటు అనేక దేశాల్లో జనం నమ్మారు. తరువాత అది వాస్తవం కాదని అదే అమెరికా అంగీకరించాల్సి వచ్చింది. పాలకులతో పాటు మీడియా కూడా విశ్వసనీయతను కోల్పోయింది.

అన్నెం పున్నెం ఎరుగని పసిపిల్లలను నిజంగా ఒక్కరిని చంపినా ఖండించాల్సిందే. ఆగస్టు 15 నాటికి గాజాలో 42 వేల మందిని ఇజ్రాయిల్ చంపితే వారిలో 17 వేల మందికి పైగా పిల్లలు, పదకొండు వేల మంది మహిళలు ఉన్నారు. ఏ పశ్చిమ దేశాల మీడియా సంస్థలైనా దీన్ని గురించి ఎన్ని వార్తలను ఇచ్చాయి. ఇంతటి దుర్మార్గానికి పాల్పడిన తరువాత కూడా ఇంకా హమాస్ గురించే అవి చెబుతున్నాయి. నలభై రెండు వేల మందిని చంపి దాదాపు ఒక లక్ష మందిని గాయపరచి, పది వేల మందిని అదృశ్యం కావించిన యూదు దురహంకారులు పాలస్తీనియన్లను తిప్పికొట్టేందుకు చేసిన పనిగా అందమైన మాటలతో పచ్చి దుర్మార్గాన్ని పశ్చిమ దేశాలు వర్ణిస్తున్నాయి. బిబిసి తీరును పరిశీలిస్తే గతేడాది అక్టోబరు 10 నుంచి డిసెంబరు రెండవ తేదీ వరకు 23 సార్లు హమాస్ సాయుధులు ఇజ్రాయిలీలపై మారణకాండ జరిపారని వర్ణిస్తే ఒక్కసారే పాలస్తీనియన్ల మీద మారణకాండ పద ప్రయోగం జరిగిందని తేలింది. అంటే దొంగే దొంగని అరచినట్లుగా బిబిసి తీరు ఉంది. ఈ తీరుకు నిరసనగా 2023 అక్టోబరులోనే ఇద్దరు ఆ సంస్థ జర్నలిస్టులు రాజీనామా చేశారు. గాజాపై దాడిని ఖండిస్తూ వెయ్యి మంది అమెరికా జర్నలిస్టులతో పాటు సంతకం చేసిన 'న్యూయార్క్ టైమ్స్' మాగజైన్ ఎడిటర్ జాజ్ హగ్స్ మీద యాజమాన్యం ఒత్తిడి తేవటంతో రాజీనామా చేసి తప్పుకోవాల్సి వచ్చింది. ఆ జాబితా నుంచి పేరు తొలగించాలని అసోసియేటెడ్ ప్రెస్ విలేకరిని యాజమాన్యం ఆదేశించింది. ఇలా లాస్ ఏంజెల్స్ 'టైమ్స్' వంటి అనేక పత్రికలు, మాగజైన్లు కూడా ఇజ్రాయిల్‌కు అనుకూలంగా ఒత్తిడి చేసి అనేక మంది జర్నలిస్టులను తొలగించటం, నోరు మూయించటం వంటి దుర్మార్గాలకు పాల్పడ్డాయి. పాలస్తీనియన్ల మీద తప్పుడు వార్తలు ఒక ఎత్తయితే 'వాల్‌స్ట్రీట్ జర్నల్' అనే ప్రముఖ అమెరికా పత్రిక రాసిన ఒక ఆధారం లేని వార్త కారణంగా గాజాలో నిరాశ్రయులకు అందాల్సిన 45 కోట్ల డాలర్ల సాయం నిలిచిపోయింది. గాజాలో ఐరాస నిర్వహిస్తున్న శిబిరంలో పని చేస్తున్న పన్నెండు మంది సిబ్బందికి హమాస్‌తో సంబంధాలు ఉన్నాయని, వారంతా దాడుల్లో పాల్గొన్నారని ఆ పత్రిక కేవలం ఇజ్రాయిల్ కట్టుకథనే తనదిగా రాసింది. నిజానికి దానికి ఎలాంటి ఆధారాలు లేవు. అమెరికా సి.ఎన్.ఎన్, బ్రిటన్ బి.బి.సిలో పని చేస్తూ గాజా పరిణామాలపై వార్తలు ఇచ్చిన పది మంది విలేకర్లు ఇజ్రాయిల్ అనుకూల వైఖరితో పని చేసినట్లు వెల్లడించారు. న్యూస్ రూముల్లో ఉన్న సీనియర్లు జోక్యం చేసుకొని ఇజ్రాయిల్ చేసిన దుర్మార్గాలను తక్కువ చేసి చూపాలని ఒత్తిడి చేసినట్లు వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన చిత్రం ద్వారా బిబిసి భాషలో పాలస్తీనియన్ల మీద వ్యతిరేకతను ఎలా రెచ్చగొట్టారో జరిపిన ఒక పరిశీలన వచ్చింది. అదే మంటే మారణకాండకు గుర్తైనట్లు 23 సార్లు ఇజ్రాయిల్ గురించి చెప్పగా ఒక్కసారి మాత్రమే పాలస్తీనా పేరును ప్రస్తావించారు. ఊచకోతకు గుర్తైనట్లు ఇరవైసార్లు ఇజ్రాయిల్ గురించి చెప్పగా ఒక్కసారి కూడా పాలస్తీనా పేరు రాలేదు.

తమ పత్రికలు ఎన్ని తప్పుడు కథనాలు, అవాస్తవాలు రాసినా అమెరికా యువత ముఖ్యంగా విద్యార్థులు పాలస్తీనా అనుకూల వైఖరి తీసుకోవటం గమనించాల్సిన అంశం. వారు మీడియా కతలను నమ్మటం లేదన్నది వాస్తవం. ఇజ్రాయిల్ మారణకాండకు పాల్పడుతున్నదని నమ్మిన కారణంగానే ఈ పరిణామం. ఇది అక్కడి పాలక వర్గాలకు ఆందోళన కలిగించే అంశం. ప్రచారదాడి ఎదురు తిరిగితే వారి పునాదులను కదలించే కదన శక్తిగా యువత మారుతుంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యావరణ ఉద్యమ కార్యకర్త 21 సంవత్సరాల స్వీడిష్ యువతి గ్రెటా థన్‌బర్గ్ పాలస్తీనా అనుకూల ప్రదర్శనలో పాల్గొన్నందుకు కోపెన్‌హాగన్ నగరంలో అరెస్టు చేశారు. మీడియా కూడా ఆమె మీద పెద్ద ఎత్తున విమర్శలకు దిగింది. యువతలో వచ్చిన ఈ మార్పును కూడా మూసిపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. ఒకసారి నీవు బాధితుడవైనందుకు గాను ఇతరుల మీద నిరంతరం దాడి కొనసాగిస్తానంటే కుదరదు, దేనికైనా ఒక హద్దు ఉంటుంది. దాన్ని మీరి గాజాలో పాలస్తీనియన్ల మీద ఇజ్రాయిల్ దుర్మార్గాలకు పాల్పడుతున్నది. పశ్చిమ దేశాల మీడియా దానికి మద్దతు ఇస్తున్నది. ★

సందర్భం

మానసిక వికలాంగుల సంరక్షణ ప్రభుత్వాల బాధ్యత

యం. అడివయ్య

మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం కోసం వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ (డబ్ల్యు.ఎఫ్.ఎమ్.హెచ్) 1992లో అక్టోబర్ 10వ తేదీని ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంగా ప్రకటించింది. 1994 నుండి ప్రతి సంవత్సరం డబ్ల్యు.ఎఫ్.ఎమ్.హెచ్ సంస్థ మానసిక ఆరోగ్యంపై నిర్దిష్టమైన థీమ్‌ను ప్రకటిస్తుంది. మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యల నివారణ, అందరికీ మానసిక ఆరోగ్యం లక్ష్యంగా థీమ్ ఉంటోంది. ఈ సందర్భంగా ఆరోగ్య మంత్రిత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ కృషి చేస్తుంది.

మానసిక వికలాంగులు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో పని చేసే పరిస్థితులు లేకపోవడం వలన పనిలో పాల్గొనలేకపోతున్నారు. జనాభాలో 60 శాతం మంది ఏదో ఒక పని చేస్తున్నందున ప్రభుత్వాలు, యాజమాన్యాలు...కార్మికుల ఆరోగ్యం, భద్రతకు బాధ్యత వహించడం ద్వారా మానసిక ఆరోగ్యం మెరుగుపర్చుకోవడం సులువు అవుతుంది.

కోవిడ్ 19 వలన ప్రజలు తీవ్రమైన మానసిక క్షోభను అనుభవించారు. మానసిక వికలాంగులపై తీవ్రమైన ప్రభావం పడింది. సామాజిక, ఆర్థిక అసమానతలను సృష్టించింది. ఉపాధి కోల్పోయి నిరుద్యోగులుగా మారడం వలన ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టలేదు. సమాజంలో ఉన్న ఆర్థిక అసమానతలు మన దేశంలో ప్రజల మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసింది. మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం మౌలిక సదుపాయల కొరత, ఆరోగ్య నిపుణుల కొరత ఉంది. ప్రయివేట్ హాస్పిటల్లో ఒక్క కౌన్సిలింగ్‌కు 5000 నుండి 10,000 రూపాయల వరకు ఖర్చు అవుతుంది. ఇది సాధారణ ప్రజలపై భరించలేని భారం వేస్తుంది. బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్స్ చేసిన 'నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే-2018' నివేదిక ప్రకారం మన దేశంలో మానసిక రుగ్మతలు కలిగిన వారిలో 83 శాతం మంది చికిత్స పొందలేకపోతున్నారు. మానసిక వైద్యుల సంఖ్య ప్రతి 1,00,000 మంది ప్రజలకు మధ్యప్రదేశ్‌లో 0.05 ఉంటే కేరళలో 1.2గా ఉంది. 2021లో ప్రతి లక్ష మందికి ముగ్గురు మానసిక వైద్యులను పెంచాలని ప్రభుత్వం నిర్ణయం చేసింది.

కేంద్ర ప్రభుత్వం మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం-1987కు సవరణలు చేస్తూ మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ 2017ను ఆమోదించింది. దీని ద్వారా దేశంలో మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి మానసిక ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్య సేవలు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. మానసిక ఆరోగ్య సంరక్షణ పొందడం, అమానవీయమైన, అవమానకరమైన పరిస్థితుల నుండి రక్షణ పొందడం, వివక్షత లేకుండా సమానంగా హక్కులు పొందడం వంటి వాటిని చట్టం కల్పించింది. కానీ మన దేశంలో చట్టం అమలులోకి వచ్చి 7 సంవత్సరాలు అవుతున్నా...మానసిక ఆరోగ్య సంరక్షణ అవసరమున్న వారికి ఎలాంటి ప్రయోజనమూ కలగలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్-2017 అమలుకు కనీస ప్రయత్నాలు చేయడం లేదు. మానసిక ఆరోగ్య సమీక్షా కమిషన్ నేతృత్వంలో నిరంతరం సమీక్షలు చేయాలి. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రభుత్వ అనుమతితో మానసిక ఆరోగ్య సమీక్షా బోర్డులు ఏర్పాటు చేయాలి. ఆత్మహత్యలను నేరంగా పరిగణించడమేగాక, ఆత్మహత్యలకు పాల్పడే వ్యక్తులను మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్నట్లుగా భావించాలి. చట్టంలోని నిబంధనలు ఉల్లంఘిస్తే 6-24 నెలలు జైలు శిక్ష, రూ.50,000 నుండి 5,00,000 వరకు జరిమానా విధించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

> మానసిక ఆరోగ్య సంరక్షణ పొందడం, అమానవీయమైన, అవమానకరమైన పరిస్థితుల నుండి రక్షణ పొందడం, న్యాయ సహాయం పొందడం, వివక్షత లేకుండా సమంగా హక్కులు పొందడం వంటి వాటిని చట్టం కల్పించింది. కానీ మన దేశంలో చట్టం అమలులోకి వచ్చి 7 సంవత్సరాలు అవుతున్నా మానసిక ఆరోగ్య సంరక్షణ అవసరమున్న వారికి ఎలాంటి ప్రయోజనమూ కలగలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్-2017 అమలుకు కనీస ప్రయత్నాలు చేయడం లేదు. మానసిక ఆరోగ్య సమీక్షా కమిషన్ నేతృత్వంలో నిరంతరం సమీక్షలు చేయాలి.



అక్టోబర్ 10 ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

ఆర్థిక సర్వే 2023-24లో మొదటి సారిగా మానసిక ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేసింది. జాతీయ మానసిక ఆరోగ్య సర్వే 2015-16 నివేదిక ప్రకారం దేశంలో 10.6 శాతం మంది పెద్దలు మానసిక రుగ్మతలతో బాధ పడుతున్నారు. 70 శాతం మందికి వైద్యం అందుబాటులో లేదు. గ్రామీణ ప్రాంతంలో 6.9 శాతం, పట్టణ ప్రాంతాల్లో 4.3 శాతం, మెట్రోపాలిటన్ పట్టణాల్లో 13.5 శాతం మంది ప్రజలు మానసిక ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. ఎన్.సి.ఇ.ఆర్.టి నిర్వహించిన మానసిక ఆరోగ్యం, పాఠశాల విద్యార్థుల శ్రేయస్సు సర్వేలో కోవిడ్ 19 కారణంగా యువతలో మానసిక ఆరోగ్యం బలహీనంగా ఉందని, 11 శాతం మంది విద్యార్థులు మానసిక ఆరోగ్య సమస్యలతో ఆందోళన చెందుతున్నారని, 14 శాతం మంది తీవ్ర భావోద్వేగానికి గురవుతున్నారని తెలిసింది. పేదరికం, ఒత్తిడితో కూడిన జీవన విధానం కూడా మానసిక ఆరోగ్యన్ని ప్రభావితం చేస్తుంది. జాతీయ మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం, నేషనల్ టెలి మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్, మానసిక ఆరోగ్య సిబ్బందిని పెంచడం, ఆడాలసెంట్ ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్, పెయిర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ లాంటి వాటిని గ్రామ స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరముంది. ఆశా వర్కర్లు, అంగన్వాడీ స్థాయిలోనే మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ద్వారా మానసిక రుగ్మతలను ముందే గుర్తిస్తే నివారించడానికి అవకాశం ఉంది. మానసిక ఆరోగ్య పాఠ్యాంశాలను అభివృద్ధి చేయడానికి, పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ స్థాయిలో విద్యార్థులు, అధ్యాపకులలో అవగాహన పెంచడానికి కృషి చేయాలి. మానసిక ఆరోగ్య సంరక్షణ సేవల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కమ్యూనిటీ ఆధారిత పునరావాస కార్యక్రమలను విస్తృతం చేయాలి. మానసిక ఆరోగ్య రుగ్మతలు పెరగకుండా ఉండేందుకు కృషి చేస్తూనే తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ప్రతి జిల్లా కేంద్రంలో మానసిక వికలాంగుల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ హాస్పిటళ్లలో మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం వైద్యులను నియమించాలి. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే మానసిక ఆరోగ్య రుగ్మతల నిర్మూలన సాధ్యం. మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్-2017 అమలు కోసం ఐక్యంగా ఉద్యమాలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

/వ్యాసకర్త ఎన్.పి.ఆర్.డి జాతీయ ఉపాధ్యక్షులు/

జనవాక్యం

జైళ్లలో కుల సంకెళ్లా!

దేశంలోని జైళ్లలో కుల వివక్ష కొనసాగడం దౌర్భాగ్యం. ఖైదీలకు కులాల వారీగా పనుల అప్పగింత, వసతి ఏర్పాటు నేటికీ అధికారికంగా కొనసాగుతుందని తెలిసినప్పుడు నవ్వాలో, ఏడవాలో తెలియని స్థితి. పౌరులంతా సమానమేనంటూ రాజ్యాంగం రాసుకొని దశాబ్దాలైనా ఈ విష సంస్కృతి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నడిచిపోవడం, సభ్య సమాజం దృష్టి సోకకపోవడం అనారోగ్యకరమైన వింత. నేడు సుప్రీం కోర్టు అన్ని రాష్ట్రాలకూ, కేంద్రానికీ ఈ విపరీత పోకడ కొనసాగరాదని, అందుకు అవసరమైన మార్పుల్ని జైలు మాన్యువళ్లలో ప్రవేశ పెట్టాలని తాఖీదు ఇవ్వడం అభినందనీయం. జైలు గోడల మధ్య జరిగే కుల వివక్ష దృష్టికి వస్తే, దాన్ని విచారణకు అర్హమైన కేసుగా పరిగణించాలని కోర్టులకు, అధికార యంత్రాంగానికి సూచించడం మంచి పరిణామం. సమాజం కుల రహితంగానో, అన్ని కులాల్ని సమానంగా చూసే స్థితికి చేరడంగానో అయ్యేందుకు చాలా దూరం, కాలం పడుతుంది. అంత బలమైన వ్యవస్థను మార్చడానికి ఎన్నో మార్పులు, సంస్కరణలు రావాలి. చట్టాల ద్వారా, చైతన్యం ద్వారా ఆ మార్గంలో నడిచేందుకు రాజ్యాంగం వీలు కల్పించింది. అంటరాని తనం నేరంగా పరిగణించినా, సమానత్వం హక్కులు, ప్రత్యేక హక్కులు పొందుపర్చినా ఆ కృషిలో భాగమే. వాటిని కాపాడాల్సిన, అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. అలా రక్షణగా నిలవాల్సిన ప్రభుత్వాలు తెలిసో, తెలియకో ఇలాంటి వివక్షా పూరిత నిబంధనల్ని కొనసాగించడం సమాజాన్ని వెనక్కి నడిపించడమే. సుప్రీం ఈ తప్పుని సరిచేసింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తదనుగుణంగా చర్యల్ని వెంటనే చేపట్టాలి.

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం, విజయనగరం.

మార్కెట్లకు ఎట్టకేలకు ఉపశమనం

- సెన్సెక్స్ 580 పాయింట్ల ర్యాలీ
- చైనా స్టాక్ ఎక్స్ఛేంజీలకు భారీ లాభాలు

ముంబయి : వరుసగా ఆరు సెషన్లలో భారీ నష్టాలు చవి చూసిన దేశీయ స్టాక్ మార్కెట్లకు ఎట్టకేలకు మంగళవారం ఉపశమనం లభించింది. ఉదయం నష్టాల్లోనే ప్రారంభమైనప్పటికీ... పలు పరిణామాల మధ్య కొనుగోళ్ల మద్దతుతో తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 584.81 పాయింట్లు లేదా 0.72 శాతం పెరిగి 81,634కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 217 పాయింట్లు లాభపడి 25,013 వద్ద ముగిసింది. హర్యానా, జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మార్కెట్లు ప్రారంభంలో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. చివరకు హర్యానా ఎన్నికల్లో బిజెపికి మద్దతు పెరగడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. మరోవైపు ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను బుధవారం వెల్లడించనుంది. దీనిపై ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఉన్నారు. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఎల్అండ్‌టి షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు టాటా స్టీల్, టైటాన్, బజాజ్ ఫిన్‌సర్వ్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

షాంఘై స్టాక్ ఎక్స్ఛేంజ్ 4.59 శాతం వృద్ధి

వారం రోజుల తర్వాత తెరుచుకున్న చైనా మార్కెట్లు లాభాల్లో దంవంంమరేపాంంం. ఇజ్రాయిల్-ఇరాన్ ఆందోళనలతో భారీ నష్టాలు చవి చూసే అవకాశాలున్నాయన్న నిపుణుల అంచనాలకు భిన్నంగా రాణించాయి. మంగళవారం షాంఘై కాంపోజిట్ ఇండెక్స్ 4.59 శాతం పెరిగి 3,489.78 పాయింట్లకు చేరింది. షెంజెన్ కాంపోజిట్ ఇండెక్స్ ఏకంగా 9.17 శాతం లాభంతో 11,495.1 పాయింట్ల వద్ద ముగిసింది. 5,000 స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. దేశ వృద్ధి కోసం ఇటీవల చైనా నూతన విధానాలను ప్రకటించింది. ఇందుకోసం ప్రభుత్వ వ్యయం అమాంతం పెంచనున్నట్లు తెలిపింది. దీంతో విదేశీ సంస్థాగత మదుపర్లు చైనా మార్కెట్లలో భారీగా పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నారు.

రూ. లక్ష అపహరించిన సైబర్ నేరగాళ్లు

ప్రజాశక్తి- ఉంగుటూరు (ఏలూరు జిల్లా)

ఇటీవల కాలంలో సైబర్ నేరాలు బాగా పెరుగుతున్నాయి. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వాట్సప్ కాల్స్ కాని, వీడియో కాల్స్ కాని, టెక్స్ట్ మెసేజ్లు, ఎపిక్ ఫైల్స్ ఓపెన్ చేసినా మోసగాళ్ల బారిన పడటం ఖాయమని ఇటీవల సంఘటనలు రుజువు చేస్తున్నాయి. తాజాగా ఉంగుటూరు మండలంలో పలువురు ఇలాంటి మోసాలకు గురయ్యారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఓ ఉపాధ్యాయుడికి 92 సీరీస్ కలిగిన నెంబరు నుంచి ఫోను చేసిన అపరిచితలు మీ అమ్మాయి డ్రగ్స్‌తో దొరికిందని చెప్పి అవతల వ్యక్తి లంచం డిమాండు చేశాడు. ఉంగుటూరులో ఇద్దరు వ్యాపారులకు వాట్సప్‌లో యూనియన్ బ్యాంకు డీపీతో కలిగిన నెంబరు నుంచి మాల్వేర్ ఫైల్ పంపి ఇద్దరు అకౌంట్‌లో చెరొక రూ.50 వేలు వంతున మొత్తం రూ.లక్ష కాజేసి వాళ్ల మొబైల్స్ హ్యాక్ చేసి దుర్వినియోగానికి పాల్పడ్డారు.

ఇ-వేలం అమ్మకం (వరద నీటితో దెబ్బతిన్న) [illegible]
[illegible] తర్వాత పై పదార్థాల నివృత్తిని తనిఖీ చేయవచ్చు. ఇ వేలం 21.10.2024న నిర్వహించబడును. ఇ వేలం ఫారంల కొరకు సల్వర్ సెటిలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (వేలం నిర్వాహకులు) శ్రీ.ఖుషి, మొబైల్ - 9990857386, చిరునామా : 203, 2వ అంతస్తు, ఉషా కిరణ్ బిల్డింగ్ ఆజాద్‌పూర్ కమర్షియల్ కాంప్లెక్స్, ఢిల్లీ-110033 వద్ద సంప్రదించగలరు లేదా వెబ్‌సైట్ : www.salvorsettlers.com నుండి డౌన్లోడ్ చేసుకోగరు. ఇ వేలం సమర్పణకు చివరి తేది : 21.10.2024, మ.12.30 గం. కు ముందు.

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరుగలది)
రిజిస్టర్డు ఆఫీసు : 5వ అంతస్తు, టవర్-3, వింగ్-బి, కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్లా (వెస్ట్), ముంబయి-400 070. రీజినల్ ఆఫీసు : 3వ & 4వ అంతస్తు, శ్రీ ప్రశాంతి సాయిటవర్స్, ప్లాట్ నెం.68, మున్సిపల్ నెం. 8-2-248, నాగార్జున హిల్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, పంజగుట్ట దగ్గర, హైదరాబాద్-500 082
nido HOME FINANCE

ఇ-వేలం-చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకపు ప్రకటన

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద ఇ-వేలం ద్వారా అమ్మకం.
ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమగనా, దిగువ పేర్కొన్న ఆస్తిని రుణ బకాయిలను రికవరీచేయు వరకు పట్టికలో పేర్కొన్నట్లుగా మొత్తాలను రికవరీచేయుట కొరకు **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన విక్రయించబడుతుంది. సదరు ఆస్తినిరుణగ్రహీత(లు), సహ-రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) పొందిన రుణం కొరకు **నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరుగలది)** వారికి సదరు ఆస్తిని తాకట్టుపెట్టడం జరిగింది. దిగువ పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్‌ను సెక్యూర్డ్ క్రెడిటర్ భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు.

క్ర సం.	రుణగ్రహీత(లు)/సహ-రుణ గ్రహీత(లు)/హామీదారు/(ల) పేరు	రికవరీ మొత్తాలు	రిజర్వు ధర మరియు ధరావత్తు	వేలం తేది & సమయం
2.	కర్నాల గోవింద రావు (రుణగ్రహీత) & అప్పల నారాయణమ్మ కర్నెలా(సహ-రుణగ్రహీత)	LAN NO : LVIJSTH0000017498 కొరకు 08.10.2024 నాటికి రూ. 20,52,216.41/- (రూపాయలు ఇరవైలక్షల యాభైరెండువేల రెండువందల పదహారు& నలభైఒక పైసలు మాత్రమే) + దానిపై తదుపరి వడ్డీ + లీగల్ వ్యయాలు.	రూ. 23,13,360/- (రూపాయలు ఇరవైమూడు లక్షల పదమూడువేల మూడువందల అరవై మాత్రమే). ధరావత్తు డిపాజిట్ : రూ. 2,31,336/- (రూపాయలు రెండులక్షల ముప్పైఒకవేల మూడువందల ముప్పైఆరు మాత్రమే)	06-11-2024 ఉ॥ 11 గం.ల నుండి మ॥ 12 గం.ల మధ్య (5 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపుతో)

తనిఖీచేయు తేది & సమయం : 30-10-2024న ఉ॥ 11.00 గం.లు నుండి మ॥ 3.00 గం.ల మధ్య | భౌతిక స్వాధీనతా తేది : 04-04-2024

సెక్యూర్డ్ అసెట్ వివరణ : డో.నెం: 7-93/8, ఆర్.ఎస్.నెం.76/1, 76/2, సాయి భవాని ఎన్‌క్లేవ్, ప్రసాదంపాడు గ్రామ పంచాయతీ, కృష్ణ, విజయవాడ-521 108 లోని 168.0 చ.గ.లు లేదా 140.46 చ.మీ.లకుగాను 24.0 చ.గ.లు లేదా 20.06 చ.మీ.ల విడదీయలేని స్థల విస్తీర్ణపు గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెం.జి.ఎఫ్1 మొత్తం భాగం. **సరిహద్దులు : ఉత్తరం:** జె. కుటుంబ సుబ్బారావు ఆస్తి, **దక్షిణం:** జి.వి. రామారావు ఇతరులకు విక్రయించబడిన ఆస్తి, **తూర్పు:** ఎస్. సౌమ్య ఆస్తి, **పడమర:** 18.0 అ.ల వెడల్పు బజార్.

గమనిక : 1) వేలం అమ్మకం అనునది వెబ్‌సైట్: https://sarfaesi.auctiontiger.net ద్వారా ఆన్‌లైన్ నిర్వహించబడుతుంది మరియు అట్టి బిడ్డరుదారులు వ్యాలిడ్ ఇమెయిల్, ఐడి ప్రూఫ్& ఫోటో ప్రూఫ్, పాన్ కార్డు మరియు డిమాండ్ డ్రాఫ్టు/ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ ద్వారా ధరావత్తు చెల్లించుట ద్వారా ఈ **"ఆన్-లైన్ వేలం"**లో పాల్గొనవలెను.
2) ఆసక్తిగల బిడ్డరుదారులు వారి ధరావత్తును డిమాండ్ డ్రాఫ్ట్/ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ రూపేనా దాఖలు చేయవలెను: **లబ్దిదారు పేరు: నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్; స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఖాతా నెం.65226845199, SARFAESI-అక్షన్, ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఐఎఫ్ఎస్‌సి కోడ్ :** SBIN0001593.
3) ధరావత్తుతోపాటు ఆన్‌లైన్ దరఖాస్తు బిడ్ ఫారం దాఖలుచేయుట కొరకు చివరి తేది : 05-11-2024
4) అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& షరతుల కొరకు, దయచేసి దర్శించండి: వెబ్‌సైట్ : https://sarfaesi.auctiontiger.net లేదా దయచేసి సంప్రదించండి: శ్రీమౌలిక్ శ్రీమాలి, ఫోన్ : +91-6351896643/ 9173528727, హెల్ప్‌లైన్ ఇమెయిల్ ఐడి : Support@auctiontiger.net

మొబైల్ నెం.7207645328 // 8885462308
తేది : 09-10-2024
సం/- అధీకృత అధికారి,
నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరుగలది)

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్
CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ♦ DEPOSITS Translating Dreams into Reality
40-5-19/17, 1వ అంతస్తు, సిద్ధార్థ కాలేజ్ బస్ స్టాప్ దగ్గర, మొగల్‌రాజపురం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010. ఫోన్: 0866-2474781
E-mail: vijaywada@canfinhomes.com, CIN:L85110KA1987LC008699

ఉద్దేశించిన అమ్మకం నోటీసు
Under Rule 8(6) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002

దిగువ వారికి,
1) **అప్లికెంట్: శ్రీ జుంజు ప్రవీణ్‌బాబు,** డి.నెం.13-520, కెయల్ రావు కాలనీ, తాడేపల్లి, సీతానగరం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522501. 2) **కో-అప్లికెంట్: శ్రీమతి జుంజు రాజేశ్వరి,** డి.నెం.13-520, కెయల్ రావు కాలనీ, తాడేపల్లి, సీతానగరం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522501.
మీలోని నెం.1&2 గా ఉన్నవారు మా బ్రాంచి నుండి గృహ ఋణము పొందియున్నారు మరియు అందులకు హామీగా ఈ దిగువ చెప్పిన మీలోని నెం.1 గా ఉన్నవారికి చెందిన ఆస్తి తనఖా ఉంచడమైనది. మీ ఋణఖాతా **తేది.30.04.2024న నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడినది** మరియు తదుపరి **తేది.02-05-2024 నాటికి మా డిమాండ్ నోటీసు** నందు చెప్పిన బకాయిమొత్తము చెల్లించవలసినదిగా మిమ్ములను కోరడమైనది.

తనఖా ఉంచిన ఆస్తుల వివరములు
కృష్ణా జిల్లా, విజయవాడ, రామవరప్పాడు, మల్లెమూడివారి స్ట్రీట్, ఆర్.యస్.నెం. 121/6 నందు 320 చ॥గ॥ విస్తీర్ణముగల స్థలములో అవిభాజ్యపు మరియు అనిర్థిష్టపు భాగమైన 29.09 చ॥గ॥ విస్తీర్ణము మరియు మొత్తం స్థలములో నిర్మించిన **సాయిరాఘవ ఎన్‌క్లేవ్,** మూడవ అంతస్తులో 420 చ॥అ॥ ప్లింత్ ఏరియాలోని రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.TF-2 మరియు 101 చ॥అ॥ కామన్ ఏరియా మరియు 36 చ॥అ॥ పార్కింగ్ ఏరియాతో సహా అన్ని అనుషంగిక హక్కులతో సహా యావదాస్తి. **ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు:** వరండా; **పడమర:** శూన్యాకాశము, **దక్షిణం:** మెట్లు మరియు వరండా, **ఉత్తరం:** శూన్యాకాశము. **స్థలమునకు హద్దులు: తూర్పు:** కుంచేటి కృష్ణమూర్తి యొక్క ఆస్తి; **పడమర:** బండరావూరి పార్థసారధి యొక్క ఆస్తి, **దక్షిణం:** పంచాయతీ బజారు, **ఉత్తరం:** మల్లెమూడి శశిరేఖమ్మ గారి ఆస్తి.
డిమాండ్ నోటీసు ప్రకారం మీరు బకాయి చెల్లించలేదు. అందుచే దిగువ సంతకందారు అయిన అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8 తో చదివే సెక్షన్ 13(4) యొక్క ప్రొవిజన్ ప్రకారం సెక్యూర్డ్ స్థిరాస్తులను స్వాధీనం చేసికొన్నారు.
ఇందుమూలంగా కోరునది ఏమనగా లోన్ మొత్తం బకాయిలన్నీ అనగా **తేది.02.05.2024 నాటికి బకాయిలు రూ.20,79,443/-** దీనితో కాంట్రాక్టు రేటు ప్రకారం అయిన వడ్డీ & ఖర్చులు చెల్లించవలసినదిగా కోరియున్నారు. ఈ విషయము గురించి మీకు ఆఖరి సారిగా ఇచ్చిన చిరునామాకు రిజిష్టర్డు పోస్టు ద్వారా నోటీసును పంపియున్నాము. అది అందకుండానే తిరిగి వచ్చినది. అందుచే ఈ పత్రికా ప్రకటన జారీ చేయడమైనది.
ఇది ఆఖరిసారిగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)లోని రూలు 8(6) ప్రకారం జారీ చేసిన నోటీసు. మీరు ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా పూర్తిగా బకాయి చెల్లించవలెను. విఫలమైనచో దిగువ సంతకందారు గారు వేలం తేదీ నిర్ణయించెదరు. వేలం నోటీసును ప్రచురించి సెక్యూర్డు స్థిరాస్తులను సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం అమ్మకం చేసి, సెక్యూర్డు బకాయిలను రాబట్టుకొనెదరు.
తేది : 08-10-2024
ప్రదేశము : విజయవాడ
సం/- అధీకృత అధికారి
కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

పెనుకొండ కోసం మాజీల పట్టు

- శంకరనారాయణ, ఉషశ్రీచరణ్ గ్రూపులుగా వైసిపి

ప్రజాశక్తి-పెనుకొండ (అనంతపురం)

పెనుకొండ నియోజకవర్గం కోసం వైసిపి మాజీ మంత్రులు మాలగుండ్ల శంకర నారాయణ, ఉషశ్రీ చరణ్‌ల మధ్య కొన్నాళ్లుగా పెద్ద ఎత్తునే పోరు నడుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత మాజీలు ఒక్కొక్కరూ వైసిపిని వీడుతున్నారు. పెనుకొండలో మాత్రం శంకరనారాయణ, ఉషశ్రీ చరణ్‌ల కథ మరోలా ఉంది. ఈ ఇద్దరు వైసిపి నాయకులు పెనుకొండ తనదంటే తనదని పోటీ పడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మంత్రులైన వీరిద్దరూ పెనుకొండ నియోజకవర్గం కోసం పంతం పట్టుకు కూర్చోవడం గమనార్హం.

ఇద్దరూ స్థానికేతరులే..!

మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ సొంతూరు ధర్మవరం. వైసీపీ ఆవిర్భావం నుంచి ఆపార్టీలో కొనసాగు తున్నారు. సుధీర్ఘకాలం పాటు వైసీపీ జిల్లా అధ్యక్షునిగా పని చేశారు. ధర్మవరంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఉండటంతో శంకరనారాయణ మరో నియోజక వర్గం ఎంచుకోవాల్సి వచ్చింది. అందులో భాగంగానే పెనుకొండకు వచ్చారు. కురుబ సామాజికవర్గం శంకరనారాయణకు బాగా కలసి వచ్చింది. శంకరనారాయణ 2014లో ఓడిపోయినా 2019లో పెనుకొండలో గెలిచి టిడిపి కంచుకోటను బద్దలు కొట్టారు. కుల సమీకరణలో అదృష్టం కలసి వచ్చి జగన్ క్యాబి నెట్‌లో మంత్రి కూడా అయ్యారు. మూడేళ్ల పాటు మంత్రిగా కొనసాగారు. మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణలో పదవి కోల్పోయారు. శంకర నారాయణ స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన ఉషశ్రీ చరణ్‌కు మంత్రి పదవి లభించింది. కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా ఉన్న ఈమెకు రాజకీయ సమీకరణలో భాగంగా వైసిపి అధిష్టానం 2024లో పెనుకొండ టికెట్టు ఇచ్చి అక్కడి నుంచి పోటీ చేయించింది. ఈ ఎన్నికల్లో ఆమె ఓటమి చవి చూసింది. ఇక పెనుకొండ నుంచి స్థానం మారి అనంత పార్లమెంట్‌కు పోటీ చేసిన శంకర నారాయణ కూడా ఓటమి చెందారు.

శంకరనారాయణ

ఉషశ్రీచరణ్

రెండు గ్రూపులుగా సమావేశాలు

ఇద్దరు మాజీ మంత్రులు ఓటమి తర్వాత పెనుకొండలో రాజకీయం చేయడానికి సిద్ధమయ్యారు. శంకరనారాయణ సొంత గృహం ఉండ టంతో పెనుకొండలోనే మకాం వేశారు. ఆయన అనుచరులు ఎప్పటికప్పుడు కలుస్తూ రాజకీయ అంశాలు చర్చలు జరుపుతున్నారు. అధిష్టానం పిలుపునిచ్చే కార్యక్రమాలను తన వర్గం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో చేస్తున్నారు. ఉషశ్రీచరణ్ ఎన్నికల ముందు పెనుకొండలో అద్దెఇంట్లో నివాసం ఉన్నారు. ఎన్నికల అనంతరం ఇంటిని ఖాళీ చేశారు. పార్టీ కార్యాలయం కూడా ఖాళీ చేసి మరో చోట అద్దెకు తీసుకున్నారు. తిరుమల లడ్డూ వివాదంపై దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని అధిష్టానం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాన్ని శంకరనారాయ ణ, ఉషశ్రీ గ్రూపులు వేరువేరుగా నిర్వహించారు. ఇలా ప్రతి కార్యక్రమాన్ని వేరువేరుగానే చేస్తున్నారు.

ఇద్దరిపైన సొంతపార్టీలో వ్యతిరేకత

2024 ఎన్నికల్లో ఇద్దరు నేతలూ ఓటమి పాలయ్యారు. అనంతరం ఈ ఇద్దరూ పెనుకొండ కోసమే పట్టుబడుతున్నారు. నియోజకవర్గంలో ఈ ఇద్దరు నేతలతో పార్టీ రెండు గ్రూపులుగా విడిపోయింది. ఇద్దరు నేతలనూ వ్యతిరేకించేవారు, సమర్థించేవారు పార్టీలో ఉన్నారు. ఇద్దరు నేతల మధ్య పార్టీ క్యాడర్ సైతం తీవ్ర గందరగోళంలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి అధిష్టానం పెనుకొండ నియోజకవర్గంకు ఎవరు బాధ్యులో ప్రకటించాలనే వాదన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి విన్పిస్తోంది.

జెఎమ్ ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
JM FINANCIAL
కార్పొరేట్ గుర్తింపు నంబర్ : L67190MH2007PLC74287
నమోదిత కార్యాలయం :7వ అంతస్తు, సినెర్జీ, అప్పాసాహెబ్ మారతె మార్గ్, ప్రభాదేవి, ముంబై-400025
టెలి : +91 22 6630 3030, ఫ్యాక్స్ : +911 22 6630 3223, www.jmfinancialarc.com

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002 యొక్క రూల్ 3(1)తో చదువుతూ సెక్యూరిటిజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద దిగువ సంతకందారుడు పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ [గతంలో దివాన్ హౌసింగ్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్] యొక్క ఆధీకృత అధికారి సెక్యూరిటిజైషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("సర్ఫేసీ యాక్ట్") యొక్క సెక్షన్ 5(1) (బి) క్రింద జెఎమ్ఎఫ్ఎఆర్‌సి (జెఎమ్) (ఇకపై అసైనీగా పేర్కొనబడుతుంది) కి అనుకూలంగా వైడ్ అస్సైన్‌మెంట్ అగ్రిమెంట్ తేది 29 మార్చి, 2023 ("అస్సైన్‌మెంట్ అగ్రిమెంట్") అన్నీ హక్కులు, టైటిల్ మరియు వడ్డీతో పాటుగా సృష్టించబడిన అంతర్లీన సెక్యూరిటీ ఇంట్రస్ట్ ఒక పూల్ రుణాన్ని కేటాయించారు. (జెఎమ్) అసైనీ యొక్క అధీకృత అధికారి అయిన దిగువసంతకందారు సెక్యూరిటిజైషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 రూల్ 3తో చదువుతు చెప్పిన చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సదరు అధికారాలను వినియోగించుకుంటూ ఆధీకృత అధికారి చెప్పిన చట్టం సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటిసులు జారీ చేయడమైనది, పిలువబడిన రుణగ్రహీత/లు ("పేర్కొన్న రుణగ్రహీత(లు)"), ఇక్కడ పేర్కొనబడిన మొత్తాన్ని చెల్లించుటకు పిలుస్తూ డిమాండ్ నోటీసు/లు జారీ చేయడమైనది. పై దానికి అనుసంధానంగా, ఈ నోటీసు ప్రచురణ వెలువడిన 60 రోజులలోగా చెల్లించవలెనని రుణగ్రహీతకు చెప్తూ మరొక సారి నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, మొత్తం రూపాయలతో పాటు తదుపరి వడ్డీ దిగువ పేర్కొనబడినవి, చెల్లింపు మరియు/లేదా రియలైజేషన్ తేది వరకు తేదిలు దిగువ పేర్కొనబడినవి, రుణగ్రహీతలు చెప్పిన అన్నింటిని అమలు చేయుటకు ఇతర డాక్యుమెంట్‌లు/వ్రాతలతో చదువుతూ లోను అగ్రిమెంట్ క్రింద చెల్లించవలెనని, అంగీకరించడమైనది. లోను తిరిగి చెల్లించుటకు సెక్యూరిటీగా పెట్టినవి, సదరు రుణగ్రహీత(లు) జెఎమ్‌కు తాకట్టుపెట్టిన ఆస్తులు దిగువ ఇవ్వడమైనది.

రుణగ్రహీత(లు)/హామీదారు(లు) పేరు	డిమాండ్ నోటీసు తేది మరియు ఎన్‌పిఎ తేదితో మొత్తం	సెక్యూర్డ్ అస్సెట్ వివరణ (స్థిరాస్తి)
ఋణగ్రహీత: మెస్సర్స్ పరిణయ ఆగ్రో ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న పార్ట్‌నర్స్ శ్రీ పువ్వాడ వెంకట మల్లిఖార్జున బాపిశెట్టి మరియు శ్రీ గోడవర్తి వెంకటేశ్వర్లు, రిజిష్టర్డ్ కార్యాలయం చిరునామా: ఫ్లాట్ నెం.204, బ్లాక్ 3, అయోధ్య నగర్, విజయవాడ, విజయవాడ తూర్పు మండలం, కృష్ణ, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్-520003. రెంటల్ అడ్రస్: మెస్సర్స్ పరిణయ ఆగ్రో ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న పార్ట్‌నర్స్ శ్రీ పువ్వాడ వెంకట మల్లిఖార్జున బాపిశెట్టి మరియు శ్రీ గోడవర్తి వెంకటేశ్వర్లు, కేరాఫ్ శ్రీ నూనె శ్రీనివాసులు, డి.నెం.27-4-17/1, నగరంపాలెం, రెవెన్యూ వార్డు నెం.10, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. మరియొక చిరునామా: ఫ్యాక్టరీ అడ్రస్: మెస్సర్స్ పరిణయ ఆగ్రో ట్రేడర్స్, ప్రాతినిధ్యం పార్ట్‌నర్స్ శ్రీ పువ్వాడ వెంకట మల్లిఖార్జున బాపిశెట్టి మరియు శ్రీ గోడవర్తి వెంకటేశ్వర్లు, సాయి తేజ డాల్ మిల్, బుర్రిపాలెం రోడ్డు, తెనాలి, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522201. హామీదారులు: 1.శ్రీ పువ్వాడ వెంకట మల్లిఖార్జున బాపిశెట్టి పార్ట్‌నర్ మెస్సర్స్ పరిణయ ఆగ్రో ట్రేడర్స్, నివాసం ఫ్లాట్ 204, బ్లాక్ నెం.3, హెచ్ఆర్‌టి ఆకాష్, అయోధ్య నగర్, విజయవాడ (అర్బన్), కృష్ణ జిల్లా, ఆంధ్రప్రదేశ్-520003. 2.శ్రీ గోడవర్తి వెంకటేశ్వర్లు, తండ్రి: జి.కాశీ విశ్వనాథన్, పార్ట్‌నర్ మెస్సర్స్ పరిణయ ఆగ్రో ట్రేడర్స్, నివాసం డి.నెం.14-19-5/2, అంగజాల వారి స్ట్రీట్, మోరిస్ పేట, తెనాలి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522202.

విషయం : గుంటూరు మెయిన్ బ్రాంచ్ నందు గల ఋణ సౌకర్యం గురించి

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువ సంతకందారు రిజిష్టర్డ్ పోస్ట్ తేది.03.10.2024 ద్వారా మీకు తిరుగు రశీదులతో కూడిన డిమాండ్ నోటీసు తేది.01.10.2024న మీచే పొందుపరచబడిన చిరునామాకు జారీచేయడమైనది. మీరు చిరునామాలో లేనందున తపాల శాఖ వారిచే బ్రాంచినకు తిరుగు వచ్చినందున ఈ పత్రికా ప్రకటన ద్వారా సదరు నోటీసు ప్రచురించబడినది. సదరు నోటీసు యొక్క వివరము దిగువ తెలుపబడినది. మీ యొక్క లోన్ ఖాతా బకాయిలు సరిగా చెల్లించనందున సదరు అకౌంట్ తేది.08.09.2023 నుండి నిరర్థక ఆస్తిగా (ఎన్.పి.ఎ) పరిగణించబడినది. ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా మీరు బకాయి మొత్తము తేది.30.09.2024 నాటికి రూ.3,42,58,895.32/- (అక్షరాల మూడు కోట్ల నలభై రెండు లక్షల యాభై ఎనిమిది వేల ఎనిమిది వందల తొంభై ఐదు రూపాయల ముప్పై రెండు పైసలు మాత్రమే) + (01.10.2024 నుండి వర్తించని వడ్డీ మరియు ఇతర ఖర్చులతో) మరియు ఒప్పందపూర్వక తదుపరి జమకూడు వడ్డీ, ఛార్జీలు, ఇతర ఖర్చులు, మొదలగునవి మీరు చెల్లింపు చేయు తేది వరకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి చెల్లించవలెను. పైన చెప్పిన సదరు చట్టంలోని సెక్షన్ 13(13) నియమానుసారం సెక్యూరిటీగా ఉంచిన ఆస్తులకు సంబంధించి బ్యాంక్ ఆఫ్ బరోడా వారి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి అమ్మకము, లీజు లేదా ఇతరత్రా లావాదేవీలు (సాధారణ వ్యాపార అవసరాలు తప్ప) ద్వారా బదిలీ చేయుట నిషేధించబడతాయని మీరు గమనించవలెను. ఈ నోటీసు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) నిబంధనల ప్రకారం జారీచేయబడినది.

తనఖా ఉంచిన స్థిరాస్తి వివరములు
ఎన్టీఆర్ జిల్లా, ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రేషన్ ఆఫీస్, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, విజయవాడ, విద్యాధరపురం, పాత సర్వే నెం.5, ఆర్.ఎస్.నెం.5/1ఎ, సమీప డోర్ నెం. 3-1-292/7, విస్తీర్ణం 714.00 చ॥గ॥ లేదా 596.97 చ॥మీ॥ల నివాసయోగ్యమైన ఖాళీ భూమి యొక్క స్థలమునకు హద్దులు: తూర్పు: రోడ్డు-119అ॥, పడమర: విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ స్థలం-119అ॥, ఉత్తరం: కంచర్ల బుల్లెమ్మ మరియు ఇతరుల స్థలం-54.9అ॥, దక్షిణం: డి.వీరయ్య మరియు ఇతరుల ఆస్తి-54.9అ॥.

గమనిక: సాంకేతిక కారణాల రీత్యా, మేము ది.16.09.2023 & 26.09.2024న గతంలో జారీ చేసిన డిమాండ్ నోటీసులను ఉపసంహరించుకోవడం ద్వారా ఈ తాజా నోటిఫికేషన్ ను జారీచేస్తున్నాము.

ప్రదేశం : గుంటూరు
తేది : 01.10.2024
సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా, గుంటూరు మెయిన్ బ్రాంచ్

దెబ్బతీసిన అతివిశ్వాసం

- రచ్చకెక్కిన కుమ్ములాటలు
- జాట్ ఓట్లనే నమ్ముకొని భంగపడిన కాంగ్రెస్



చండీఘర్ : హర్యానాలో బిజెపి హ్యాట్రిక్ విజయాన్ని అడ్డుకోగలమని ధీమాగా ఉన్న కాంగ్రెస్‌కు భంగపాటు తప్పలేదు. లోక్‌సభ ఎన్నికలలో మొత్తం 10 స్థానాలలో కాంగ్రెస్, బిజెపి చెరో ఐదింటిని గెలుచుకున్నాయి. అంతకుముందు కాంగ్రెస్‌కు హర్యానా నుండి ప్రాతినిధ్యమే లేదు. ఐదు స్థానాలు గెలుచుకోవడంతో ఆ పార్టీలో మితిమీరిన ఆత్మవిశ్వాసం కన్పించింది. అదే చివరికి కొంప ముంచింది. మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ సింగ్ హుడాపై ఎక్కువగా ఆధారపడడం నష్టం కలిగించిందా అని పార్టీలో అంతర్మథనం మొదలైంది. హుడా, కుమారి సెల్జా మధ్య విభేదాలు వీధిన పడడం కాంగ్రెస్‌కు ఇబ్బంది కలిగించింది. ముఖ్యమంత్రి పదవి నాదంటే నాదంటూ వీరిద్దరూ వీధిన పడ్డారు. టిక్కెట్ల కేటాయింపులో హుడా మాటే చెల్లుబాటు కావడం సెల్జా శిబిరంలో ఆగ్రహం రేపింది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్రంలో విస్తృత ప్రచారం నిర్వహించినా, ప్రచారానికి గడువు ముగిసే ముందు యాత్ర చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. 2014లో బిజెపి చేతిలో ఓటమి చవిచూసిన కాంగ్రెస్ పార్టీ, 2019 శాసనసభ ఎన్నికల నాటికి కొంతమేర పుంజుకుంది. 2019 లోక్‌సభ ఎన్నికలలో ఆ పార్టీకి ఒక్క స్థానం కూడా రాలేదు. కానీ ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో మళ్లీ పూర్వ వైభవం సంతరించుకున్న సంకేతాలు కన్పించినా, ఆ ఆనందం ఎంతో కాలం నిలవలేదు. కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా జాట్లు, దళితుల ఓట్ల పైనే ఆధారపడడం నష్టం చేకూర్చిందని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. జాట్ వ్యతిరేక ఓట్లన్నీ సంఘటితమై బిజెపికి పడ్డాయి. దళితుల ఓట్లను సైతం ఈసారి బిజెపి కొంతమేర కొల్లగొట్టడం గమనార్హం.

అతి తక్కువ తేడాతో గెలుపోటములు తారుమారు

హర్యానాలోని ఉచన కలాన్, లోహారు, రోహ్‌తక్, దబ్వాలి నాలుగు స్థానాల్లో వెయ్యి కంటే తక్కువ ఓట్ల తేడాతో అభ్యర్థులు గెలిచారు. 14 స్థానాల్లో వెయ్యి నుంచి ఐదు వేల మెజారిటీ, 13 స్థానాల్లో ఇది 5,000 నుండి 10,000 ఓట్ల మధ్య ఉంటుంది. మొత్తం 90 స్థానాలకు గాను 30 స్థానాల్లో పది వేల కంటే తక్కువ ఓట్ల తేడాతో ఆయా పార్టీలు విజయం సాధించాయి. వెయ్యి కంటే తక్కువ ఓట్ల తేడాతో బిజెపి ఒక స్థానంలోనూ, కాంగ్రెస్ రెండు స్థానాల్లోనూ గెలిచాయి. వెయ్యి నుంచి ఐదువేల మధ్య ఓట్ల తేడాతో బిజెపి 10 స్థానాల్లోనూ, కాంగ్రెస్ నాలుగు స్థానాల్లోనూ గెలిచాయి. ఐదు వేల నుంచి పది వేల ఓట్ల మెజారిటీతో ఐదు స్థానాల్లో బిజెపి, ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించాయి. వెయ్యి నుంచి ఐదు వేల ఓట్ల తేడాతో కాంగ్రెస్ ఏడు స్థానాలను కోల్పోయింది.

జమ్ముకాశ్మీర్‌లో పారని బిజెపి పాచిక



శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ఎత్తుగడలు వేసిన బిజెపిని ప్రజలు తిరస్కరించారు. ఆ పార్టీ బలమంతా జమ్మూ ప్రాంతానికే పరిమితమైంది. కాశ్మీర్ లోయలో ఆ పార్టీకి పోటీ చేసేందుకు అభ్యర్థులే కరువయ్యారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి విజయ తీరానికి చేరింది. 2014లో జరిగిన శాసనసభ ఎన్నికలలో అతి పెద్ద పార్టీగా అవతరించి, బిజెపితో పొత్తు పెట్టుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన పిడిపిని ప్రజలు ఆదరించలేదు. ఆ పార్టీ కేవలం మూడు స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎన్నికలలో అనేక చిన్నా చితకా ప్రాంతీయ పార్టీలు పోటీ చేసినప్పటికీ అవి పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. జమ్మూకాశ్మీర్‌లో 2019లో ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన తర్వాత ఇప్పుడు తొలిసారిగా ప్రజా ప్రభుత్వం ఏర్పడేందుకు మార్గం సుగమమైంది. ఈ ఎన్నికలలో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి అంచనాలకు భిన్నంగా మెజారిటీ స్థానాలు గెలుచుకుంది. 'నయా కాశ్మీర్' ప్రజలు బీజేపీని పూర్తిగా తిరస్కరించారు. లోయలో నేషనల్ కాన్ఫరెన్స్ క్లీన్‌స్వీప్ చేసింది. జమ్మూ ప్రాంతంలోని నౌషేరా స్థానంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రైనా పరాజయం పాలవడం ఆ పార్టీకి గట్టి ఎదురు దెబ్బగా చెప్పవచ్చు.

పిడిపి ఘోర వైఫల్యాలను చవిచూడడంపై ఆ పార్టీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తి స్పందిస్తూ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని తెలిపారు.

తాము గతంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూశామని చెప్పారు. 2014 ఎన్నికలలో పిడిపి అతి పెద్ద పార్టీగా అవతరించిన విషయం తెలిసిందే. తన కుమారుడు ఒమర్ అబ్దుల్లాయే ముఖ్యమంత్రి అవుతాడని ఎన్‌సి అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలు తనకు సంతోషాన్ని కలిగించాయని ఎన్‌సి ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా చెప్పారు. తాము ఊహించిన దాని కంటే ఎక్కువగా ప్రజల మద్దతు లభించిందని తెలిపారు. తమను రాజకీయంగా అంతం చేయడానికి ఐదేళ్లుగా ప్రయత్నించిన వారే కనుమరుగయ్యారని అన్నారు. ఒమర్ బద్గాం నియోజకవర్గంలో పిడిపి ప్రత్యర్థిపై 18 వేల ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. కతువా జిల్లాలోని బాషోలీ స్థానంలో సీనియర్ కాంగ్రెస్ నేత చౌదరి లాల్ సింగ్ మరోసారి పరాజయం చవిచూశారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా గెలుపొందిన లాల్ సింగ్ తన కంచుకోట బాషోలీలో నాలుగో విజయం కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. దూరు స్థానంలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మిర్ విజయం సాధించారు. సెంట్రల్ షాల్టెంగ్ స్థానంలో పిసిసి అధ్యక్షుడు తారిక్ కర్రా జయకేతనం ఎగరేశారు. జమ్మూకాశ్మీర్‌లో ఆప్ ఖాతా తెరిచింది. దోడా స్థానంలో ఆ పార్టీ అభ్యర్థి మేహ్‌రాజ్ మాలిక్ విజయం సాధించారు.

ఐదో స్థానానికి డిప్యూటీ సిఎం దుష్యంత్

- 'ఉచన కలాన్'లో బిజెపి విజయం
- 32 ఓట్ల తేడాతో గెలుపు

చండీగఢ్ : హర్యానాలోని ఉచన కలాన్ స్థానం చర్చనీయాంశంగా మారింది. ఈ స్థానం నుంచి బిజెపి అభ్యర్థి దేవేంద్ర అత్రి కేవలం 32 ఓట్ల తేడాతో తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన బ్రిజేంద్ర సింగ్‌పై విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఉచన కలాన్ నియోజకవర్గం డిప్యూటీ సిఎం, జెజెపి అధ్యక్షుడు దుష్యంత్ చౌతాలా గతంలో గెలుపొందిన స్థానం. విచిత్రంగా ఈ సారి ఆయన ఐదో స్థానంలో నిలిచారు. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు సైతం చౌతాలా కంటే అధిక ఓట్లను పొందారు.

ఈ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి దేవేంద్ర అత్రికి 48968 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి బ్రిజేంద్ర సింగ్‌కు 48936 ఓట్లు వచ్చాయి, ఇద్దరి గెలుపోటముల్లో తేడా కేవలం 32 సీట్లు మాత్రమే. కేంద్ర మాజీ మంత్రి బీరేంద్ర సింగ్ కుమారుడు బ్రిజేంద్ర సింగ్ లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపిని వీడి కాంగ్రెస్‌లో చేరారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి టిక్కెట్ లభించనప్పటికీ, అసెంబ్లీ ఎన్నికల్లో బ్రిజేంద్ర సింగ్ ఆధిక్యంలో ఉండగా చివరికి 32 ఓట్ల తేడాతో ఆయన ఓడిపోయారు.

దుష్యంత్ చౌతాలా రాజకీయాలను పరిశీలిస్తే..

దుష్యంత్ చౌతాలా 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బిజెపితో పొత్తు పెట్టుకుని డిప్యూటీ సీఎం అయ్యారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు ఆయన జెజెపి, బిజెపితో తెగదెంపులు చేసుకున్నారు. ఈ సారి దుష్యంత్ చౌతాలాకు 7950 ఓట్లు మాత్రమే వచ్చాయి. దుష్యంత్ చౌతాలా 2019లో 45 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

సత్యమే గెలిచింది

మల్లయోధురాలి నుంచి ఎమ్మెల్యేగా వినేశ్ పోగట్

జులనా : హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో జులనా అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫోగట్ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థిపై 6,015 ఓట్ల తేడాతో గెలుపొందారు. వినేశ్‌కు మొత్తం 65,080 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి యోగేశ్ కుమార్‌కు 59,065 ఓట్లు వచ్చాయి. గెలుపు అనంతరం తన విజయంపై వినేశ్ ఫోగట్ మొదటిసారి స్పందించారు. 'ఇది ఎల్లప్పుడూ దేశంలో పోరాట మార్గాన్ని ఎంచుకునే ప్రతి అమ్మాయి గెలుపు. మహిళల పోరాటం వృథా కాదు. సత్యమే గెలిచింది. ఈ దేశం నాకిచ్చిన ప్రేమను నేను ఎప్పటికీ నిలబెట్టుకుంటాను' అని అన్నారు..

వినేశ్ ఫోగట్ విజయంపై బిజెపి నాయకుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ మాట్లాడుతూ 'ఆమె నా పేరును ఉపయోగించుకొని గెలిస్తే, దాని అర్థం మనం గొప్ప వ్యక్తులం. ఆ పేరుకు అంత శక్తి ఉంది. ఈ పేరుతో గెలవడం ద్వారానే ఆమె పడవ దాటింది. కానీ కాంగ్రెస్ పార్టీ మునిగిపోయింది' అని అన్నారు.

అంతకుముందు బజరంగ్ పునియా మాట్లాడుతూ.. భారతదేశ ముద్దు బిడ్డ వినేశ్ ఫోగట్‌కు అభినందనలు. ఈ పోరు కేవలం ఒక్క జులనా సీటు కోసమే కాదు.. పార్టీల మధ్య కాదు. ఈ పోరాటం దేశంలోని బలమైన అణచివేత శక్తులకు వ్యతిరేకంగా జరిగింది. ఇందులో వినేశ్ విజేతగా నిలిచింది అని అన్నారు.

హర్యానాలో ఆప్‌కు 'జీరో'

- 1.79 శాతం ఓట్లు వచ్చినా ఓటమే
- జమ్మూ కాశ్మీర్‌లో 0.52 శాతం ఓట్లు
- దోడా సీటు కైవసం
- అసెంబ్లీలో అడుగుపెట్టనున్న మెహ్రాజ్ మాలిక్

చండీగఢ్: జమ్మూకాశ్మీర్, హర్యానా అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో తమ అభ్యర్థులను నిలబెట్టిన ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) హర్యానాలో 1.79 శాతం ఓట్లు వచ్చినా 'జీరో'కే పరిమితమైంది. ఆ పార్టీ నుంచి ఒక్కరు కూడా గెలవలేకపోయారు. కానీ జమ్మూ కాశ్మీర్‌లో 0.52 ఓట్లు సాధించి దోడా స్థానానికి పోటీ చేసిన ఆప్ అభ్యర్థి మెహ్రాజ్ మాలిక్ విజయం సాధించారు. ఆమెకు మొత్తం 23,228 ఓట్లు వచ్చాయి. దీంతో మెహ్రాజ్ మాలిక్ అసెంబ్లీలో అడుగుపెట్టబోనున్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ హర్యానా ఎన్నికల్లో ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేశారు. అయినా అక్కడి ఓటర్లు విశ్వసించకపోవడంతో ఆ పార్టీ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఓట్ల శాతం పెరిగినా అభ్యర్థులు ఓటమిపాలయ్యారు. ఈ ఎన్నికల్లో ఆప్‌నకు మొత్తం 1.79 శాతం ఓట్లు వచ్చాయి. అయితే జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆమ్ ఆద్మీ పార్టీకి ఊరటనిచ్చాయి. తొలిసారిగా ఈ పార్టీకి చెందిన ఎమ్మెల్యే రాష్ట్ర అసెంబ్లీలో కూర్చోనున్నారు.

ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. హర్యానాతో పోలిస్తే జమ్మూ కాశ్మీర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటరు శాతం తక్కువగా ఉంది. రాష్ట్రంలో ఆ పార్టీకి 0.52 శాతం ఓట్లు వచ్చాయి.

గవర్నర్‌కు ఆ అధికారం లేదు

- ఉన్నతాధికారులకు సమన్ల జారీపై కేరళ సిఎం

తిరువనంతపురం : ఉన్నతాధికారులకు సమన్లు జారీ చేసే అధికారం గవర్నర్‌కు లేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఉద్ఘాటించారు. ఈ మేరకు ఆయన కేరళ గవర్నర్ అరిఫ్ మహ్మద్ ఖాన్‌కు ఒక లేఖ రాశారు. రాజ్‌భవన్‌లో తన ముందు హాజరు కావాల్సిందిగా డిమాండ్ చేస్తూ చీఫ్ సెక్రటరీకి, రాష్ట్ర పోలీసు చీఫ్‌కు గవర్నర్ జారీ చేసిన ఆదేశాలను ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

బంగారం అక్రమ రవాణా, హవాలా మనీ, ఫోన్ ట్యాపింగ్‌ల గురించి వార్తాపత్రికల్లో వచ్చిన 'కథనాల'ను ఆసరా చేసుకుని చీఫ్ సెక్రటరీ శారదా మురళీధరన్, డిజిపి షేక్ డార్వేష్ సాహెబ్‌లకు గవర్నర్ నేరుగా సమన్లు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల్లోగా తన ముందు హాజరు కావాలని ఆదేశించారు. గవర్నర్ చర్య పూర్తిగా అనుచితమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మంగళవారం ఉదయం ఈ మేరకు గవర్నరుకు ఆయన ఒక లేఖ రాశారు. ఎన్నికైన ప్రభుత్వానికి తెలియజేయకుండా అధికారులను ఇలా ఆదేశించడం గవర్నర్ రాజ్యాంగ అధికారాలను అతిక్రమించడమేనని విజయన్ పేర్కొన్నారు. ఉన్నతాధికారులను ఇలా పిలవడం ప్రజాస్వామిక నిబంధనలకు విరుద్ధమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే భారత రాజ్యాంగంలోని 154, 163, 167 అధికరణలను ఇది సవాల్ చేయడమేనని అన్నారు. రాజ్యాంగపరమైన విధులకు సంబంధించి గవర్నర్‌కు సూచనలు, సలహాలు ఇచ్చే హక్కు కేబినెట్‌కు వుంటుందని ఆయన పునరుద్ఘాటించారు.

సీతారాం ఏచూరికి స్వరాంజలి

ఏచూరి స్ఫూర్తితో ప్రజాస్వామ్య విలువల కోసం పోరాటం

- డెమొక్రటిక్ పార్టీ కోలిన్ కౌంటి అభ్యర్థి సందీప్ శ్రీవాత్సవ
- అమెరికాలో సీతారాం సంస్మరణ సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏచూరి స్ఫూర్తితో ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడాలని డెమొక్రటిక్ పార్టీ కోలిన్ కౌంటి అభ్యర్థి సందీప్ శ్రీవాత్సవ అన్నారు. అమెరికాలోని డల్లాస్ నగరంలో టెక్సాస్ ఇండియా సంకీర్ణం, డల్లాస్ ప్రొగ్రెసివ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యాన ఇటీవల కన్నుమూసిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి గొప్ప మేధావి అని అన్నారు. అమెరికా, భారతదేశం రెండు పెద్ద ప్రజాస్వామ్య దేశాలని చెప్పారు. భారతదేశంలోని ప్రజాస్వామ్య విలువల కోసం ఏచూరి ఎలాగైతే పోరాడారో, అదే స్ఫూర్తితో తాము కూడా అమెరికాలో ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడుతున్నామని తెలిపారు.

నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) మాజీ అధ్యక్షులు బాపయ్య మాట్లాడుతూ... సీతారాం ఏచూరి భారతదేశానికి అందించిన సేవలు చాలా గొప్పవని అన్నారు. జెకె వెంకట్ మాట్లాడుతూ.. మతోన్మాదానికి వ్యతిరేకంగా ఆయన చేసిన అవిశ్రాంత పోరాటాన్ని ప్రశంసించారు. పార్లమెంటులో ప్రజల హక్కుల కోసం ఆయన మాట్లాడిన తీరుని స్మరించుకుంటున్నామని తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి భారతదేశానికి అందించిన సేవలను, సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటులో ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్మిక, కర్షక, విద్యార్థి, మహిళల ప్రయోజనాల కోసం సిపిఎం ఆధ్వర్యాన ఆయన నిర్వహించిన పాత్రను గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వందలాదిమంది హాజరై ఏచూరి చిత్రపటానికి ఘనమైన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, రాజా, చైతన్య, మార్టిన్, లెనిన్, నగేష్, అఖిల, అతుల్ షిండే, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాబాలియా శరణార్థ శిబిరంపై దాడి

- వైమానిక, భూతల దాడుల్లో 43మంది మృతి
- వీధుల్లో చెల్లాచెదురుగా మృత దేహాలు
- దాడిలో హిజ్బుల్లా సీనియర్ కమాండర్ మృతి

నెతన్యాహు మారణహోమం ఆపాలంటూ నిరసన తెలుపుతున్న ఇజ్రాయిల్ పౌరులు

గాజా/ బీరుట్ : లెబనాన్, గాజాల్లో ఇజ్రాయిల్ భీకర దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా గాజాలో జరిగిన దాడుల్లో 43మంది పాలస్తీనియన్లు మరణించారు. బీరుట్ దాడిలో హిజ్బుల్లా సీనియర్ కమాండర్‌ను హత్య చేసినట్లు ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. గాజాలోని జాబాలియా శరణార్థ శిబిరంలో వైమానిక దాడులతో పాటూ ఆర్మీ భూతల దాడులకు కూడా దిగింది. కాల్పులు జరుగుతుండడంతో భయంతో అరుస్తూ ప్రజలు అటూ ఇటూ పరుగులు తీసింది. వీధుల్లో ఎక్కడ చూసినా మృతదేహాలే. వైద్య బృందాలు అక్కడకు చేరుకోవడం కూడా కష్టసాధ్యంగా మారింది. ఇందుకు సంబంధించిన వీడియో మీడియాకు చిక్కింది. పదాతి దాడుల్లో భాగంగా ఒక ఇజ్రాయిల్ సైనికుడిని హతమార్చామని, ఈలోగా థండర్ బాంబుతో ప్రత్యర్థులు విరుచుకుపడ్డారని, దాంతో అల్ తవమ్ ఏరియాలో డజన్ల సంఖ్యలో ప్రజలు మరణించారని హమాస్ సాయుధ విభాగం ఖాసిమ్ బ్రిగేడ్స్ తెలిపింది. మరణించిన వారిలో ఏడుగురు పౌరులు వున్నారు. మొత్తంగా శరణార్థ శిబిరాన్ని చుట్టుముట్టడంతో పరిస్థితి భయానకంగా మారింది. పలు రోజుల నుండి ఈ నిర్బంధం కొనసాగుతోంది. ఇప్పటివరకు గాజాలో మరణించిన వారి సంఖ్య 41,965కి చేరింది. గాయపడిన వారి సంఖ్య 97,590కి పెరిగింది. మరో 10వేల మృతదేహాలు భవన శిథిలాల కింద వుండొచ్చని పాలస్తీనా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

ఇరాన్ నుండి అధునాతన ఆయుధాలు తెప్పించి, వాటిని వివిధ యూనిట్లకు పంపిణీ చేసే బాధ్యతలు నిర్వర్తించే కమాండర్ సొహైల్ హుస్సేనిని హత్య చేసినట్లు ఇజ్రాయిల్ మిలటరీ మంగళవారం తెలిపింది. దీనిపై హిజ్బుల్లా నుండి ఎలాంటి వ్యాఖ్యలు వెలువడలేదు. లెబనాన్‌లో వ్యాధులు పెచ్చరిల్లే ప్రమాదం వుందని డబ్ల్యుహెచ్‌ఓ హెచ్చరించింది. నిర్వాసితుల శిబిరాలు, ఆస్పత్రులు ఎక్కడ చూసినా క్షతగాత్రులతో పరిస్థితులు అధ్వానంగా మారాయని పేర్కొంది. డయేరియా, హెపటైటిస్ ఎ, కలుషిత నీటి వల్ల తలెత్తే ఇతర వ్యాధులు వచ్చే పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొంది.

తీరప్రాంత నగరమైన హైఫాపై వందకు పైగా రాకెట్లు పడినట్లు ఇజ్రాయిల్ ఆర్మీ ప్రకటించింది. కొన్ని రాకెట్లను ఇజ్రాయిల్ వైమానిక రక్షణవ్యవస్థలు అడ్డుకున్నాయని తెలిపింది. దీనిపై వివరాలు సేకరిస్తున్నామని ఆర్మీ తెలిపింది.

అగ్నికి ఆజ్యం !

- ఇజ్రాయిల్‌కు అమెరికా సాయం 1790 కోట్ల డాలర్లు!
- అంతర్జాతీయ నివేదిక వెల్లడి

వాషింగ్టన్ : గాజాలో దాడులను ఆరంభించిన తర్వాత ఇజ్రాయిల్‌కు 1790 కోట్ల డాలర్ల మేరకు మిలటరీ సాయం అందించినట్లు బ్రౌన్ యూనివర్శిటీ విడుదల చేసిన కొత్త నివేదిక పేర్కొంది. యుద్ధ వ్యయాల ప్రాజెక్టు పేరుతో ఈ నివేదికను మంగళవారం విడుదల చేశారు. గాజాలో దాడులకు ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పలు నగరాల్లో ప్రదర్శనలు, కొవ్వొత్తుల ర్యాలీలు, నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నివేదిక వెలువడింది. పైగా ఆ ప్రాంతంలో అమెరికా మిలటరీ కార్యకలాపాలకు అదనంగా మరో 4860 కోట్ల డాలర్లు ఖర్చు పెట్టారని పరిశోధకులు తమ నివేదికలో తెలిపారు. గాజా, లెబనాన్‌ల్లో ఇజ్రాయిల్ దాడులకు మద్దతుగా అమెరికా ఎంత మొత్తం ఖర్చు పెట్టిందో వెల్లడించే అంచనాల్లో ఈ నివేదిక ఒకటిగా వుంది. పైన పేర్కొన్న సాయం కూడా పాక్షికమేనని, పూర్తి స్థాయి సాయం వివరాలను దాచిపెట్టడానికి బైడెన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పరిశోధకులు పేర్కొన్నారు.

గాజాలో 138మంది జర్నలిస్టుల మృతి

గతేడాది కాలంలో గాజాలో ఇజ్రాయిల్ పాల్పడిన దాడుల్లో 138మంది జర్నలిస్టులు మరణించారని అంతర్జాతీయ జర్నలిస్టుల సమాఖ్య (ఐఎఫ్‌జె) పేర్కొంది. వీరిలో 127మంది పాలస్తీనియన్ జర్నలిస్టులు కాగా, ఐదుగురు లెబనాన్, నలుగురు ఇజ్రాయిల్, ఒకరు సిరియాకు చెందిన వారు. ఇజ్రాయిల్ ఆర్మీ వీరిని లక్ష్యంగా చేసుకుందని తెలిపింది. 32 మాసాల పాటు సాగిన ఉక్రెయిన్ యుద్ధంలో 18మంది జర్నలిస్టులు చనిపోయారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అనే ఒకే ఒక్కడు నడుపుతున్న ప్రభుత్వం వల్లనే గాజా, లెబనాన్‌లో యుద్ధాలు జరుగుతున్నాయని పేర్కొంది.

లడఖ్ కార్యకర్తల నిరాహార దీక్షకు సిపిఎం సంఘీభావం

న్యూఢిల్లీ : రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో లడఖ్‌ను చేర్చాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిరవధిక దీక్ష చేపట్టిన లడఖ్ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ప్రభృతులకు సిపిఎం పొలిట్‌బ్యూరో సంఘీభావం తెలియజేసింది. పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్, ఎంపి డాక్టర్ జాన్ బ్రిటాస్ దీక్షా శిబిరాన్ని మంగళవారం సందర్శించి, సంఘీభావాన్ని ప్రకటించారు. లడఖ్ నుండి దేశ రాజధాని వరకు శాంతియుతంగా పాదయాత్ర జరిపిన 150మంది కార్యకర్తలను ఢిల్లీలో ధర్నాకు అనుమతించకపోవడం మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ప్రతిబింబిస్తోందని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో విమర్శించింది. ధర్నాకు అనుమతించకపోగా వారిని అరెస్టు చేసి, వారిపట్ల అనుచితంగా వ్యవహరించడం, లడఖ్ భవన్‌కు మాత్రమే వారిని పరిమితం చేయడాన్ని ఆక్షేపించింది. దాంతో ఆ భవన్‌లోనే వారు నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. లడఖ్ ప్రాంతాన్ని గిరిజనుల ఆమోదం లేకుండా కార్పొరేట్ మైనింగ్ కంపెనీలు, ఇతర ప్రైవేట్ ప్రాజెక్టులకు అప్పజెప్పే యత్నాలకు స్వస్తి పలకాలంటే దీనిని రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలనేది వారి ప్రధాన డిమాండ్. 2019 బిజెపి ఎన్నికల మేనిఫెస్టో కూడా ఈ మేరకు చర్య తీసుకుంటామని హామీ ఇచ్చింది. లడఖ్‌ను ఆరవ షెడ్యూల్‌లో చేర్చడానికి సిపిఎం మద్దతును తెలియజేస్తోంది. సంబంధిత మంత్రులు తక్షణమే సోనమ్ వాంగ్‌చుక్, ఆయన బృందంతో భేటీ కావాలని, ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పసిఫిక్ మహా సముద్రంలో రష్యా, చైనా సంయుక్త గస్తీ

మాస్కో : పసిఫిక్ మహా సముద్రంలోని ఈశాన్య ప్రాంతంలో రష్యా, చైనా నావికా దళాలకు చెందిన నౌకలు సంయుక్తంగా గస్తీ నిర్వహిస్తున్నాయని రష్యా మిలటరీ మంగళవారం తెలిపింది. ఈ నౌకలు జలాంతర్గాముల ఎత్తుగడలు, వ్యూహాలను అభ్యసిస్తున్నాయని పేర్కొంది. సంయుక్త సైనిక విన్యాసాల తర్వాత సంయుక్తంగా గస్తీ చర్యలు చేపట్టారు. రష్యాతో కలిసి సంయుక్త సముద్ర గస్తీ చర్యల్లో పాల్గొంటామని సెప్టెంబరు తొలినాళ్లలో చైనా తెలిపింది. రష్యా నిర్వహించే ఓషన్-2024 వ్యూహాత్మక విన్యాసాల్లో కూడా పాల్గొంటామని పేర్కొంది. జులైలో దక్షిణ చైనాలోని గుయాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో ఝాన్‌జియాంగ్ నగరం చుట్టుపక్కలా గగనతలంలో, సముద్ర జలాల్లో రెండు దేశాలు సంయుక్త విన్యాసాలు చేపట్టాయి. పశ్చిమ దేశాల గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా ముఖ్యంగా అంతర్జాతీయ వ్యవహారాల్లో అమెరికా ఆధిపత్యాన్ని నిరసిస్తూ ఇటీవలి సంవత్సరాల్లో రష్యా, చైనాలు ఆర్థిక, సైనిక సహకారాన్ని పెంపొందించుకుంటున్నాయి. తమ భాగస్వామ్యానికి పరిమితుల్లేవని వారు ప్రకటించారు.

ఎన్నికల కన్నా ముందు సంస్కరణలు తేవాలి

- బంగ్లా నేత యూనస్ వ్యాఖ్యలు

ఢాకా : బంగ్లాదేశ్‌లో ఎన్నికలు నిర్వహించడానికై కచ్చితమైన కాలపరిమితిని విధించడానికి బంగ్లాదేశ్ తాత్కాలిక నేత మహ్మద్ యూనస్ తిరస్కరించారు. ఎన్నికలు నిర్వహించడానికన్నా ముందు సంస్కరణలు తేవాల్సిన అవసరం వుందని స్పష్టం చేశారు. మంగళవారం ప్రచురితమైన ప్రోథమ్ అలో వార్తాపత్రిక ఇంటర్వ్యూలో ఆయన పలు అభిప్రాయాలు పంచుకున్నారు. విద్యార్థి లోకం తిరుగుబాటుతో ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత దేశ ముఖ్య సలహాదారుగా నోబెల్ శాంతి బహుమతి విజేత మహ్మద్ యూనస్ నియమితులయ్యారు. ప్రజాస్వామ్య సంస్థల పునరుద్ధరణ అత్యంత తీవ్రమైన, కష్టమైన సవాలుగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. 'మాలో ఎవరూ కూడా సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగాలని అనుకోవడం లేదు." అని ఆయన స్పష్టం చేశారు. సంస్కరణలనేవి చాలా కీలకమైనవని ఆయన వ్యాఖ్యానించారు. మీరు ఎన్నికలు నిర్వహించాలని అన్నట్టైతే మేం ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా వున్నాం. కానీ సంస్కరణల కన్నా ఎన్నికలు ముందు నిర్వహించడం తప్పు కాగలదని ఆయన అన్నారు. ప్రజాపాలనా వ్యవస్థ పూర్తిగా విచ్ఛిన్నమై పోయిందని, మళ్లీ నియంతృత్వపు పాలనలోకి వెళ్లకుండా నివారించాలంటే సమగ్రంగా ప్రక్షాళన చేయడం చాలా అవసర మని ఆయన పేర్కొన్నారు. సంస్కరణలు అంటే గతంలో ఏం చేశారో అవే పునరావృతం కావడాన్ని అనుమతించబోమన్నారు. హసీనా ప్రభుత్వానికి చెందిన సీనియర్లను లక్ష్యంగా చేసుకుని విచారణలు, దర్యాప్తులను రాజకీయం చేస్తున్నారని యూనస్ ప్రభుత్వంపై విమర్శలు వచ్చాయి. క్రిమినల్ విచారణలో ప్రభుత్వ జోక్యం వుండరాదన్నది తమ ప్రభుత్వ ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థ సంస్కరించబడిన తర్వాత ఎవరు విచారణను ఎదుర్కొనాలి, న్యాయం ఎలా జరగాలి అనే విషయాలు పరిగణనలోకి వస్తాయన్నారు. మీడియా స్వేచ్ఛను తాను కోరుకుంటున్నానని అన్నారు.

కొన్ని ఇబ్బందులున్నాయి

(మొదటి పేజీ తరువాయి)

అని వ్యాఖ్యానించారు. స్టీల్‌ప్లాంట్‌పై శ్వేతపత్రం విడుదల చేస్తామన్నారు.

ఆర్థిక ఇబ్బందులపై ...

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆర్థిక ఇబ్బందులు గురించి ప్రధాని మోడీకి తెలియజేసినట్లు సిఎం చెప్పారు. గత ఐదేళ్లలో కేంద్ర పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేదని ప్రధానికి వివరించానన్నారు. పోలవరం డయాఫ్రం వాల్ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని, అమరావతికి ప్రపంచ బ్యాంకు నిధులు వచ్చేలా చూడాలని కోరినట్లు చెప్పారు. రూ.84 వేల కోట్లతో ఆయిల్ రిఫైనరీ పెడుతున్నారని, దానికి స్థలం గుర్తిస్తున్నారని తెలిపారు. దీనికోసం రామాయపట్నం, మచిలీపట్నం, మూలపాడు ప్రాంతాల్లో చూస్తున్నారని, తాను కృష్ణపట్నం కూడా పరిశీలించాలని చెప్పినట్లు తెలిపారు. లక్ష కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ కోసం ఏపి జెన్‌కో, ఎన్‌పిహెచ్‌సి ఒప్పందం చేసుకున్నాయని, ఈ ప్రాజెక్టును తొందరిలోనే ప్రారంభిస్తామని తెలిపారు. వచ్చే నెలలో విశాఖపట్నంలో భూమి పూజ చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని జాతీయ రహదారుల పెండింగ్ పనులు పూర్తి చేయాలని ప్రధానిని కోరినట్లు చెప్పారు. కేంద్రం నుంచి రావాల్సిన గ్యాస్ రాయితీ గురించి వివరించానని, డిసెంబరు నుంచి అమరావతిలో రోడ్లు, ఇతర నిర్మాణాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

రైల్వే మంత్రితో ..

రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఫోర్ లైన్లు వేయాలని రైల్వే మంత్రిని కోరానని, అమరావతి నుంచి విజయవాడ రైల్వే లైను కోరానని చంద్రబాబు చెప్పారు. మచిలీపట్నం నుంచి రేపల్లెకు రైల్వే లైన్ కనెక్ట్ చేయాలని కోరానని, నరసాపురం- మచిలీపట్నం, రేపల్లె-బాపట్ల లైన్లు ఇవ్వాలని కోరిననట్లు చెప్పారు. సౌత్ ఇండియాలో నాలుగు ముఖ్యమైన నగరాలను (హైదరాబాద్, అమరావతి, చెన్నై, బెంగళూరు) అనుసంధానం చేసేలా బుల్లెట్ రైలు నడిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఈ నాలుగు ఎకానమిక్ హబ్‌లను కవర్ చేస్తూ బుల్లెట్ రైలు పెడితే ఆర్థికపరమైన కార్యకలాపాలు మరింతగా పెరుగుతాయని చెప్పానన్నారు.

50మంది సీనియర్ డాక్టర్ల రాజీనామాలు

- జూనియర్ డాక్టర్ల నిరశనకు సంఘీభావం



కోల్‌కతా : విధుల్లో వుండగా అత్యాచారానికి, హత్యకు గురైన జూనియర్ డాక్టర్‌కు న్యాయం చేయాలని కోరుతూ నిరవధిక నిరశన చేపట్టిన జూనియర్ డాక్టర్లకు సంఘీభావాన్ని ప్రకటిస్తూ ఆర్.జి.కర్ ఆస్పత్రికి చెందిన దాదాపు 50మంది సీనియర్ డాక్టర్లు మంగళవారం రాజీనామా చేశారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాల హెడ్‌ల సమావేశం ఉదయం జరిగిందని, అందులో మూకుమ్మడిగా రాజీనామాలు చేయాలని నిర్ణయించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఆర్‌జి కర్ ఆస్పత్రిలో తమ సహచరులు తీసుకున్న నిర్ణయాన్నే తాము కూడా అనుసరించాలని ఎన్‌ఆర్‌ఎస్ మెడికల్ కాలేజీ అండ్ ఆస్పత్రికి చెందిన సీనియర్ డాక్టర్లు యోచిస్తున్నారని ఆ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలోని జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ డాక్టర్స్ కూడా వారికి సంఘీభావం ప్రకటించింది. అవినీతిమయంగా మారిన ఆరోగ్య వ్యవస్థకు స్వస్తి పలకాలని వారు కోరుతున్నారు.

తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గత నాలుగు రోజులుగా జూనియర్ డాక్టర్లు ఆమరణ నిరశన చేపట్టారు. సమస్యల పరిష్కారానికి ఇంతవరకు సంబంధిత అధికారుల నుండి ఎలాంటి ప్రతిస్పందన లేదని ప్లాట్‌ఫారమ్ ఆఫ్ డాక్టర్స్ ఒక ప్రకటనలో పేర్కొంది. నిరశనలో వున్న వారి ఆరోగ్య పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసింది. కేంపస్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని, రోగులతో స్నేహంగా మెలిగే వ్యవస్థను తీసుకురావాలని కోరుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తాము వారికి సంఘీభావం తెలియజేస్తున్నామన్నారు. ప్రైవేటు రంగంలో వున్న వారు కూడా సముచితమైన కార్యాచరణ చేపట్టాలని ప్లాట్‌ఫారమ్ ఆఫ్ డాక్టర్స్ కోరింది. విధుల్లో చేరాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసినప్పటికీ ఏడుగురు డాక్టర్లు మంగళవారం కూడా ఆమరణ నిరశన కొనసాగించారు.

మీకోసం

కుక్కర్‌లో వండేటప్పుడు విజిల్ నుండి నీళ్లు బయటికి రాకుండా ఉండాలంటే కుక్కర్ మూత అడుగుభాగంలో అంటే విజిల్ గొట్టం చివర రెండు చుక్కల నూనె వేయాలి.

జీవన సౌరభం

ఓడిపోతాననే భయంతో ముందుకు సాగని వ్యక్తి జీవితంలో ఎప్పటికీ విజయం సాధించలేడు.

తిరిగొచ్చిన సాయం

నరసింహపురం స్కూల్లో చదువుతున్న రవి పాఠశాలకు బయలుదేరాడు. ప్రతిరోజూ వాళ్ళ నాన్న స్కూటరు మీదే వెళ్లేవాడు. కానీ ఆరోజు స్కూటరు పాడైంది. అందువల్ల ఆటోలో వెళ్ళమని రవి వాళ్ళ అమ్మ డబ్బులు ఇచ్చి పంపింది. ఆటో కోసం ఎదురు చూస్తుండగా రవి దగ్గరకి ఒక ముసలాయన వచ్చి, 'బాబూ! అన్నం తిని రెండు రోజులైంది. ఏదైనా తినడానికి ఉంటే పెట్టమ'ని అడిగాడు. ఆ రోజు స్కూలు ఒక్కపూటే కావడంతో రవి క్యారేజీ తెచ్చుకోలేదు. వెంటనే ఆటోకని అమ్మ ఇచ్చిన డబ్బులు ఆ తాతకి ఇచ్చేశాడు. డబ్బులు లేకపోవడంతో స్కూలుకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఇంతలో రవి మిత్రుడు వేణు ఆటోలో వస్తూ రవిని చూశాడు. ఆటో ఆపమని డ్రైవరుతో చెప్పాడు. 'అంకుల్ తను మా ఫ్రెండే. నాతోపాటు ఆటోలో ఎక్కుతాడు మీకేమీ అభ్యంతరం లేదుగా' అని ఆటో డ్రైవరుని అడిగాడు. 'ఏమీ అభ్యంతరం లేదు' అని బదులిచ్చాడు ఆటో డ్రైవరు. ఆటో రవి దగ్గరకి వచ్చి ఆగింది. ఆటో ఎక్కమని వేణు, రవిని పిలిచాడు. అయితే 'నా దగ్గర డబ్బులు లేవు. నేను ఎక్కనురా' అని చెప్పాడు రవి. 'ఫరవాలేదులే నేను ఇస్తాను. రేపు నాకు ఇద్దువుగాని' అని రవిని బలవంతంగా ఆటో ఎక్కించాడు వేణు. కాసేపటికి స్కూలు వచ్చింది. ఇద్దరు ఆటో దిగారు. వేణు ఆటోచార్జీలు ఇస్తుండగా, 'వద్దు బాబూ, మీరిదద్దరూ పరులకు సాయం చేయడంలో ఒకరిని మించి మరొకరు ఉన్నారు. ఇంత చిన్నవయసులోనే ఈ లక్షణం మీకు అబ్బింది. నాకు చాలా సంతోషంగా ఉంది' అని పిల్లలిద్దరినీ దగ్గరకి తీసుకుని హత్తుకున్నాడు డ్రైవరు. రవి, వేణుకి ఏమీ అర్థంకాక తెల్లమొహం వేస్తే, 'ఇందాక రవి, ఆ పెద్దాయనకి తన దగ్గర ఉన్న డబ్బులు ఇవ్వడం చూశాను. అలాగే నువ్వు కూడా మీ స్నేహితుడు నడిచి రావడం ఇష్టం లేక నీ దగ్గర ఉన్న డబ్బులు ఆటో చార్జీలకి ఇవ్వడానికి సిద్ధమయ్యావు' అంటూ అసలు విషయం చెప్పాడు డ్రైవరు. 'మంచివారితో స్నేహం మరింత లాభాన్ని చేకూరుస్తుందని నాకు ఇప్పుడే తెలిసింది. రవి వల్ల నా ఆటో డబ్బులు కూడా మిగిలాయి' అనుకుంటూ రవి భుజం మీద చెయ్యి వేశాడు వేణు. ఆటోలో వెళ్లిపోతున్న డ్రైవరు పిల్లలిద్దరినీ అలా చూసి ఎంతో సంతోషించాడు.

- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
ధర్మపురి,
99085 54535.

తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఎనిమిది తేడాలు ఉన్నాయి. అవి ఏమిటో గుర్తించండి.

వి.లోహిత,
9వ తరగతి, అరవింద హైస్కూల్,
కుంచనపల్లి,
గుంటూరు.

నేను గీసిన బొమ్మ

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మానసిక ఆరోగ్యమూ ముఖ్యమే...

ఈరోజుల్లో ప్రతి ఒక్కరూ నిద్రలేచించి మొదలు పడుకునే వరకూ యంత్రంలా పనిచేస్తూనే ఉంటున్నారు. తీవ్ర ఒత్తిడికి గురౌతున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులు, విద్యార్థులు ... ఇలా చాలామంది మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారు. దీనివల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి అనర్థాలన్నింటికీ కారణం మానసిక ఆరోగ్యం బాగుండకపోవటమే. శరీరం ఆరోగ్యంగా బాగుంటే మానసిక ఆరోగ్యం కూడా బాగుంటుంది. అందుకనే మెదడుపై ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉండగలిగితే మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

బి.ప్రభురామ్, ఎండి,
మానసిక వైద్య నిపుణులు,
రామ్ న్యూరో సైకియాట్రి క్లినిక్, బుట్టాయిపేట,
మచిలీపట్నం, సెల్ : 7702713737.

సమస్యలు ఎలా వస్తాయంటే...

మానసిక ఆరోగ్య సమస్యలు మెదడులో ఉండే హార్మోన్ల హెచ్చుతగ్గుల వల్ల వస్తాయి. అంతేకాకుండా కుటుంబ వారసత్వం, ఒత్తిడి (దీర్ఘకాల) శారీరక సమస్యలు కూడా కొంతవరకూ కారణం. అన్ని వయస్సుల వారికి, స్త్రీ, పురుష బేధం లేకుండా అందరికీ ఎప్పుడైనా రావొచ్చు. చాలా మానసిక ఆరోగ్య సమస్యల్లో నిద్రపట్టకపోవటం అనేది ఒక ముఖ్యభాగంగా ఉంటుంది. వైద్యంలో భాగంగా ఇచ్చే మాత్రలతో నిద్ర వచ్చే అవకాశం ఉంది. కానీ అవి నిద్ర మాత్రలు కావు. ఒక వేళ నిద్ర ఎక్కువగా వస్తున్నట్లు అనిపిస్తే డాక్టర్‌ను సంప్రదిస్తే తగ్గించటం లేదా మార్చటం చేస్తారు. చాలా వరకూ మానసిక సమస్యలు ఎక్కువ కాలం ఉంటాయి. కొన్ని నెలల నుంచి సంవత్సరాల వరకూ అరుదుగా జీవితకాలం. దానికి అనుగుణంగా డాక్టర్ పర్యవేక్షణలో మందులు వాడాల్సివుంటుంది. లక్షణాలు త్వరగా తగ్గితే వైద్యం కూడా తక్కువకాలంలోనే ముగించొచ్చు. అంతేకాని మానసిక ఆరోగ్య సమస్యలు వచ్చిన వాళ్లందరూ జీవితాంతం మందులు వాడాల్సివస్తుందని కాదు. అది పూర్తిగా అపోహ మాత్రమే.

వ్యాధులు పలు రకాలు

ముఖ్యంగా మానసిక ఆరోగ్య సమస్యలు, వ్యాధులు చాలా రకాలుగా ఉన్నాయి. అందులో కొన్ని డిప్రెషన్, యాంగ్జైటీ, స్కిజోఫీనియా, డిస్లెకియా, బైపోలార్ డిజార్డర్, ఓసిడి, చిన్నపిల్లల్లో బుద్ధిమాంద్యం, తెలివి తక్కువగా ఉండటం, చదువులో వెనుకబాటు, వృద్ధుల్లో వచ్చే మతిమరుపు, వివిధ రకాల వ్యసనాలు, సెక్స్ సమస్యలు మొదలైనవి. ప్రతివ్యాధికి వాటి లక్షణాలు భిన్నంగా ఉంటాయి.



డిప్రెషన్ : ఈ వ్యాధితో బాధపడుతున్న వారు నిస్సత్తువగా మారిపోతారు. ఏ పనిమీద శ్రద్ధ లేకపోవటం, పదే పదే నెగెటివ్ ఆలోచనలు రావటం, నిద్ర పట్టకపోవటం, తిండి తినకపోవటం, ఇష్టంగా చేసే పనులు కూడా చేయాలని అనిపించకపోవటం, కొన్ని సార్లు చనిపోవాలనే భావనలు, ఒంటరితనం, మిగతావారికి దూరంగా వారిలో వారే బాధపడటం... వంటి లక్షణాలు కనిపిస్తాయి.

యాంగ్జైటీ : ఎక్కువగా కంగారుపడటం, భయపడటం, గుండె వేగంగా కొట్టుకోవటం, తనకేదైనా అయిపోతుందనే అనుమానం, అకస్మాత్తుగా చనిపోతాననే ఆలోచనలు, శారీరకంగా పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నా లోపల మాత్రం విపరీతమైన భయం.

స్కిజోఫ్రినియా : ఈ వ్యాధితో బాధపడేవారు వారిలో వాళ్లే మాట్లాడుకోవటం, అనుమానాలు, చుట్టూ ఉన్న వారు తమగురించి మాట్లాడుకుటుంటున్నారని తనకేదో హాని తలపెడుతున్నారని భయపడుతూ ఉంటారు.

అవగాహనా కార్యక్రమాలు

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ఏటేటా అక్టోబర్ 10న అధికారికంగా జరుపుతున్నారు. దీనికి అనుబంధంగా ఏటేటా ఆ నెల నాలుగో తేదీ నుంచి 10 వరకూ అవగాహనా వారోత్సవాలు జరుపుతున్నారు. ప్రజలకు శారీరక ఆరోగ్య సమస్యల గురించి ఉదా: గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, లివర్, కళ్లు, ఎముకలు, ముక్కు, చెవి, గొంతు మొదలైన భాగాల గురించి వచ్చే వ్యాధులపై అవగాహన కంటే ఈ మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన చాలా తక్కువ. దానికి కారణం వీటి గురించి ఎవ్వరూ చర్చించకపోవటం. కనీసం వాళ్లకు సమస్య ఉన్నా కూడా బయటవారికి చెబితే ఏమనుకుంటారోనని అనుమానంతో, ఇది పిచ్చని హేళన చేస్తారేమోనని భయంతో ఎవ్వరికీ చెప్పకుండా కొన్నిసార్లు వాళ్ల కుటుంబ సభ్యులతో కూడా చర్చించకుండానే వారిలో వారే మధనపడిపోతూ ఉంటారు. చట్ట ప్రకారం మానసిక వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదు. ధైర్యం చెప్పి అండగా నిలబడాలి. పని ప్రదేశాల్లో అవగహేళనలు చేయరాదు

వ్యసనంగా మారుతుందా..

ఎవ్వరి సలహా లేకుండా ఇష్టానుసారం, మందులు, మద్యం, సిగరెట్, గుట్కా, గంజాయి, మత్తు పదార్థాలు సేవిస్తే ఆ క్రమంలో తీసుకునే మోతాదు పెంచుకుంటూ పోతే చివరకు అది లేకపోతే ఉండలేము అనే పరిస్థితి. ఇలాంటి వ్యసనపరులు రక రకాల మానసిక, శారీరక, ఆరోగ్య సమస్యలతో హాస్పిటల్‌కు వస్తారు.

మందులతో తగ్గించొచ్చు

మిగతా శరీర భాగాలకు ఎలాగైతే వ్యాధులొస్తే వైద్యం చేస్తారో అలాగే మెదడులో వచ్చే హార్మోన్ల అసమతుల్యతలను కూడా వైద్యం చేసి నయం చేయొచ్చు. మానసిక వ్యాధుల తీవ్రతను బట్టి కొన్ని సమస్యల ప్రారంభ దశలో తక్కువస్థాయిలో లక్షణాలు ఉంటే కౌన్సెలింగ్ ద్వారా తగ్గే అవకాశం ఉంది. కానీ తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు కేవలం కౌన్సెలింగ్ ద్వారా నయం చేయటం కుదరదు. వ్యాధి తీవ్రతను సైక్రియాటిస్ట్, సైకాలజిస్ట్ అంచనా వేసి వైద్య సలహా ఇస్తారు. కేవలం మెడిటేషన్, యోగా చేయటం ద్వారా లేదా టివిలో కామెడీ వీడియోలు, పాటలు వినటం ద్వారా మానసిక వ్యాధులు నయం కావు. వ్యాధికి అనుగుణంగా మందులు వాడుతూ వీటిని కూడా జత చేయొచ్చు. వైద్యానికి ఇవి ప్రత్యామ్నాయం కాదు. మద్యం, మత్తు, సిగరెట్, గంజాయి, గుట్కా వంటి వ్యసనాలను కూడా తగ్గించొచ్చు. మందులు, ఇంజెక్షన్లు, కౌన్సిలింగ్ ద్వారా వీటిని పూర్తిగా మాన్పించి తిరిగి వారి సాధారణ జీవన శైలికి తీసుకురావొచ్చు.

మానసిక అనారోగ్యం లక్షణాలివే...

- తగినంత ఆహారం తీసుకోకపోవటం
- అతిగా తినడం
- నిద్రలేమి
- అతిగా నిద్రపోవటం
- సామాజికంగా వెలివేసినట్లుగా భావన
- సానుభూతిలేకపోవటం
- భరించలేనట్లుగా శరీర నొప్పులు
- ఏదో కోల్పోయినట్లుగా ఆలోచనలు
- మద్యపానంలో మునగటం
- గందరగోళం
- కోపం
- ఆందోళన
- విచారం
- విపరీతమైన మూడ్ స్వింగ్స్
- తలలో నరాలు వినిపించటం
- తనను లేదా ఇతర వ్యక్తులను బాధపెట్టే ఆలోచనలు
- విచారంగా ఉండటం
- మితిమీరిన భయం



కార్తీ తప్పు లేకపోయినా సారీ చెప్పించారు : ప్రకాశ్ రాజ్

'కార్తీ ఎలాంటి అనసవసర వ్యాఖ్యలు చేయలేదు. తప్పు లేకపోయినా సరే సారీ చెప్పించుకున్నారు. నార్మల్ అయితే క్షమాపణ చెప్పలేకపోయేవాడు. సినిమా రిలీజ్ ఉంది. డిస్ట్రిబ్యూటర్, బయ్యర్ తదితరులకు ఇబ్బంది రాకూడదని చెప్పి ఉంటాడు. సూర్య పేరుతో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేయించుకుని మరీ సారీ చెప్పినట్లు పవన్‌కళ్యాణ్ ప్రచారం చేసుకున్నారు' అంటూ సినీనటుడు ప్రకాశ్‌రాజ్ చేసిన విమర్శలు తాజాగా సంచలనంగా మారాయి. ఈ వీడియో క్లిప్ కాస్త ఇప్పుడు వైరల్ అవుతోంది. 'జస్ట్ ఆస్కింగ్' పేరుతో పవన్‌కళ్యాణ్ తీరును ఖండిస్తూ సోషల్ మీడియా వేదికగా ప్రకాష్‌రాజ్ చాలా ప్రశ్నలు సంధిస్తున్నారు.

అయితే దేనికీ పవన్ కళ్యాణ్ నుంచి సమాధానం లేదు. తాజాగా ఓ తమిళ ఇంటర్వ్యూలో మాట్లాడిన ప్రకాష్‌రాజ్ హీరో కార్తీతో పవన్ సారీ చెప్పించుకున్న విషయం గుర్తించి మాట్లాడారు. తప్పు లేకపోయినా క్షమాపణ చెప్పించుకున్నారని అన్నారు. కార్తీ హీరోగా నటంచిన 'సత్యం సుందరం' సెప్టెంబర్ 28న తెలుగులో విడుదలైంది. దీనికి కొన్ని రోజుల ముందు హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఇందులో యాంకర్ లడ్డు గురించి ఓ ప్రశ్న అడగ్గా... అది సెన్సిటివ్ మేటర్ వద్దులెండి అని కార్తీ అన్నారు. ఇందులో ఏమీ లేనప్పటికీ...పవన్ ఈ విషయాన్ని ఓ ప్రెస్‌మీట్‌లో చెప్పారు. ఎందుకొచ్చిన సమస్యలే అని కార్తీ క్షమాపణ చెప్పారు

'దేవర 2'లో అసలైన మలుపు ఉంది : కొరటాల శివ

ఎన్టీఆర్–కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కిన దేవర సినిమా బాక్సాఫీస్ వద్దు విజయాన్ని నమోదుచేసింది. మొదటిరోజు మిక్సిడ్ టాక్ వచ్చినప్పటికి కలెక్షన్లపై పెద్దగా ప్రభావం చూపించలేదు. విజయపథాన దూసుకుపోతుంది. ఈ సినిమా సీక్వెల్ గురించి దర్శకుల కొరటాల శివ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన కామెంట్లు చేశారు. 'దేవర–2'లో అసలు మలుపు ఉంది. ఇందులో జాన్వీకపూర్ పాత్ర ఎవరూ ఊహించలేనంతగా ఉంటుంది. సీక్వెల్‌లో ఆమె పాత్ర చాలా బలంగా ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే ఆమె పాత్రను చూశాక అందరూ ఆశ్చర్యపోతారు. పార్ట్ 2 మీద నాకు చాలా నమ్మకం ఉంది. తారక్ అభిమానులకు మాటిస్తున్నా. దేవర పార్ట్ 1లో మీరు చూసింది కేవలం 10 శాతం మాత్రమే. సీక్వెల్‌లో అసలు కథ ఉంది. 100 శాతం చూస్తారు. సీట్ ఎడ్జ్‌లో మిమ్మల్ని కూర్చోపెడుతాం. ఊహించ లేనంతగా ట్విస్ట్‌లు ఉంటాయి. కథ ఇప్పటికే పూర్తయ్యింది. అందరికీ మంచి ఫీల్ కలిగేలా సినిమా ఉంటుందని నేను ప్రామిస్ చేస్తున్నా' అంటూ వివరించారు.

11న ఓటీటీలో 'శబరి'



దక్షిణాదిలో విలక్షణ నటిగా గుర్తింపు తెచ్చుకున్న వరలక్ష్మీ శరత్‌కుమార్ నటించిన చిత్రం 'శబరి'. ఆమె ప్రధాన పాత్రలో నటించిన పాన్ ఇండియా చిత్రమిది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషలో విడుదలయ్యింది. ఐదారునెలల తర్వాత ఓటీటీలో ఈనెల 11న విడుదల కానుంది. దసరా సందర్భంగా మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల ఈ మూవీని నిర్మించారు. అనిల్‌కాట్జ్ దర్శకుడు.

'క మాస్ జాతర' పాట విడుదల

కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'క'. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో నయన్‌సారిక, తన్వీరామ్ హీరోయిన్లుగా నటించారు. దర్శకద్వయం సుజీత్, సందీప్ తెరకెక్కించారు. చింతా వరలక్ష్మి సమర్పించారు. చింతా గోపాలరెడ్డి నిర్మించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ సినిమాలోని 'క మాస్ జాతర..' పాట వీడియోను మేకర్లు విడుదల చేశారు. 'ఆడు ఆడు ఆడు నిలువెల్లా పూనకమై ఆడు..ఆడు అమ్మోరే మురిసేలా ఆడు...ఆడు.. ఊరువాడ అదిరేలా ఆడు..' వంటి లిరిక్స్‌తో ఈ పాట సాగుతుంది. సానాపతి భరద్వాజ పాత్రుడు లిరిక్స్ అందించారు. మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సీఎస్‌తో కలిసి దివాకర్, అభిషేక్ ఏఆర్ పాడారు. పొలాకి విజయ్ కొరియోగ్రఫీ అందజేశారు.

దీపావళికి 'పొట్టేల్'

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించిన చిత్రం 'పొట్టేల్'. ఇప్పటికే ఈ చిత్రం నుంచి టీజర్, పోస్టర్లు, పాటలు విడుదలైన విషయం తెలిసిందే. ఈ సినిమాకు సాహిత్ మోతూరి దర్శకత్వం వహించారు. నిషా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిశాంక్‌రెడ్డి కుడితి, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్ సురేష్‌కుమార్ సడిగే నిర్మించారు. టీజర్‌ను డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా ఇటీవల విడుదల చేశారు. దీపావళిని పురస్కరించుకుని ఈనెల 25న ఈ సినిమాను విడుదల చేయనున్నట్లుగా నిర్మాతలు ప్రకటించారు. యువచంద్రకృష్ణ, అనన్యనాగళ్ల, వారి కుమార్తె ఉన్న లుక్, మరో పార్ట్‌లో హీరోని గ్రామస్తులు వెంబడిస్తున్నట్లు ఉండే లుక్‌తో రిలీజ్ డేట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. రూరల్ యాక్షన్ డ్రామాగా 'పొట్టేల్' సినిమా తెరకెక్కింది. కులవివక్ష బాగా ఉన్న మారుమూల తెలంగాణ గ్రామంలో తన కుమార్తెకు మంచి చదువు, జీవితాన్ని అందించాలని కోరుకునే తండ్రిగా హీరో యువచంద్రకృష్ణ కనిపించారు. అదే సమయంలో ఆ ఊరికి పవిత్రమైన గొర్రె తప్పిపోవటంతో గ్రామస్తులు అతనిపై దాడిచేయటం వంటి ఆసక్తికర సన్నివేశాలతో ఓ థ్రిల్లర్‌గా సినిమాను రూపొందించామని మేకర్లు వెల్లడించారు. సీనియర్ నటుడు అజయ్ ముఖ్యమైన పాత్రలో నటించారు. మోనిష్‌భూపతిరాజు సినిమాటోగ్రఫీ అందించారు. కార్తీక శ్రీనివాస్ ఎడిటర్, నార్ని శ్రీనివాస్ ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఓపెనర్లపైనే భారం

- నేడు శ్రీలంకతో కీలక పోరు
- ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్
- రాత్రి 7.30గం॥ల నుంచి

దుబాయ్: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌లో టీమిండియా మరో కీలక పోరుకు సిద్ధమైంది. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో చిత్తు ఓడిన హర్మన్‌ప్రీత్ సేన... రెండో టి20లో పాకిస్తాన్‌పై చెమటోడ్చి నెగ్గింది. సెమీస్ బెర్త్ రేసులో నిలవాలంటే బుధవారం శ్రీలంకతో జరిగే పోరులో టీమిండియా ఘన విజయం సాధిస్తేనే అది సాధ్యం కానుంది. ఈ క్రమంలో తొలుత బ్యాటింగ్‌కు దిగిన క్రమంలో ఓపెనర్లు షెఫాలీ వర్మ, స్మృతి మంధానా ధనా ధన్ బ్యాటింగ్‌తో మెరిస్తే.. ఆ తర్వాత రోడ్రిగ్స్, హర్మన్, రీచా ఘోష్, దీప్తి, రాణించాల్సి ఉంటుంది. పాకిస్తాన్‌పై తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి అద్భుత బౌలింగ్‌లో మెరిసింది. ఈ క్రమంలో శ్రీలంకపైనా మన బౌలర్లు పై సాధిస్తే తక్కువ పరుగులకే ప్రత్యర్థి జట్టును కట్టడి చేయవచ్చు.

భారీ రన్‌రేట్ లక్ష్యంగా..

తొలి టి20లో న్యూజిలాండ్ చేతిలో 58 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసిన హర్మన్‌ప్రీత్ సేన.. పాకిస్తాన్‌పై రన్‌రేట్ పెంపుపై వెనుకబడింది. ఆ జట్టు నిర్దేశించిన 106పరుగుల లక్ష్యాన్ని 18.5ఓవర్లలో ఛేదించడంతో ఆ స్థాయి ప్రదర్శనతో టి20 ప్రపంచకప్‌ను సాధించాలనుకో వడం అత్యాశే. మరోవైపు శ్రీలంక జట్టు ఆడిన రెండు మ్యాచుల్లోనూ ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో ఉంది. ఆ జట్టు కనీసం ఒక్క మ్యాచ్‌లోనైనా గెలవాలన్న ఉత్సాహంతో ఉన్నా.. టీమిండియాపై గెలవాలంటే చెమటోడ్చాల్సిందే. ఇక టీమిండియా విషయానికొస్తే.. గ్రూప్–ఎ చివరి లీగ్ మ్యాచ్‌లో పటిష్ట ఆస్ట్రేలియాతో తలపడాల్సి ఉంది. ఆ జట్టుపై గెలిస్తేనే టీమిండియాకు సెమీస్ బెర్త్ దక్కనుంది.

జట్లు(అంచనా)..

భారత్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), షెఫాలీ, మంధాన, రోడ్రిగ్స్, రీచా ఘోష్(వికెట్ కీపర్), దీప్తి శర్మ, సజన, అరుంధతి, ఆశా శోభన, రేణుక, పూజా వస్త్రాకర్/రాధా యాదవ్.

శ్రీలంక: ఆటపట్టు(కెప్టెన్), గుణరత్నే, హర్షిత, కవిషా, నీలాక్షి, పెరీరా, సంజీవని(వికెట్ కీపర్), సుగంధిక, రణవీర. కాంచన, నిసంసల.

ఆస్ట్రేలియా మహిళల ఘన విజయం

షార్జా వేదికగా మంగళవారం జరిగిన మహిళల టి20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా జట్టు 60పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 148పరుగులు చేసింది. మూనీ(40), పెర్రీ(30) బ్యాటింగ్‌లో రాణించారు. ఛేదనలో న్యూజిలాండ్ మహిళలు 19.2ఓవర్లలో 88పరుగులకే ఆలౌట్ చేశారు. ఆసీస్ బౌలర్ స్కట్(3/3)కి తోడు సథర్లాండ్(3/21), మొలినెక్స్(2/15) మెరిసారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మేఘన్ స్కట్‌కు దక్కింది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా జట్టు సెమీస్‌కు చేరువైంది.

ఇక్కడే ముగించాలి

నేడు బంగ్లాదేశ్‌తో రెండో టి20 • రాత్రి 7.00గం॥ల నుంచి

న్యూఢిల్లీ: తొలి టి20 బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించిన టీమిండియా.. రెండో టి20కి సిద్ధమైంది. యువ క్రికెటర్లతో కూడిన టీమిండియా గ్వాలియర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో అద్భుత బ్యాటింగ్‌తో అలరించింది. బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో సమిష్టిగా రాణించి బంగ్లాను చిత్తుచేసింది. ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియంలో బుధవారం ఈ మ్యాచ్ జరగనుంది. బంగ్లాతో టెస్ట్ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా.. ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలన్నా, సిరీస్‌ను చేజిక్కించుకో వాలన్నా ఈ మ్యాచ్‌లో గెలుపు తప్పనిసరి. తొలి టి20లో అరంగేట్రం చేసిన నెట్ ప్రాక్టీస్‌లో యువ క్రికెటర్లు నితీశ్ రెడ్డి, మయాంక్ యాదవ్ చెమటోడ్చుతున్నారు. వీరి అరంగేట్రంతో రింకు సింగ్, తిలక్ వర్మ బెంచ్‌కే పరిమితుమౌన్నారు. గ్వాలియర్ మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి తన స్పిన్ మాయాజాలంతో బంగ్లా బ్యాటర్లను కట్టడి చేశాడు. ఇక తెలుగు కుర్రాడు నితీష్‌కుమార్ రెడ్డి ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టాడు. రెండు ఓవర్లు బౌలింగ్ చేసి వికెట్లు సాధించకపోయినా.. బ్యాటింగ్‌లో ఫర్వాలేనిపించాడు. 17పరుగులతో అజేయంగా నిలిచి టీమిండియా గెలుపుకు దోహదపడ్డాడు. దీంతో బంగ్లాదేశ్ నిర్దేశించిన 128పరుగుల స్వల్ప లక్ష్యాన్ని టీమిండియా కేవలం 11.5ఓవర్లలోనే ఛేదించింది. దీంతో మూడు టి20ల సిరీస్‌లో టీమిండియా 1–0 ఆధిక్యతలో ఉండగా.. మూడో, చివరి టి20 హైదరాబాద్ వేదికగా శనివారం జరగనుంది.

జట్లు..

భారత్: సూర్యకుమార్(కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్), రియాన్ పరాగ్, హార్దిక్ పాండ్యా, రింకు సింగ్, సుందర్, బిష్ణోయ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్, జితేశ్ శర్మ, వరుణ్ చక్రవర్తి, నితీశ్ రెడ్డి, హర్షిత్ రాణా.

బంగ్లాదేశ్: నజ్ముల్(కెప్టెన్), తంజిద్, లింటన్ దాస్(వికెట్ కీపర్), తౌహిద్, మహ్మదుల్లా, జాకిర్, మెహిదీ, రిషాద్ హొసైన్, ముస్తాఫిజుర్, తస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్, పర్వేజ్, రోక్యుల్ హసన్, షోరిఫుల్, మెహిదీ హసన్.

టి20లకు మహ్మదుల్లా గుడ్‌బై

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్, సీనియర్ బ్యాటర్ మహ్మదుల్లా సంచలన నిర్ణయం తీసుకున్నాడు. టి20 ఫార్మాట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు మంగళవారం ప్రకటించాడు. భారత్‌తో జరిగే మూడు టి20ల సిరీస్ అనంతరం ఈ ఫార్మాట్‌నుంచి వైదొలుగుతున్నట్లు వెల్లడించాడు. 38ఏళ్ల మహ్మదుల్లా 2007లో కెన్యాతో జరిగిన మ్యాచ్‌తో టి20ల్లో అరంగేట్రం చేశాడు. బంగ్లాదేశ్ తరఫున షకీబ్–అల్ హసన్ తర్వాత సీనియర్ క్రికెటర్ మహ్మదుల్లా మాత్రమే. ఈ ఫార్మాట్‌లో సుమారు 17ఏళ్ల 35రోజుల పాటు కొనసాగిన మహ్మదుల్లా యువ క్రికెటర్లకు అవకాశమివ్వాలన్న ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాడు. బంగ్లాదేశ్ తరఫున 139 టి20ల్లో 117.74 స్ట్రయిక్‌రేట్‌తో 2,395పరుగులు చేశాడు.

పాకిస్తాన్ 556ఆలౌట్

- అఘా సల్మాన్ సెంచరీ

ముల్తన్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలిటెస్ట్ పాకిస్తాన్ జట్టు భారీస్కోర్‌ను నమోదు చేసింది. తొలిరోజు షఫీక్, మసూద్ సెంచరీతో రాణించగా.. రెండోరోజైన మంగళవారం అఘా సల్మాన్(104) అజేయ శతకంతో మెరిసాడు. దీంతో పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 556పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ బౌలర్లలో లీచ్‌కు మూడు, అట్కిన్సన్, బ్రాడెన్‌కు రెండేసి, వోక్స్, బషీర్, రూట్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 96పరుగులు చేసింది. కెప్టెన్ పోప్(0) డకౌట్ అయినా.. మరో ఓపెనర్ క్రాలే(64), రూట్(32) బ్యాటింగ్‌లో రాణించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68